www.peoplesnews.in

పీపుల్స్ న్యూస్

హైదరాబాద్

ప్రజల గొంతుక...

దినపత్రిక

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 191 శనివారం, నవంబర్ 28, 2026 , పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక

జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

- ప్రకృతిని కాపాడటం.. పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ లక్ష్యం
- సహజ వనరుల సంరక్షణలో వెనక్కి తగ్గేది లేదు
- చెరువుల పునరుద్ధరణ, కాలుష్య నియంత్రణకు ప్రత్యేక చర్యలు
- క్లైమేట్ కాంక్లేవ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



హైదరాబాద్,నవంబర్ 27 : పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రానికి పెట్టుబడులను తీసుకురావడంతో పాటు ప్రకృతి సంపదను కాపాడుకోవడం కూడా ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ రెండింటినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని వెల్లడించారు. శుక్రవారం హైదరా బాద్‌లో నిర్వహించిన క్లైమేట్ కాంక్లేవ్ కర్టెన్ రైజర్ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. భావితరాలకు సహజ వనరులను అందించేం దుకు ప్రభుత్వం కట్టుబడి మిగతా2లో...

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు కేంద్రం నిర్ణయం

- ప్రస్తుతం 543గా ఉన్న స్థానాలు 850కి చేరే అవకాశం
- రాష్ట్రాల మధ్య ప్రస్తుత సీట్ల నిష్పత్తి 2051 వరకు కొనసాగింపు ప్రతిపాదన
- డీలిమిటేషన్‌తో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు ముడిపెట్టి రాజ్యాంగ సవరణకు కసరత్తు
- నవంబర్ 30 నుంచి పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు



న్యూఢిల్లీ,నవంబర్ 27 : లోక్‌సభతో పాటు రాష్ట్రాల శాసనసభల్లోనూ సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపా దించింది. రాష్ట్రాల మధ్య ప్రస్తుతం కొనసాగుతున్న లోక్‌సభ స్థానాల పంపిణీ నిష్పత్తిని మరో 25 ఏళ్లపాటు, అంటే 2051 వరకు కొనసా గించాలని నిర్ణయించింది. నియోజకవర్గాల పునర్విభ జన ప్రక్రియతో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలును ముడిపెట్టి రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకురావాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించింది. శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ మిగతా2లో...

డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

- ఉదయం 11 గంటలకు పరోక్ష ఎన్నికల నిర్వహణ
- నోటిఫికేషన్ విడుదల చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా

2లో

పట్టణ ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్

- వివరాలు వెల్లడించిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా
- 23 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంతంగా ముగిసిన ఓటింగ్
- ఈ నెల 30న ఓట్ల లెక్కింపు



2లో

డీలిమిటేషన్‌పై విపక్షాల ఉమ్మడి వ్యూహం

- నేడు ఇండియా కూటమి కీలక భేటీ
- పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చ
- కూటమితో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకూ ఆహ్వానం



2లో

గంధమల్ల ప్రాజెక్టు ఏడాదిలో పూర్తి చేస్తాం

- రైతులకు సాగునీటి భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం
- ఆలేరు అభివృద్ధికి రూ.3 వేల కోట్లకు పైగా నిధులతో పనులు
- ఎమ్మెల్యే బీర్ల అయిలయ్యకు మంత్రి పదవి ఇప్పించేందుకు కృషి చేస్తా: కోమటిరెడ్డి



2లో

డ్రగ్స్ రహిత భారత నిర్మాణానికి మహా పాదయాత్ర

- 40 కిలోమీటర్ల మేర సాగిన కిషన్‌రెడ్డి పాదయాత్ర
- మూడు రోజుల కార్యక్రమానికి యువత, విద్యార్థులు, సినీ ప్రముఖుల మద్దతు
- మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని చిరంజీవి పిలుపు



2లో

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

- వెలుగుమట్లలో 310 ఇళ్ల నిర్మాణాల పరిశీలన
- మిగిలిన పనులను పది రోజుల్లో పూర్తి చేయాలని మంత్రి తుమ్మల ఆదేశం
- త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవం



2లో



అమెరికాలో బాంబ్ సైక్లోన్ బీభత్సం

- భారీ వర్షాలు, ఈదురుగాలులతో అతలాకుతలమైన పలు రాష్ట్రాలు
- 9 లక్షలకుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేత

2లో

గురుకుల విద్యార్థుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్
- డిసెంబరు 11 నుంచి గ్రామగ్రామాన ఖేలో ఇండియా ఉత్సవాలు
- తెలంగాణను దేశంలోనే అగ్రగామి క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం



2లో

లోక్‌సభ స్థానాలు 50 శాతం పెంపునకు కేంద్రం నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

సమావేశంలో ఈ ప్రతిపాదనలకు ఆమోదం తెలిపినట్లు సమాచారం. ప్రస్తుతం 543 స్థానాలున్న లోక్‌సభలో 50 శాతం పెంపు జరిగితే సభ్యుల సంఖ్య సుమారు 850కి చేరే అవకాశం ఉంది. రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో ప్రస్తుతం ఉన్న నిష్పత్తిని యథాతథంగా కొనసాగించాలని ప్రతిపాదించారు. 1971 జనాభా లెక్కల ఆధారంగా నిర్ణయించిన రాష్ట్రాల ప్రాతినిధ్య నిష్పత్తిని మరో 25 ఏళ్లపాటు కొనసాగించడం ద్వారా జనాభా పెరుగుదల ఆధారంగా రాష్ట్రాల మధ్య సీట్ల పంపిణీలో మార్పులు రాకుండా చూడాలని కేంద్రం భావిస్తోంది. ముఖ్యంగా జనాభా నియంత్రణను సమర్థంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు డీలిమిటేషన్ వల్ల రాజకీయ ప్రాతినిధ్యంలో నష్టం జరగకుండా ఈ ప్రతిపాదన తీసుకొచ్చినట్లు తెలుస్తోంది. 2023లో ఆమోదించిన మహిళా రిజర్వేషన్ చట్టాన్ని 2029 ఎన్నికల నాటికి అమలు చేయాలన్నది కేంద్రం లక్ష్యంగా కనిపిస్తోంది. ఇందుకోసం జనగణన, నియోజకవర్గాల పునర్విభజనకు సంబంధించిన నిబంధనల్లో మార్పులు చేయాలని ప్రతిపాదిస్తోంది. ఈ అంశాలపై చర్చించేందుకు నవంబర్ 30 నుంచి లోక్‌సభ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. డిసెంబర్ 2న రాజ్యసభ సమావేశం కానుంది. **ప్రతిపక్షాల అభ్యంతరాలు** కేంద్ర ప్రతిపాదనలపై ప్రతిపక్షాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. డీలిమిటేషన్ అంశంపై ఉమ్మడి కార్యాచరణ రూపొందించేందుకు ఇండియా కూటమి శనివారం కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశం కానుంది. కేంద్ర ప్రతిపాదనలను వ్యతిరేకించాలని చర్చించనున్నట్లు కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తెలిపారు. మహిళా రిజర్వేషన్ల అమలుకు డీలిమిటేషన్‌ను ముడిపెట్టాల్సిన అవసరం లేదని బీజేడీ అభిప్రాయపడింది. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల పరిధిలోనే మహిళలకు రిజర్వేషన్లు అమలు చేయవచ్చని పేర్కొంది. మరోవైపు డీలిమిటేషన్ బిల్లును ప్రస్తుత రూపంలో అంగీకరించబోమని సీపీఐ ఎంపీ పి. సంతోష్‌కుమార్ స్పష్టం చేశారు. డీలిమిటేషన్ పేరుతో రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా నియోజకవర్గాల స్వరూపాన్ని మార్చే ప్రమాదం ఉందని ఆర్జేడీ ఎంపీ మనోజ్ ఝా ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవద్దని సీపీఐ(ఎం) ఎంపీ జాన్ బ్రిట్టాస్ విమర్శించారు. ఈ ప్రతిపాదనలపై పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కీలక చర్చ జరిగే అవకాశం ఉంది.

పర్యావరణ పరిరక్షణకు పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

ఉందని, ఈ క్రమంలో ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గబోమని స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణలో తెలంగాణకు ప్రత్యేకమైన చరిత్ర, వారసత్వం ఉన్నాయని గుర్తుచేశారు. కాకతీయుల కాలం నుంచి కొమరం భీం వరకు ప్రకృతిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని చాటిచెప్పిన గొప్ప సంప్రదాయం మనకుందని అన్నారు. హైదరాబాద్‌లో ఒకప్పుడు 1,300 చెరువులు ఉండగా ప్రస్తుతం వాటి సంఖ్య 700కు తగ్గిపోయిందని సీఎం ఆవేదన వ్యక్తం చేశారు. చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు కోసమే హైడ్రాను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంబర్‌పేట బతుకమ్మ కుంట, హైటెక్ సిటీలోని తుమ్మిడికుంటను కబ్జాల నుంచి విడిపించి పునరుద్ధరించినట్లు వివరించారు. మూసీ నది పునరుజ్జీవ ప్రాజెక్టును కూడా పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల పునరావాసాన్ని దృష్టిలో పెట్టుకుని చేపట్టినట్లు పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావంతో హైదరాబాద్‌లో భారీ వర్షాలు, వరదల ముప్పు పెరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్‌నినో ప్రభావంతో తాగునీటి సమస్యలు తలెత్తుతున్నాయని, రానున్న ఎనిమిది నెలలు వర్షాలు తక్కువగా కురిసే అవకాశాలున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను రాజకీయాలకు అతీతంగా ఎదుర్కోవాల్సిన అవసరం ఉందన్నారు. రైతులు నీటి లభ్యతను దృష్టిలో పెట్టుకుని పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కాలుష్యాన్ని తగ్గించేందుకు నగరంలోని కాలుష్యకారక పరిశ్రమలను తరలించామని, బస్సులు, ఆటోలను విద్యుత్ వాహనాలుగా మార్చే దిశగా చర్యలు తీసుకుంటున్నామని సీఎం తెలిపారు. సంప్రదాయేతర ఇంధన వనరులను ప్రోత్సహిస్తున్నామని, ఆహార, ఔషధ కల్తీని అరికట్టేందుకు కఠిన చర్యలు చేపడుతున్నామని చెప్పారు. మాదకద్రవ్యాల నియంత్రణలోనూ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. పర్యావరణ పరిరక్షణ అనేది ఒక్క ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రజలు, సంస్థలు, పారిశ్రామికవేత్తలు కూడా భాగస్వాములు కావాలని రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకులు శ్రీశ్రీ రవిశంకర్, వాటర్‌మ్యాన్ రాజేంద్రసింగ్, పద్మశ్రీ చింతల వెంకట్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత భారత

నిర్మాణానికి మహాపాదయాత్ర

హైదరాబాద్,నవంబర్ 27 : దేశంలో మత్తు పదార్థాల వినియోగాన్ని అరికట్టి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యంగా కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి చేపట్టిన 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త్ భారత్' మహాపాదయాత్ర శుక్రవారం ముగిసింది. నవంబర్ 25న అంబర్‌పేటలోని మహంకాళి ఆలయం వద్ద ప్రారంభమైన ఈ పాదయాత్ర మూడు రోజుల పాటు నగరంలోని పలు ప్రాంతాల మీదుగా సుమారు 40 కిలోమీటర్లు సాగి జూబ్లీహిల్స్‌లో ముగిసింది. యువత, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు, సినీ ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక సందేశానికి మద్దతు తెలిపారు. పాదయాత్ర ముగింపు సందర్భంగా జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూల్ మైదానంలో నిర్వహించిన సభలో మెగాస్టార్ చిరంజీవి, ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్, ఏఐజీ ఆస్పత్రుల వ్యవస్థాపకుడు డాక్టర్ డి. నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. డ్రగ్స్ రహిత భారత నిర్మాణం యువత చేతుల్లోనే ఉందని అన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ తమ శక్తిని దేశాభివృద్ధికి వినియోగించాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్ర రాజకీయాలకు అతీతంగా నిర్వహించామని,

అన్ని వర్గాల ప్రజల నుంచి స్వచ్ఛందంగా మద్దతు లభించిందని తెలిపారు. చిరంజీవి మాట్లాడుతూ యువత తలుచుకుంటే సమాజంలో గొప్ప మార్పు తీసుకురాగలరని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపాలని, దేశ భవిష్యత్తును కాపాడాలని సూచించారు. శ్రీశ్రీ రవిశంకర్, డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి కూడా డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమానికి తమ మద్దతు తెలిపారు. మూడు రోజుల పాదయాత్రలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు. మొదటి రోజు సినీ నటులు నిఖిల్, పాయల్ రాజ్‌పుత్, రెండో రోజు బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపీచంద్, నటుడు బెల్లంకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చివరి రోజు నటులు నాగార్జున, సాయికుమార్, శివాజీ, దర్శకుడు బోయపాటి శ్రీను తదితరులు పాదయాత్రలో అడుగులు కలిపారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. యువతను వ్యసనాల నుంచి కాపాడేందుకు ప్రభుత్వాలు, విద్యాసంస్థలు, కుటుంబాలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని ఈ కార్యక్రమం పిలుపునిచ్చింది.

గంధమల్ల ప్రాజెక్టు ఏడాదిలో పూర్తి చేస్తాం

ఆలేరు,నవంబర్ 27 : ఆలేరు ప్రాంత రైతుల చిరకాల స్వప్నమైన గంధమల్ల రిజర్వాయర్ నిర్మాణాన్ని ఏడాదిలోగా పూర్తి చేస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రాజెక్టు పూర్తయితే ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి మంత్రి హాజరై, నూతన చైర్మన్ సుధాగాని మల్లేశం గౌడ్, వైస్ చైర్మన్ ఎం.ఏ. ఏజాజ్‌తో పాటు పాలకవర్గ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించేలా మార్కెట్ కమిటీలు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. రైతులకు అవసరమైన గోదాములు, మార్కెట్ సదుపాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని మంత్రి తెలిపారు.

గురుకుల విద్యార్థుల క్రీడా ప్రతిభకు ప్రోత్సాహం

- రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్

- డిసెంబరు 11 నుంచి గ్రామగ్రామాన ఖేలో ఇండియా ఉత్సవాలు

- తెలంగాణను దేశంలోనే అగ్రగామి క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

హైదరాబాద్, నవంబర్ 27 : గురుకుల విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసి రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా తుర్కపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, జూనియర్ కళాశాల ప్రాంగణంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి క్రీడా పోటీలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఒలింపిక్ జ్యోతిని వెలిగించి జాతీయస్థాయి క్రీడాకారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. చదువుతోపాటు క్రీడలు కూడా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తాయని అన్నారు. విద్యార్థులు క్రీడలను నిర్లక్ష్యం చేయకుండా చదువుకు ఇచ్చినంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉన్నత స్థాయికి చేరుకోవడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగాలు పొందే అవకాశాలు కూడా ఉంటాయని తెలిపారు. డిసెంబరు 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా గ్రామగ్రామాన 'ఖేలో ఇండియా' క్రీడా ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రకటించారు. తెలంగాణను దేశంలోనే ప్రముఖ క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ముఖ్యమంత్రి ఆలోచనలకు అనుగుణంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. గురుకుల విద్యార్థులకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం, క్రీడా సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. రాష్ట్రంలోని జ్యోతిబా పూలే గురుకులాల్లో సుమారు 1.70 లక్షల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని మంత్రి తెలిపారు. విద్యార్థులు గొప్ప లక్ష్యాలను నిర్దేశించుకుని కఠోర శ్రమతో వాటిని సాధించాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, మానసిక స్థైర్యాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, ఎంజేపీ గురుకులాల కార్యదర్శి సైదులు, జిల్లా కలెక్టర్ మను చౌదరి, అలియాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శిరీషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ మేయర్, వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలు

అమరావతి,నవంబర్ 27 :

ఆంధ్రప్రదేశ్‌లో మున్సిపల్ కార్పొరేషన్ల డిప్యూటీ మేయర్లు, మున్సిపాలిటీల వైస్ చైర్‌పర్సన్ల ఎన్నికలకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించింది. డిసెంబరు 5వ తేదీ ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. రాష్ట్రంలోని నాలుగు మున్సిపల్ కార్పొరేషన్లు, 19 మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో ఈ ఎన్నికలు జరగనున్నాయి. గతంలో వాయిదా పడిన నర్సీపట్నం, మాచర్ల మున్సిపాలిటీల వైస్ చైర్‌పర్సన్ ఎన్నికలను కూడా అదే రోజు నిర్వహించనున్నారు. డిసెంబరు 5న ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాకపోతే డిసెంబరు 6న చేపట్టాలని ఎన్నికల సంఘం సూచించింది. ప్రత్యేక సమావేశాలకు సంబంధించి సభ్యులకు డిసెంబరు 1వ తేదీలోగా నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది. ఎన్నికలను చేతులెత్తే పద్ధతిలో నిర్వహించనున్నట్లు కమిషనర్ తెలిపారు.

పట్టణ ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్

అమరావతి,నవంబర్ 27 :

ఆంధ్రప్రదేశ్‌లో రెండో విడత పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 63.44 శాతం పోలింగ్ నమోదైనట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. గురువారం జరిగిన పోలింగ్‌కు సంబంధించిన వివరాలను శుక్రవారం విడుదల చేశారు. రాష్ట్రంలోని 23 పట్టణ స్థానిక సంస్థల పరిధిలో 1,009 వార్డుల్లో పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని తెలిపారు. మొత్తం 24,98,312 మంది ఓటర్లకు గాను 15,85,031 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారని పేర్కొన్నారు. మార్కాపురం జిల్లా పొదిలిలో అత్యధికంగా 77.90 శాతం, ప్రకాశం జిల్లా కందుకూరులో 76.67 శాతం పోలింగ్ నమోదైంది. శ్రీకాకుళం కార్పొరేషన్‌లో అత్యల్పంగా 54.67 శాతం ఓటింగ్ నమోదైంది. ఎన్నికల నిర్వహణకు సహకరించిన ఓటర్లు, ఎన్నికల సిబ్బంది, పోలీసు శాఖకు అనిల్ చంద్ర పునేఠా కృతజ్ఞతలు తెలిపారు. ఈ నెల 30న ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందని, ప్రక్రియ పూర్తయిన వెంటనే ఫలితాలు వెల్లడిస్తామని తెలిపారు.

డీలిమిటేషన్‌పై విపక్షాల ఉమ్మడి వ్యూహం

న్యూఢిల్లీ, నవంబర్ 27 :

కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించనున్న నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) అంశంపై ఉమ్మడి వ్యూహాన్ని ఖరారు చేసేందుకు ఇండియా కూటమి, ఇతర ప్రతిపక్ష పార్టీల నేతలు శనివారం సమావేశం కానున్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే నివాసంలో ఉదయం 11.30 గంటలకు ఈ భేటీ జరగనుంది. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలకు ముందు అనుసరించాల్సిన కార్యాచరణపై నేతలు చర్చించనున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ సమావేశం వివరాలను వెల్లడించారు. డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేడీ వంటి ఇండియా కూటమిలో లేని ప్రతిపక్ష పార్టీలను కూడా సమావేశానికి ఆహ్వానించినట్లు తెలిపారు. కేంద్రం తీసుకురానున్న ప్రతిపాదనలపై అన్ని పార్టీలతో చర్చించి ఉమ్మడి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ల అమలును ముడిపెడుతూ కేంద్రం రాజ్యాంగ సవరణ బిల్లు తీసుకురావచ్చన్న ప్రచారం నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత ఏర్పడింది. లోక్‌సభ స్థానాల సంఖ్యను పెంచే ప్రతిపాదనపైనా ప్రతిపక్షాలు తమ అభిప్రాయాలను వెల్లడించనున్నాయి. రాష్ట్రాల మధ్య ప్రాతినిధ్య నిష్పత్తి, దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలపై కూడా చర్చించే అవకాశం ఉంది. నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సభలో ప్రభుత్వ ప్రతిపాదనలను ఎలా ఎదుర్కోవాలి, అన్ని ప్రతిపక్ష పార్టీల మధ్య సమన్వయం ఎలా సాధించాలనే అంశాలపై నేతలు కార్యాచరణ రూపొందించనున్నారు.

అమెరికాలో బాంబ్ సైక్లోన్ బీభత్సం

న్యూయార్క్,నవంబర్ 27 : అమెరికాలో బాంబ్ సైక్లోన్ తీవ్ర బీభత్సం సృష్టించింది. భారీ వర్షాలు, ఈదురుగాలులు, మంచు కారణంగా న్యూయార్క్, న్యూజెర్సీ సహా పలు రాష్ట్రాల్లో జనజీవనం స్తంభించింది. తుపాను ప్రభావంతో 9 లక్షలకుపైగా ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. చెట్లు విరిగిపడి ఇళ్లపై పడటంతో ఆస్తి నష్టం సంభవించింది. పెన్సిల్వేనియా, న్యూజెర్సీ రాష్ట్రాలను కలిపే కొమోడోర్ బ్యారీ వంతెన దెబ్బతినడంతో అధికారులు రాకపోకలను నిలిపివేశారు. మేరీల్యాండ్‌లో ఇళ్లపై చెట్లు కూలిన ఘటనలపై 300కు పైగా ఫిర్యాదులు అందాయి. న్యూయార్క్‌లో వరద నీటిలో చిక్కుకున్న వాహనాల నుంచి ప్రయాణికులను సహాయక సిబ్బంది రక్షించారు. తుపాను కారణంగా వందలాది విమాన సర్వీసులు రద్దు కాగా, మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. థాంక్స్‌గివింగ్ వేడుకల కోసం ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల దృష్ట్యా అత్యవసరం కాని ప్రయాణాలను వాయిదా వేసుకోవాలని అధికారులు ప్రజలకు సూచించారు. వాతావరణ పీడనం 24 గంటల్లోనే అసాధారణంగా పడిపోవడం వల్ల ఏర్పడే తీవ్ర తుపానును 'బాంబ్ సైక్లోన్'గా పిలుస్తారు. ఈ తుపాను ప్రభావంతో అమెరికాలోని పలు ప్రాంతాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి.

ఇందిరమ్మ ఇళ్ల పనులు త్వరగా పూర్తి చేయాలి

ఖమ్మం, నవంబర్ 27 :

ఖమ్మం నగరంలోని వెలుగుమట్లలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్‌తో కలిసి 15వ డివిజన్‌లోని భూదాన్ భూమిలో నిర్మిస్తున్న 310 ఇళ్ల కాలనీని సందర్శించారు. నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను మరో పది రోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కాలనీలో పేదల సౌకర్యార్థం నిర్మిస్తున్న బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కు, డ్రైనేజీ, ఓపెన్ జిమ్ పనులను మంత్రి పరిశీలించారు. అన్ని పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా త్వరలోనే ఈ ఇళ్లను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. వెలుగుమట్లలో గతంలో కొందరు వ్యక్తులు సంఘాల పేరుతో నిరుపేదలకు నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేశారని మంత్రి పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించగా, భూదాన్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకొని నిజమైన పేదలకు ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించాలని హైకోర్టు ఆదేశించిందని వివరించారు. కోర్టు ఉత్తర్వులు, ముఖ్యమంత్రి నిర్ణయం మేరకు అర్హులైన నిరుపేదల కోసం 310 ఇళ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ పర్యటనలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీరామ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, నగరపాలక సంస్థ డీఈ నవ్యజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

బిల్డర్ బలమా? అధికారుల బలహీనతా?

- అక్రమ నిర్మాణదారుడికి జీహెచ్ఎంసీ చట్టాలంటే లెక్కలేదా? అధికారుల హెచ్చరికలంటే భయమే లేదా?
- నోటీసుల మీద నోటీసులు.. నిర్మాణం మాత్రం యథేచ్ఛగా! ఇదేం టౌన్ ప్లానింగ్ పాలన?
- సీలింగ్ చేస్తామన్న అధికారులు ఏం చేస్తున్నారు? బిల్డర్‌కు ఇచ్చిన గడువు గాలిలో కలిసిపోయిందా?
- అక్రమ నిర్మాణాన్ని ఆపలేని అధికార యంత్రాంగం ఎందుకు? చేతకానితనమా.. వెనుక ఏదైనా ఒత్తిళ్లున్నాయా?
- చట్టాన్ని అమలు చేయాల్సిన అధికారులే ప్రేక్షకపాత్ర పోషిస్తే అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట పడేదెలా?
- బిల్డర్ ఇష్టమే చట్టమా? జీహెచ్ఎంసీ ఉత్తర్వులే బేఖాతరైతే సామాన్యుడికి న్యాయం ఎక్కడ?
- నోటీసులు జారీ చేసి ఫైళ్లలో భద్రపరచడమే అధికారుల విధా? క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకునేదెప్పుడు?
- అక్రమ నిర్మాణంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారుల మౌనం వెనుక మర్మమేమిటి?
- సెల్లార్ నుంచి నాలుగు అంతస్తుల వరకు ఉల్లంఘనలు.. అయినా కదలని టౌన్ ప్లానింగ్ యంత్రాంగం!
- అక్రమ నిర్మాణానికి అడ్డుకట్ట వేయలేని అధికారులు కుర్చీలకు పరిమితమయ్యారా?



జూబ్లీహిల్స్ , నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :నిబంధనలు ఉల్లంఘించి నిర్మాణాలు చేపడుతున్న బిల్డర్లపై చర్యలు తీసుకోవాల్సిన టౌన్ ప్లానింగ్ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారా? లేక అధికారుల ఆదేశాలనే బిల్డర్లు బేఖాతరు చేస్తున్నారా? అన్న ప్రశ్నలు ఇప్పుడు యూసుఫ్‌గూడ పరిధిలో తలెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సర్కిల్--38 పరిధిలోని శ్రీనివాసనగర్ వెస్ట్, ఇంటి నంబర్ 8-3-214/6/లూ వద్ద సెల్లార్‌తో పాటు మొదటి, రెండో, మూడో, నాలుగో అంతస్తులకు సంబంధించి అనధికార నిర్మాణాలు చేపట్టినట్లు జీహెచ్ఎంసీ అధికారిక నోటీసులో పేర్కొంది. అయినప్పటికీ నిర్మాణ పనులు ఆగడం లేదన్న ఆరోపణలు అధికారుల పనితీరుపై అనుమానాలకు తావిస్తున్నాయి.

● నోటీసులిచ్చినా నిష్ప్రయోజనమేనా?

సదరు నిర్మాణంపై యూసీఐఎంఎస్ వెబ్‌సైట్‌లో యూసీ నంబర్ 2141తో కేసు నమోదు చేసినట్లు నోటీసులో స్పష్టంగా ఉంది. 05-02-2026న షోకాజ్ నోటీసు జారీ చేయడంతో పాటు అదే రోజు వ్యక్తిగత విచారణ నిర్వహించినట్లు, 09-03-2026న స్పీకింగ్ ఆర్డర్స్ జారీ చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. అనధికార నిర్మాణాలు తొలగించాలని ఆదేశించినప్పటికీ సంబంధిత వ్యక్తి వివరణ ఇవ్వలేదని, అక్రమ నిర్మాణాలను కూడా తొలగించలేదని నోటీసులో వెల్లడించారు.



● 24 గంటల గడువు.. సీలింగ్ హెచ్చరిక ఎక్కడ?

జీహెచ్ఎంసీ చట్టం 1955లోని సెక్షన్ 461-ప్రకారం 28-09-2026న నోటీసు నంబర్ 2141/.206/2026 జారీ చేశారు. 15 రోజుల్లో అనధికార నిర్మా ణా లు తొలగించాలని, లేనిపక్షంలో సెక్షన్ 636, 461కింద తదుపరి చర్యలు తీసుకు ంటామని హెచ్చరించారు. అంతేకాకుండా 24 గంటల్లో ప్రాంగణాన్ని ఖాళీ చేయాలని, లేని పక్షంలో భవనానికి సీలింగ్ వేస్తామని స్పష్టం చేశారు.

● చట్టం కంటే బిల్డర్ ఆదేశాలే బలమా?

ఇన్ని నోటీసులు, ఆదేశాలు జారీ చేసినా నిర్మాణం కొనసాగుతోందన్న ఆరోపణలు నిజమైతే టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పట వరకు తీసుకున్న చర్యలేమిటి? సీలింగ్ హెచ్చరిక ఇచ్చిన అధికారులు దానిని అమలు చేశారా? అక్రమ నిర్మాణాన్ని ఎందుకు అడుకోలేకపోతున్నారు? బిల్డర్‌కు అంతటి పలుకుబడి ఉందా? లేక అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి. అక్రమ నిర్మాణాల వెనుక ముడుపుల వ్యవహారం ఏమైనా ఉందా? అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. నోటీసులు జారీ చేయడమే కాకుండా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై లేదా? నిబంధనలు ఉల్లంఘించిన నిర్మాణంపై తక్షణమే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వెల్లడించాలని స్థానికులు కోరుతున్నారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు!

- రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ పోక్సో కోర్టు కీలక తీర్పు.. రూ.21 వేల జరిమానా
- బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశం.. పోలీసుల సమర్థ దర్యాప్తుతో నిందితుడికి శిక్ష

హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :మైనర్ బాలికను అపహరించి లైంగిక దాడికి పాల్పడిన కేసులో నిందితుడికి రాజేంద్రనగర్ ఫాస్ట్‌ట్రాక్ ప్రత్యేక పోక్సో కోర్టు కఠిన శిక్ష విధించింది. కైలాష్ సింగ్ (32) అనే నిందితుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.21 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి టి. శ్రీనివాస్ శుక్రవారం (నవంబర్ 27) తీర్పు వెలువరించారు. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం చెల్లించాలని ఆదేశించారు.

● నిశ్చితార్థం రద్దు చేసుకున్నా వేధింపులు ఆగలేదు!

మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసుల వివరాల ప్రకారం.. బాధితురాలి తల్లి ఆమె చిన్నతనంలోనే మరణించడంతో అమ్మమ్మ వద్ద పెరిగింది. గతంలో మంగళ్‌హాట్‌కు చెందిన కైలాష్ సింగ్‌తో ఆమెకు నిశ్చితార్థం జరిగింది. అయితే నిందితుడికి అప్పటికే వివాహమైన విషయం తెలియడంతో కుటుంబ సభ్యులు
ఆ నిశ్చి తార్థాన్ని రద్దు చేశారు. అనంతరం అతను మరో వివాహం చేసుకున్నప్పటికీ బాధితురాలిని తనను వివాహం చేసుకోవాలంటూ వేధిం పు లకు గురిచేసినట్లు కేసు వివరాలు వెల్లడిస్తున్నాయి.

●బలవంతంగా తీసుకెళ్లి లైంగిక దాడి!

నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలి కుటుంబం మంగళ్‌హాట్ నుంచి లక్ష్మీగూడకు నివాసం మార్చుకుంది. అయినప్పటికీ 2021 డిసెంబర్ 15న రాత్రి 8.30 గంటల సమయంలో కిరాణా దుకాణానికి వెళ్తున్న బాలికను కైలాష్ సింగ్ బలవంతంగా తన స్కూటీపై ఎక్కించుకుని యాదగిరిగుట్టకు తీసు కెళ్లా డు. అక్కడ ఆలయంలో వివాహం చేసు కున్న అనంతరం హైదరాబాద్‌లోని హబీబ్ నగ ర్‌లో అద్దె గదిలో ఉంచి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

●నిందితుడు పరారీ.. పోలీసులను ఆశ్రయించిన బాధితురాలు.

డిసెంబర్ 23న తనపై మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలుసుకున్న నిందితుడు బాధితురాలిని హబీబ్‌నగర్‌లోని గదిలో వదిలేసి పరార య్యాడు. దీంతో బాధితురాలు తన అమ్మ మ్మకు ఫోన్ ద్వారా సమాచారం అందించగా, ఆమె అక్కడికి చేరుకుని బాలికను ఇంటికి తీసుకెళ్లింది. అనంతరం బాధితురాలి ఫిర్యాదుతో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు క్రైమ్ నంబర్ 1243/2021 కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

● పకడ్బందీ దర్యాప్తు.. నిందితుడికి కఠిన శిక్ష

ఈ కేసులో ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకటేశ్వర్ రెడ్డి సమర్థవంతంగా వాదనలు వినిపించగా, పోలీసు అధికారులు సాక్ష్యాధారాలను కోర్టుకు సమర్పించారు. దీంతో నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు ఇచ్చింది. బాధితురాలికి రూ.3 లక్షల పరిహారం అందించాలని ఆదేశించింది.

● పోలీసు బృందానికి డీసీపీ అభినందనలు

ఈ కేసులో మొదటి దర్యాప్తు అధికారిగా కె. నరసింహా, రెండో దర్యాప్తు అధికారిగా బి. గంగాధర్, మైలార్‌దేవ్‌పల్లి ఎస్‌హెచ్ఓ సిహెచ్. శ్రీనివాస్, మహిళా ఎస్ఐ శ్వేత, కోర్టు డ్యూటీ అధికారి ఎం. సీనయ్య, సమన్ల విధుల అధికారి శ్రీకాంత్, లైజన్ అధికారులు వి. రాజేందర్, భరోసా లీగల్ ఆఫీసర్ చందు రెడ్డి కీలకంగా వ్యవహరించారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని రాజేంద్రనగర్ జోన్ డీసీపీ ఎస్. శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు.

మద్యం మత్తులో వీరంగం.. ఇద్దరు రౌడీషీటర్లకు 7 రోజుల జైలు!



- బహిరంగంగా గొడవపడి ప్రజలకు ఇబ్బందులు.. పెట్టీ కేసు నమోదు చేసిన కుల్సుంపుర పోలీసులు
- నాంపల్లి కోర్టు కీలక తీర్పు.. ప్రజాశాంతికి భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసుల హెచ్చరిక

హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :మద్యం మత్తులో బహిరంగంగా గొడవపడుతూ ప్రజలకు ఇబ్బందులు కలిగించిన ఇద్దరు రౌడీషీటర్లకు న్యాయస్థానం ఏడు రోజుల జైలు శిక్ష విధించింది. హైదరాబాద్‌లోని కుల్సుంపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు తక్షణమే స్పందించి కేసు నమోదు చేయడంతో నిందితులకు శిక్ష పడింది.

● మద్యం మత్తులో రోడ్డుపై గొడవ!

పోలీసుల వివరాల ప్రకారం.. నవంబర్ 21, 2026న జియాగూడలోని ఎంసీహెచ్ కాలనీలో ఇద్దరు రౌడీషీటర్లు మద్యం మత్తులో ఒకరితో ఒకరు గొడవకు దిగారు. బహిరంగంగా ఘర్షణ పడుతూ స్థానిక ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన కుల్సుంపుర పోలీసులు ఇద్దరిపై హైదరాబాద్ సిటీ పోలీస్ యాక్ట్ సెక్షన్ 70(ఢీ), బీఎన్ఎస్ సెక్షన్ 115(2) కింద పెట్టీ కేసు నమోదు చేశారు.

● కోర్టులో హాజరు.. ఏడాది కాదు ఏడు రోజుల జైలు!

కేసు దర్యాప్తులో భాగంగా ఇద్దరు నిందితులను నాంపల్లిలోని నాలుగో స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. కేసును విచారించిన న్యాయస్థానం ఇద్దరినీ దోషులుగా నిర్ధారించి ఏడు రోజుల జైలు శిక్ష విధించింది.

● అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవు!

ఈ కేసును కుల్సుంపుర పోలీస్‌స్టేషన్ ఎస్ఐ అమ్జద్ షరీఫ్ దర్యాప్తు చేశారు.
ప్రజాశాంతికి విఘాతం కలిగించేలా ప్రవర్తించే రౌడీషీటర్లు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కుల్సుంపుర పోలీసులు హెచ్చరించారు.
ప్రజలకు ఇబ్బందులు కలిగించే వారిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

హైదరాబాద్ పోలీసుల క్రీడా ప్రతిభకు జాతీయ గుర్తింపు

- ఆల్ ఇండియా పోలీస్ క్రీడా పోటీల్లో సత్తాచాటిన అధికారులు.. ఆరు పతకాలతో మెరిసిన హైదరాబాద్ పోలీస్ బృందం!
- ఒక స్వర్ణం.. ఐదు కాంస్యాలు కైవసం -- విజేతలను అభినందించిన సీపీ మహేశ్ భగవత్





హైదరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :విధి నిర్వహణలోనే కాదు.. క్రీడా రంగంలోనూ హైదరాబాద్ నగర పోలీసులు తమ ప్రతిభను చాటుకున్నారు. గుజరాత్ రాష్ట్రంలోని అహ్మదాబాద్‌లో నవంబర్ 19 నుంచి 24 వరకు నిర్వహించిన 3వ ఆల్ ఇండియా పోలీస్ బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ క్లస్టర్--2026 జాతీయ స్థాయి పోటీల్లో హైదరాబాద్ నగర పోలీసు కమిషనరేట్‌కు చెందిన నలుగురు అధికారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. మొత్తం ఆరు పతకాలు సాధించి నగర పోలీసు విభాగానికి గౌరవం తీసుకొచ్చారు. ఇందులో ఒక స్వర్ణ పతకం, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి.

పతకాలు సాధించిన అధికారులు శుక్రవారం హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్ డా. మహేశ్ మురళీధర్ భగవత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన విజేతలను సీపీ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

● పతకాల వివరాలు ఇలా..

లతీఫా ఆషా (ప్రస్తుతం హైదరాబాద్ సీపీ కార్యాలయంలో విధులు) ఓపెన్ ఉమెన్స్ డబుల్స్‌లో స్వర్ణ పతకం, ఓపెన్ ఉమెన్స్ సింగిల్స్‌లో కాంస్య పతకం సాధించారు.
జి. శ్రీను, డీఎస్పీ (సీఎస్‌డబ్ల్యూ, హైదరాబాద్) 50+ జీఓఎస్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.
డి. ధనలక్ష్మి, ఏసీపీ (ట్రాఫిక్, హైదరాబాద్) 45+ మిక్స్‌డ్ డబుల్స్, 18+ మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగాల్లో రెండు కాంస్య పతకాలు సాధించారు.
డి. ప్రసన్న లక్ష్మి, డీఎస్పీ (సీఏఆర్ హెడ్ క్వార్టర్స్, హైదరాబాద్) 18+ మహిళల టేబుల్ టెన్నిస్ డబుల్స్ విభాగంలో కాంస్య పతకం అందుకున్నారు.

● క్రీడా స్ఫూర్తికి నిదర్శనం

పోలీసు విధులను సమర్థంగా నిర్వహిస్తూనే జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పతకాలు సాధించడం అభినందనీయమని సీపీ మహేశ్ భగవత్ కొనియాడారు. వీరి విజయాలు పోలీసు శాఖలోని ఇతర సిబ్బందికి స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొన్నారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ రాణిస్తూ హైదరాబాద్ పోలీసుల ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో నిలబెట్టిన విజేతలకు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

అదృశ్యమైన మానసిక దివ్యాంగురాలు.. ఆచూకీ కోసం పోలీసుల విజ్ఞప్తి

- బొల్లారం కేబీఆర్ కాలనీ నుంచి వెళ్లి తిరిగిరాని 33 ఏళ్ల చంద్రకళ
- కుటుంబ సభ్యుల గాలింపు విఫలం.. ఆచూకీ తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పోలీసుల అభ్యర్థన



సైబరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : బొల్లారం గ్రామంలోని కేబీఆర్ కాలనీకి చెందిన మానసిక దివ్యాంగురాలు చంద్రకళ (33) అదృశ్యమైంది. ఈ నెల 24న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. బంధువులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు.

● ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాక..

పోలీసుల వివరాల ప్రకారం.. కేబీఆర్ కాలనీకి చెందిన కలాల్ సావిత్రి (65)కు ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె చంద్రకళ పుట్టుకతోనే మానసిక దివ్యాంగురాలు. తల్లితో కలిసి నివసిస్తున్న ఆమె నవంబర్ 24న సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె కోసం వెతుకులాట ప్రారంభించారు.

● చంద్రకళ ఆచూకీ తెలిస్తే సమాచారం ఇవ్వండి

-పేరు: చంద్రకళ
-వయస్సు: 33 సంవత్సరాలు
-ఎత్తు: 5.3 అడుగులు
-ఛాయ: నలుపు-గోధుమ రంగు
-ధరించిన దుస్తులు: ఎరుపు రంగు నైట్‌డ్రెస్
-చిరునామా: కేబీఆర్ కాలనీ, బొల్లారం గ్రామం, జిన్నారం మండలం.

పై వివరాలు కలిగిన మహిళ ఎక్కడైనా కనిపించినా, ఆమె ఆచూకీ తెలిసినా వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా ఐడీఏ బొల్లారం పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రజలను కోరారు. మహిళ ఆచూకీ గుర్తించేందుకు ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

లాడ్జి గదిలో గంజాయి గుట్టు రట్టు.. 29.810 కిలోలు స్వాధీనం!

- సుల్తాన్ బజార్ పోలీసుల మెరుపు దాడి.. అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా గుట్టురట్టు
- ఒడిశా నుంచి సూరత్‌కు తరలించే యత్నం.. లాడ్జి మేనేజర్‌తో సహా ముగ్గురు అరెస్ట్





SULTANBAZAR POLICE, HYD

హైదరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. ఈ క్రమంలో సుల్తాన్ బజార్ పోలీసుల తనిఖీల్లో అంతర్రాష్ట్ర గంజాయి రవాణా ముఠా గుట్టురట్టయింది. రంగమహల్ ప్రాంతంలోని జేకే లాడ్జిలో నిర్వహించిన తనిఖీల్లో ఏకంగా 29.810 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ వ్యవహారంలో ఇద్దరు గంజాయి రవాణాదారులతో పాటు వారికి ఆశ్రయం కల్పించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న లాడ్జి మేనేజర్‌ను అరెస్ట్ చేశారు.

● లాడ్జి గదిలో అక్రమ దందా!

హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు నవంబర్ 26న సుల్తాన్ బజార్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రంగమహల్ వద్ద ఉన్న జేకే లాడ్జిపై దృష్టి సారించారు. గది నంబర్ 103లో తనిఖీలు చేపట్టగా ఐదు బ్యాగుల్లో దాచిన 18 గంజాయి ప్యాకెట్లు బయటపడ్డాయి. వాటి బరువు 29.810 కిలోలుగా గుర్తించారు. ఈ తనిఖీల్లో ఇద్దరు అంతర్రాష్ట్ర గంజాయి రవాణాదారులు, లాడ్జి మేనేజర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

● ఒడిశా నుంచి సూరత్‌కు సరఫరా!

ప్రాథమిక విచారణలో ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయిని కొనుగోలు చేసి, అక్కడి నుంచి గుజరాత్‌లోని సూరత్‌కు తరలించేందుకు నిందితులు ప్రణాళిక రూపొందించినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అక్రమ రవాణాదారులకు తెలిసి కూడా డబ్బులు తీసుకుని లాడ్జిలో ఆశ్రయం కల్పించినట్లు మేనేజర్‌పై ఆరోపణలు ఉన్నాయి. ఈ కేసుతో సంబంధం ఉన్న మలయా కన్హర్ అలియాస్ బిట్టు, బప్పి కన్హర్ పరారీలో ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

● ముగ్గురు అరెస్ట్.. భారీగా వస్తువుల స్వాధీనం

అరెస్టయిన వారిలో ఒడిశాకు చెందిన దుకేశ్ శ్యామ్ పట్నాయక్ (41), దీపక్ స్వైన్ (22), లాడ్జి మేనేజర్ సయ్యద్ మునీర్ (57) ఉన్నారు. వీరి నుంచి 29.810 కిలోల గంజాయితో పాటు మొబైల్ ఫోన్లు, రూ.2 వేల నగదు, లాడ్జికి సంబంధించిన రికార్డులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

● పోలీసుల ప్రత్యేక నిఘా..

సుల్తాన్ బజార్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ జి. నరేష్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పి. ధర్మారావు నేతృత్వంలో ఎస్ఐ పి. సాయిరాం, హెడ్ కానిస్టేబుల్ ఎన్.బి.వి. రాజు, కానిస్టేబుల్ పి.ఆర్. లింగం ఈ ఆపరేషన్‌లో పాల్గొన్నారు. సుల్తాన్ బజార్ డివిజన్ ఏసీపీ ఎం. మత్తయ్య పర్యవేక్షణలో ఆపరేషన్ నిర్వహించారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టంలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న పోలీసు సిబ్బందిని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డా. మహేశ్ భగవత్ అభినందించారు.

● లాడ్జి నిర్వాహకులకు పోలీసుల హెచ్చరిక!

లాడ్జీలు, హోటళ్లు, గెస్ట్‌హౌస్‌ల నిర్వాహకులు, ఇంటి యజమానులు తమ వద్ద బస చేసే వ్యక్తుల గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా పరిశీలించి వివరాలు నమోదు చేయాలని పోలీసులు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా కార్యకలాపాలు కనిపిస్తే వెంటనే 112కు సమాచారం అందించాలని కోరారు. గంజాయి సరఫరాదారులతో పాటు వారికి ఆశ్రయం, ఆర్థిక సహాయం అందించే వారిపైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నిజామాబాద్‌కు డీజీపీ సి.వి. ఆనంద్.. ఘన స్వాగతం





- జిల్లాల పర్యటనలో భాగంగా నగరానికి చేరిక.. పోలీస్ కమిషనర్, కలెక్టర్ స్వాగతం
- ఐదో తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ముగింపు వేడుకల్లో పాల్గొననున్న డీజీపీ

హైదరాబాద్: క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ జిల్లాల పర్యటనలో భాగంగా శుక్రవారం సాయంత్రం నిజామాబాద్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య, జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఐఏఎస్ ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. డీజీపీ పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం ఏర్పాట్లు చేసింది. శనివారం నిజామాబాద్ జిల్లాలో నిర్వహించనున్న వివిధ కార్యక్రమాల్లో సి.వి. ఆనంద్ పాల్గొననున్నారు. అనంతరం నిర్వహించనున్న ఐదో తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై క్రీడాకారులను అభినందించనున్నారు.

పాతబస్తీలో డ్రగ్స్, మొబైల్ స్నాచింగ్‌పై పోలీసుల ఉక్కుపాదం!

- మత పెద్దలతో సీపీ మహేశ్ భగవత్ ప్రత్యేక భేటీ.. యువతను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడేందుకు కార్యాచరణ
- డ్రగ్స్ వాడుతూ తొలిసారి పట్టుబడిన యువతకు కౌన్సెలింగ్.. పరీక్షల్లో నెగెటివ్ వస్తే ప్రాసిక్యూషన్ ఉండదని వెల్లడి
- ప్రతి శుక్రవారం కోత్వాల్ హౌస్‌లో.. మంగళవారం బషీర్‌బాగ్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటా: సీపీ





హైదరాబాద్ కమిషనరేట్: క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : పాతబస్తీలో శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం, మాదకద్రవ్యాల నియంత్రణ, మొబైల్ స్నాచింగ్ నేరాల కట్టడిపై హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ డా. మహేశ్ మురళీధర్ భగవత్ ప్రత్యేక దృష్టి సారించారు. ఈ మేరకు శుక్రవారం పురాణి హవేలీలోని కోత్వాల్ హౌస్‌లో హిందూ, షియా, సున్నీ మత పెద్దలు, అహ్లె-హదీస్ నాయకులు, శాంతి కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. పాతబస్తీలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు అన్ని మతాల పెద్దలు, ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.

● డ్రగ్స్ మహమ్మారిపై ఉమ్మడి పోరాటం!

యువత, పాఠశాల విద్యార్థులు మాదకద్రవ్యాలకు, సోషల్ మీడియా దుర్వినియోగానికి బానిసలవుతున్న తీరు ఆందోళనకరమని సీపీ పేర్కొన్నారు. 2030 నాటికి నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఈగల్ ఫోర్స్‌ను ఏర్పాటు చేసిందని వివరించారు. మత పెద్దలు తమ ప్రసంగాలు, ప్రార్థనలు, సామాజిక సమావేశాల ద్వారా డ్రగ్స్ దుష్ప్రభావాలపై యువతకు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని కోరారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే 1908, 112 లేదా 100 నంబర్లకు ఫోన్ చేయాలని సూచించారు.

● యువత భవిష్యత్తుకు భరోసా.. డీ-అడిక్షన్ కౌన్సెలింగ్!

మొదటిసారి డ్రగ్స్ వినియోగిస్తూ పట్టుబడిన యువత భవిష్యత్తు దెబ్బతినకుండా ఉండేందుకు ఎన్‌డీపీఎస్ చట్టంలోని సెక్షన్ 64నా ప్రకారం డీ-అడిక్షన్ కౌన్సెలింగ్ నిర్వహించే అంశాన్ని సీపీ వివరించారు. యువతతో పాటు వారి తల్లిదండ్రులకు 7 నుంచి 8 రోజులపాటు కౌన్సెలింగ్ ఇచ్చి, అనంతరం రక్త పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. పరీక్షల్లో నెగెటివ్ ఫలితాలు వస్తే చట్టంలోని నిబంధనల ప్రకారం ప్రాసిక్యూషన్ నుంచి మినహాయింపు ఉంటుందని పేర్కొన్నారు. రాత్రివేళల్లో అనవసరంగా తిరిగే యువతకు కౌన్సెలింగ్ ఇచ్చే మిషన్ చబుత్రా కార్యక్రమాన్ని మరింత విస్తృతం చేస్తామని వెల్లడించారు.

● మొబైల్ స్నాచర్లకు చెక్.. సీఈఐఆర్‌తో ఫోన్ల రికవరీ!

మొబైల్ ఫోన్ స్నాచింగ్, చోరీలకు పాల్పడుతున్న యువతపై నిఘా పెంచుతామని సీపీ స్పష్టం చేశారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న బాధితులు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కేంద్ర ప్రభుత్వ సీఈఐఆర్ పోర్టల్ (ఎవఅతీ.స్త్రశీజ.అఅ)లో వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ సాంకేతిక విధానం ద్వారా తెలంగాణలో ఇప్పటివరకు 1.50 లక్షల మొబైల్ ఫోన్లను రికవరీ చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచామని వెల్లడించారు.

● సోషల్ మీడియాలో పాత వీడియోలు పెడితే చర్యలు!

చిన్న చిన్న సంఘటనలు, వివాదాలు పరిష్కారమైన తర్వాత కూడా వాటికి సంబంధించిన పాత వీడియోలను సోషల్ మీడియాలో ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించవద్దని సీపీ హెచ్చరించారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రైవేటు సంస్థల సహకారంతో త్వరలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

● మత పెద్దల సూచనలకు సానుకూల స్పందన

రాత్రివేళల్లో దుకాణాల నిర్వహణ సమయాలు, ఆలస్యంగా జరిగే వివాహ వేడుకల నియంత్రణ, యువతను క్రీడల వైపు ప్రోత్సహించడం వంటి అంశాలను మత పెద్దలు సీపీ దృష్టికి తీసుకువచ్చారు. వీటిపై సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు.

● ప్రజలకు నేరుగా అందుబాటులో సీపీ

ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని పరిష్కరించేందుకు ప్రతి శుక్రవారం పురాణి హవేలీలోని కోత్వాల్ హౌస్‌లో, ప్రతి మంగళవారం బషీర్‌బాగ్‌లోని కమిషనర్ కార్యాలయంలో అందుబాటులో ఉంటానని సీపీ ప్రకటించారు. మత పెద్దలు, శాంతి కమిటీ సభ్యులు, సామాన్య ప్రజలు ఎవరైనా నేరుగా కలిసి తమ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. అలాగే 8712660001 అధికారిక వాట్సాప్ నంబర్‌కు సందేశం పంపినా తగిన పోలీసు చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో అడిషనల్ సీపీ (లా అండ్ ఆర్డర్) తఫ్సీర్ ఇక్బాల్, చార్మినార్ జోన్ డీసీపీ కిరణ్ ఖారే, టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్, అదనపు డీసీపీ ఎం.డి. మాజిద్‌తో పాటు పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

రైళ్లలో మాదకద్రవ్యాల అక్రమ రవాణాపై ఆర్పీఎఫ్ ఉక్కుపాదం!

- 'ఆపరేషన్ నార్కోస్'లో రూ.17.69 కోట్ల విలువైన మత్తుపదార్థాలు స్వాధీనం
- గత ఏడాదితో పోలిస్తే స్వాధీనం విలువలో 216.68 శాతం పెరుగుదల
- 64 కేసులు నమోదు.. 86 మంది పట్టివేత.. 980 కిలోలకుపైగా మత్తుపదార్థాలు సీజ్
- యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాలపై కఠిన చర్యలు: ఆర్పీఎఫ్

హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : రైల్వే మార్గాన్ని అడ్డాగా చేసుకుని మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాలపై రైల్వే రక్షక దళం (ఆర్పీఎఫ్) ఉక్కుపాదం మోపుతోంది. 'ఆపరేషన్ నార్కోస్'లో భాగంగా సికింద్రాబాద్ డివిజన్ పరిధిలో 2026లో ఇప్పటివరకు రూ.17.69 కోట్ల విలువైన మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుని అక్రమ రవాణాదారులకు గట్టి షాక్ ఇచ్చింది. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే స్వాధీనం చేసుకున్న మత్తుపదార్థాల విలువ 216.68 శాతం పెరగడం ఆర్పీఎఫ్ నిఘా, తనిఖీల తీవ్రతను వెల్లడిస్తోంది. 2026లో ఇప్పటివరకు మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు సంబంధించి 64 కేసులు నమోదు చేసిన అధికారులు, 86 మందిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం 980.089 కిలోల మత్తుపదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.17,68,94,750గా అధికారులు వెల్లడించారు.

● నిఘా.. తనిఖీలతో అక్రమ రవాణాకు చెక్

రైళ్లలో, రైల్వే స్టేషన్లలో అనుమానాస్పద వ్యక్తులు, సరుకుల కదలికలపై ఆర్పీఎఫ్ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసింది. ముందస్తు సమాచారం సేకరణ, లక్ష్యిత తనిఖీలు, అనుమానాస్పద రవాణాపై తక్షణ చర్యలతో మాదకద్రవ్యాల అక్రమ తరలింపును అడ్డుకుంటోంది. రైల్వే మార్గాలను మత్తుపదార్థాల రవాణాకు వినియోగించకుండా నిరంతర తనిఖీలు చేపడుతోంది.

● ఎన్‌సీబీ, డీఆర్ఐతో సమన్వయం

మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఆర్పీఎఫ్ ఎన్‌డీపీఎస్ చట్టం పరిధిలో చర్యలు చేపడుతోంది.
నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ), డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ), రాష్ట్ర పోలీసు విభాగాలతో సమన్వయం చేసుకుంటూ సమాచారాన్ని పరస్పరం పంచుకుంటోంది. అనుమానాస్పద ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా, తనిఖీలతో అక్రమ రవాణా నెట్‌వర్క్‌లను ఛేదించేందుకు కృషి చేస్తోంది.



● మత్తు మహమ్మారిపై రాజీలేని పోరు

మాదకద్రవ్యాల స్వాధీనంలో 216.68 శాతం పెరుగుదల తమ నిఘా, సమాచార సేకరణ, సమన్వయ చర్యల ఫలితమని సికింద్రాబాద్ డివిజన్ ఆర్పీఎఫ్ సీనియర్ డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ అలకుంట నవీన్ కుమార్ తెలిపారు.

యువత, సమాజ భవిష్యత్తుకు మాదకద్రవ్యాలు తీవ్ర ముప్పుగా పరిణమిస్తున్నాయని పేర్కొన్నారు.
రైల్వే మార్గాల ద్వారా మత్తుపదార్థాల రవాణాకు పాల్పడే ముఠాలను గుర్తించి అడ్డుకోవడమే లక్ష్యంగా నిరంతర చర్యలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.
'ఆపరేషన్ నార్కోస్' ద్వారా రైల్వే ప్రయాణికుల భద్రతతో పాటు సమాజాన్ని మాదకద్రవ్యాల ముప్పు నుంచి కాపాడేందుకు ఆర్పీఎఫ్ కట్టుబడి ఉందని అధికారులు తెలిపారు.
రైళ్లు, రైల్వే స్టేషన్లను మత్తుపదార్థాల అక్రమ రవాణాకు మార్గాలుగా మార్చేందుకు ఎవరినీ అనుమతించబోమని స్పష్టం చేశారు.

ఆస్తి నేరాలకు అడ్డుకట్ట వేయాలి.. పెట్రోలింగ్ ముమ్మరం చేయాలి!

- కామారెడ్డి పోలీసుల పనితీరుపై డీజీపీ సి.వి. ఆనంద్ ప్రశంసలు
- సైబర్ మోసాల్లో 61 శాతం నగదు రికవరీ.. అంతర్రాష్ట్ర ముఠాల కట్టడికి ఆపరేషన్ కవచ్
- కామారెడ్డి, బాన్సువాడలో అదనపు పోలీస్‌స్టేషన్లు.. మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు





హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు పోలీసులు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ ఆదేశించారు. నేరాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి నిరంతర పెట్రోలింగ్ నిర్వహించాలని, డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన నగదును తిరిగి రికవరీ చేయడంలో కామారెడ్డి జిల్లా పోలీసులు చూపుతున్న పనితీరును అభినందించారు.

శుక్రవారం కామారెడ్డి జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశానికి డీజీపీ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆయనకు స్వాగతం పలికారు. జిల్లా నేరాలు, శాంతిభద్రతలు, పోలీసు వ్యవస్థ పనితీరు, సైబర్ నేరాల నియంత్రణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు.

● నక్సల్స్ నుంచి సైబర్ నేరాల వరకు.. మారిన సవాళ్లు!

గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 1996 ఆగస్టు నుంచి 1999 డిసెంబర్ వరకు సుమారు మూడున్నరేళ్లు విధులు నిర్వహించిన అనుభవాలను డీజీపీ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉండేదని, గ్రామీణ ప్రాంతాల్లో దళాల సంచారం, పట్టణాల్లో టౌన్ పార్టీల కార్యకలాపాలు పోలీసులకు సవాళ్లుగా ఉండేవని తెలిపారు. ప్రస్తుతం శాంతిభద్రతల పరిస్థితి మెరుగుపడినప్పటికీ సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ ప్రధాన సవాళ్లుగా మారాయని పేర్కొన్నారు.



● ఆపరేషన్ కవచ్‌తో అంతర్రాష్ట్ర ముఠాలకు చెక్!

మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో సరిహద్దులు కలిగిన కామారెడ్డి జిల్లాలో అంతర్రాష్ట్ర నేర ముఠాల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని డీజీపీ సూచించారు. గతంలో ఏటా 10 నుంచి 15 వరకు నేర ముఠాలు జిల్లాలో సంచరించే పరిస్థితి ఉండేదని, వాటి కట్టడికి చేపట్టిన ఆపరేషన్ కవచ్ మంచి ఫలితాలు ఇస్తోందని తెలిపారు. ఈ ఆపరేషన్‌ను మరింత పకడ్బందీగా కొనసాగించాలని ఆదేశించారు.





● డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యం!

2029 డిసెంబర్ 31 నాటికి నషా ముక్త్ భారత్ లక్ష్య సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీజీపీ పిలుపునిచ్చారు. డ్రగ్స్ సరఫరా, వినియోగంపై పోలీస్ కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్పీ స్థాయి వరకు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలంగాణలో ఈగల్ ఫోర్స్ వంటి ప్రత్యేక విభాగాల ద్వారా మాదకద్రవ్యాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

● సైబర్ మోసాల్లో 61 శాతం నగదు రికవరీ!

కృత్రిమ మేధ సాంకేతికతను ఉపయోగించుకుని సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని డీజీపీ హెచ్చరించారు. దాదాపు 40 రకాల సైబర్ మోసాల ద్వారా ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో సైబర్ యూనిట్లు, సైబర్ వారియర్లు బాధితులకు తక్షణ సహాయం అందించాలని సూచించారు.

కామారెడ్డి జిల్లా పోలీసులు 2024లో 55 శాతం, 2025లో 69 శాతం, 2026 నవంబర్ నాటికి 61 శాతం సైబర్ మోసాల నగదును రికవరీ చేసినట్లు ఎస్పీ రాజేష్ చంద్ర వివరించారు. ఈ పనితీరును డీజీపీ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలు ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

● పోలీస్ వ్యవస్థ విస్తరణకు ప్రతిపాదనలు!

జిల్లాలో పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పోలీసు వ్యవస్థను బలోపేతం చేయాలని డీజీపీ సూచించారు. కామారెడ్డి పట్టణంలో మరో పోలీస్‌స్టేషన్, బాన్సువాడలో అదనపు పోలీస్‌స్టేషన్‌తో పాటు మహిళా, ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. బ్లూకోల్ట్స్, టెక్ టీమ్‌లకు అవసరమైన సిబ్బందిని కేటాయించాలని సూచించారు.ప్రతి పోలీస్‌స్టేషన్‌లో సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకోవాలని, డ్రగ్స్ బాధితుల పునరావాసానికి డీ-అడిక్షన్ కేంద్రం ఏర్పాటుపై దృష్టి సారించాలని తెలిపారు.

● పోలీసుల ఆరోగ్యానికి ఫిట్‌కాప్!

పోలీసు సిబ్బంది ఆరోగ్య పరిరక్షణకు ఫిట్‌కాప్ కార్యక్రమం చేపట్టినట్లు డీజీపీ వెల్లడించారు. ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలను గుర్తించి తగిన మార్గదర్శకాలు అందించనున్నట్లు తెలిపారు.

● 25 ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు.. 400 కిలోల గంజాయి స్వాధీనం!

జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా నేరాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణ, సిబ్బంది కొరత, సైబర్ నేరాల రికవరీ వివరాలను వెల్లడించారు. జిల్లాలో 1,158 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 976 మంది పనిచేస్తున్నారని, మరో 182 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.జాతీయ రహదారి 44, రాష్ట్ర రహదారి 765డీ పరిధిలో ప్రమాదాలు ఎక్కువగా జరిగే 25 ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టినట్లు వివరించారు. సరిహద్దుల నుంచి గంజాయి రవాణా జరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని నిఘా పెంచామని, ఇటీవల 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని పీడీ యాక్ట్ కింద చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.

● మొబైల్ రికవరీలో ఏడో స్థానం!

2026లో ఇప్పటివరకు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్నట్లు 7,285 ఫిర్యాదులు అందగా, వాటిలో 3,683 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా ఏడో స్థానంలో ఉందని తెలిపారు.

● ఐదు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే 42 శాతం నేరాలు!

కామారెడ్డి టౌన్, దేవునిపల్లి, బాన్సువాడ, బిచ్కుంద, బిక్కనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలో జిల్లాలో నమోదయ్యే మొత్తం నేరాల్లో 42 శాతం నమోదవుతున్నట్లు ఎస్పీ వివరించారు. ఈ ప్రాంతాల్లో నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా, పెట్రోలింగ్ పెంచాల్సిన అవసరాన్ని వివరించారు.ఇసుక అక్రమ రవాణాపై 2026 నవంబర్ నాటికి 193 కేసులు నమోదు చేసి 281 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ గేమింగ్ కార్యకలాపాలపై 376 కేసులు నమోదు చేసినట్లు వెల్లడించారు. రౌడీషీట్ల విషయానికి వస్తే 2026లో ఇప్పటివరకు 135 రౌడీషీట్లు తెరిచినట్లు వివరించారు.బాన్సువాడలో 2026 ఫిబ్రవరిలో జరిగిన మతపరమైన ఘర్షణలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేసినట్లు ఎస్పీ తెలిపారు.ఈ సమీక్ష సమావేశంలో ఐజీ కార్తికేయ, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, జోన్--3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్, ఎస్పీ ప్రవీణ్‌కుమార్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్‌తో పాటు పలువురు పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టి పోరాటం

- 2026 నాటికి రాష్ట్రంలో 1,497 బాల్యవివాహాల కేసుల నమోదు
- 2030 నాటికి బాల్యవివాహ రహిత తెలంగాణే లక్ష్యం
- అనుమానం వచ్చినా ఫిర్యాదు చేయండి.. ప్రతి బాల్యవివాహాన్ని అడ్డుకోవాలి
- బాల్యవివాహాలకు సహకరించే వారిపైనా చట్టపరమైన చర్యలు
- బాలికల చదువు మధ్యలో ఆగితే అప్రమత్తం కావాలి: మహిళా భద్రతా విభాగం డీజీ సౌమ్య మిశ్రా



హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :బాల్యవివాహాల నిర్మూలనకు కేవలం చట్టాల అమలు మాత్రమే సరిపోదని, పోలీసు శాఖతో పాటు ప్రభుత్వ విభాగాలు, ప్రజలు, సామాజిక సంస్థలు సమష్టిగా కృషి చేయాలని తెలంగాణ మహిళా భద్రతా విభాగం డైరెక్టర్ జనరల్ డాక్టర్ సౌమ్య మిశ్రా పిలుపునిచ్చారు. 2030 నాటికి తెలంగాణను బాల్యవివాహ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా నివారణ చర్యలను మరింత ముమ్మరం చేయాలని సూచించారు.హైదరాబాద్ బేగంపేటలోని హోటల్ ది ప్లాజాలో శుక్రవారం మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన రాష్ట్రస్థాయి సంప్రదింపుల సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల్యవివాహాల నిర్మూలనతో పాటు పిల్లలపై లైంగిక దోపిడీ, వేధింపులను అరికట్టడంపై ఈ సమావేశంలో చర్చించారు.తెలంగాణలో 2024 నుంచి 2026 నవంబర్ 25 వరకు 31 పోలీసు విభాగాల పరిధిలో మొత్తం 1,497 బాల్యవివాహాల కేసులు నమోదయ్యాయని సౌమ్య మిశ్రా వెల్లడించారు. ప్రతి కేసు వెనుక ఒక చిన్నారి చదువు, గౌరవం, భవిష్యత్తు ముడిపడి ఉన్నాయని పేర్కొన్నారు. బాల్యవివాహం జరుగుతోందనే అనుమానం వచ్చినా ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని, పూర్తి వివరాలు తెలిసే వరకు వేచి చూడాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.



● ఫిబ్రవరి 2027లో రాష్ట్రస్థాయి సదస్సు

మహిళా భద్రతా విభాగానికి అందే ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటామని, పెండింగ్ దర్యాప్తులు, విచారణలపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహిస్తామని సౌమ్య మిశ్రా హామీ ఇచ్చారు. బాల బాధితులతో సున్నితంగా, గౌరవంగా వ్యవహరించేలా పోలీసు సిబ్బందికి ప్రత్యేక అవగాహన కల్పిస్తామని తెలిపారు. బాల్యవివాహ రహిత తెలంగాణ లక్ష్య సాధనకు సమన్వయ చర్యలను బలోపేతం చేసేందుకు 2027 ఫిబ్రవరిలో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించనున్నట్లు ప్రకటించారు.జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ జాతీయ కార్యదర్శి సంపూర్ణ బెహురా మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన, విద్య, సమష్టి బాధ్యతతో పాటు పిల్లల రక్షణకు కృత్రిమ మేధ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ప్రత్యేక కార్యదర్శి శ్రుతి ఓజా మాట్లాడుతూ 2030 నాటికి బాల్యవివాహాల నిర్మూలన తెలంగాణ రైజింగ్ విజన్‌లో కీలక లక్ష్యమని తెలిపారు. ఆ శాఖ సంచాలకురాలు డాక్టర్ సంగీత సత్యనారాయణ మాట్లాడుతూ టీనేజ్ గర్భధారణలు, మాతా మరణాలను అరికట్టేందుకు వివిధ శాఖల మధ్య సమన్వయం అవసరమని పేర్కొన్నారు.ఈ సమావేశంలో రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సభ్య కార్యదర్శి పంచాక్షరి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ దివ్య దేవరాజన్, తెలంగాణ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ప్రతినిధులు, ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు, బాలల హక్కుల సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

● బాల్యవివాహం తీవ్రమైన నేరం

బాల్యవివాహాల నిరోధక చట్టం--2006 ప్రకారం బాల్యవివాహం గుర్తించదగిన, బెయిల్ పొందడం కష్టమైన నేరమని డీజీ తెలిపారు. పిల్లలపై లైంగిక నేరాలు జరిగిన సందర్భాల్లో పోక్సో చట్టంలోని నిబంధనలను కూడా వర్తింపజేయాలని సూచించారు. కేసుల నమోదు, దర్యాప్తు, బలమైన అభియోగపత్రాల దాఖలు, పెండింగ్ కేసులపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

● బాలికల చదువు ఆగితే అప్రమత్తం కావాలి

బాల్యవివాహాలను అడ్డుకోవడంలో ముందస్తు గుర్తింపే కీలకమని ఆమె పేర్కొన్నారు. పోలీసు శాఖ, బాల్యవివాహాల నిరోధక అధికారులు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పూజారులు, ఫంక్షన్ హాళ్ల నిర్వాహకులు, క్యాటరర్లు, టెంట్ హౌస్ యజమానులు బాల్యవివాహాలకు ఎలాంటి సహకారం అందించకూడదని కోరారు. పాఠశాల మానేసిన ప్రతి బాలిక విషయంలో సంబంధిత అధికారులు అప్రమత్తమై, కారణాలను గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. బాల్యవివాహాలకు మానవ అక్రమ రవాణా, ఆన్‌లైన్ లైంగిక దోపిడీతోనూ సంబంధాలు పెరుగుతున్నాయని హెచ్చరించారు.



‘అమిత్ షాకు మతిమరుపు ఉందేమో’- మహిళ రిజర్వేషన్ బిల్లుపై చిదంబరం విమర్శలు

న్యూ ఢిల్లీ :మహిళా రిజర్వేషన్ల అంశంపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలకు కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం గట్టి కౌంటర్ ఇచ్చారు. అమిత్ షాకు జ్ఞాపకశక్తి లోపించిందో లేదా నిజాన్ని దాచిపెడుతున్నారో తెలియదని విమర్శించారు. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇచ్చిందని స్పష్టం చేశారు. రాజ్యాంగ (106వ) సవరణ చట్టం, 2023ను వెంటనే అమలు చేయాలని తమ పార్టీ డిమాండ్ చేస్తోందని తెలిపారు.ఈ మేరకు శుక్రవారం ‘ఎక్స్’ వేదికగా చిదంబరం వ్యాఖ్యానించారు. మహిళా రిజర్వేషన్ల బిల్లు 2023 సెప్టెంబర్ 20, 21 తేదీల్లో పార్లమెంట్ ఉభయ సభల్లో ఆమోదం పొందిందని గుర్తు చేశారు. ఈ బిల్లుకు కాంగ్రెస్ పూర్తి మద్దతు ఇచ్చిందని, చట్టాన్ని తక్షణమే అమలు చేయాలని కోరుతూ వస్తోందని పేర్కొన్నారు. ఇప్పటికే చట్టం ఉన్నప్పుడు దాన్ని అమలు చేయకుండా బీజేపీ ప్రభుత్వం ఎందుకు జాప్యం చేస్తోందని



ప్రశ్నించారు. కొత్త బిల్లు తీసుకురావాల్సిన అవసరం ఏముందని నిలదీశారు.ఆర్టికల్ 334ఖాతోనే అడ్డంకులు రాజ్యాంగ (106వ) సవరణ చట్టం ద్వారా ఆర్టికల్ 334ఖాను చేర్చారని చిదంబరం వివరించారు. ఈ నిబంధన మహిళా రిజర్వేషన్ల అమలును తదుపరి జనాభా లెక్కలు, ఆ తర్వాత జరిగే నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపెట్టిందని తెలిపారు. పార్లమెంట్‌లో జరిగిన చర్చలను పరిశీలిస్తే కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలు ఈ నిబంధనను వ్యతిరేకించిన విషయం తెలుస్తుందన్నారు. జనాభా లెక్కలు, వాటి తర్వాత నియోజకవర్గాల పునర్విభజన, ఇలా రెండు అడ్డంకులను అనవసరంగా సృష్టించారని విమర్శించారు. అయితే ఆర్టికల్ విషయంలో బీజేపీ పట్టుదలగా వ్యవహరించిందని, చివరకు ఆ నిబంధనతో సహా బిల్లును ఆమోదింపజేసుకుందని చిదంబరం ఆరోపించారు. ఇప్పుడు ప్రభుత్వం చేయాల్సిందల్లా ఆర్టికల్ 334ఖాను తొలగించే ప్రతిపాదన తీసుకురావడమేనని అన్నారు. ఆ నిబంధనను తొలగిస్తే మహిళా రిజర్వేషన్లను వెంటనే అమలు చేయవచ్చని సూచించారు. ప్రత్యేక సమావేశంపై కాంగ్రెస్ అభ్యంతరంమరోవైపు, నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమావేశంపై కూడా కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ఈ సమావేశానికి మహిళా రిజర్వేషన్లతో పెద్దగా సంబంధం లేదని, నియోజకవర్గాల పునర్విభజన బిల్లు కోసమే ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేస్తోందని ఆరోపించింది. ఈ ప్రతిపాదనను గట్టిగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ‘ఎక్స్’ వేదికగా స్పందిస్తూ, ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్ షా మరోసారి అబద్ధాలు చెబుతున్నారని విమర్శించారు.ం చారు.ఈ ప్రత్యేక సమావేశం నియోజకవర్గాల పునర్విభజన కోసమేనని పేర్కొంటూ, వాటి భౌగోళిక స్వరూపాన్ని నిర్ణయించే బాధ్యత ఎవరిదని జైరాం రమేష్ ప్రశ్నించారు. ఓటర్ల జాబితాల తయారీని పూర్తిగా అపహాస్యం చేసి, ఎన్నికల ప్రక్రియ సమగ్రతను దెబ్బతీశారని ఆయన ఆరోపించిన సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌కే ఆ బాధ్యత అప్పగించనున్నారని విమర్శించారు. ఇంత భారీ స్థాయిలో ‘ఓట్ల చోరీ’కి పాల్పడే వారికి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడానికి, వాటి స్వరూపాన్ని తారుమారు చేసే అధికారాలు ఇవ్వడం అత్యంత దారుణమైన చర్య అని ఆయన తీవ్రంగా మండిపడ్డారు.

రష్యా అధ్యక్షుడితో సెల్ఫీ! భారతీయ టీనేజర్‌కు అరుదైన ఛాన్స్

కేరళ:కేరళకు చెందిన టీనేజ్ ఆంత్రప్రెన్యూర్ రావుల్ జాన్ అజూకు ఇటీవల అరుదైన అవకాశం దక్కింది. మాస్కోలో ప్రస్తుతం జరుగుతున్న ఇంటర్నేషనల్ ఏఐ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జాన్‌కు ఏకంగా అధ్యక్షుడు పుతిన్‌తో కలిసి సెల్ఫీ దిగే అవకాశం దక్కింది. ఆ సెల్ఫీని జాన్ స్వయంగా నెట్టింట వంచుకుని ఉబ్బితబ్బిబ్బైపోయాడు. ఇలాంటి ఓ రోజు ఉంటుందని తాను కలలో కూడా అనుకోలేదని సంబరపడ్డాడు. మూడు రోజుల పాటు జరిగే ఈ కాన్ఫరెన్స్ నవంబర్



26న మొదలైంది.జాన్‌కు చాలా చిన్నప్పుడే కంప్యూటర్ల ప్రపంచంతో పరిచయమైంది. ప్రస్తుతం అతడు తను డిజైన్ చేసిన రకరకాల ఏఐ టూల్స్‌తో ప్రపంచవ్యాప్తంగా పాప్యులారిటీ సాధించాడు. ఏఐ కిడ్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందాడు. 15 మంది ఉద్యోగులతో అతడు ఓ ఏఐ స్టార్టప్ సంస్థను కూడా నిర్వహిస్తున్నాడు. మరో ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే.. జాన్ తండ్రి కూడా తన బిడ్డ సంస్థలోనే పని చేస్తూ నెలకు రూ.2 లక్షల జీతం తీసుకుంటున్నారు.9 ఏళ్ల వయసులోనే జాన్ తనంతట తానుగా ఏఐని నేర్చుకున్నాడు. ఆ తరువాత ఏఐ రీలమ్ టెక్నాలజీస్ పేరిట ఓ స్టార్టప్ సంస్థను ప్రారంభించాడు. ప్రస్తుతం 15 మంది ఉద్యోగులు ఉన్న ఈ సంస్థ ఇప్పటిపరకూ ప్రపంచవ్యాప్తంగా 5 లక్షల మంది విద్యార్థులకు ఏఐలో శిక్షణ ఇచ్చింది.‘వీడియో ఎడిటింగ్ ద్వారా నాకు ఏఐ టెక్నాలజీ గురించి తెలిసింది. అప్పట్లో మా నాన్నకు ఎడోబీలో జాబ్ వచ్చింది. దీంతో, నాకు ఎడోబీ ప్రీమియం టూల్స్ అకౌంట్స్ అన్నీ అందుబాటులోకి వచ్చాయి. అలా ఏఐ గురించి తెలిసింది. దాని సాయంతో నేను మీబాట్ అనే ఓ రోబోను కూడా డిజైన్ చేశాను’ అని చెప్పాడు. ఇక మాస్కోలో ప్రస్తుతం జరుగుతున్న ప్రతిష్ఠాత్మక కాన్ఫరెన్స్‌లో భారత్‌తో పాటు సెర్బియా, బ్రెజిల్, కెన్యా, కజకస్థాన్, యూఏఈ దేశాల వారు పాల్గొంటున్నారు.

సురారం వేమన రెడ్డి నగర్‌లో డ్రైనేజీ సమస్యపై కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి పర్యటన



- మురుగునీటితో రహదారులు అస్తవ్యస్తం.. దుర్వాసనతో కాలనీవాసుల ఇబ్బందులు.
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీతో దోమల బెడద.. అనారోగ్య భయంతో స్థానికులు.
- డ్రైనేజీని తక్షణమే శుభ్రం చేసి సమస్యను పరిష్కరించాలని అధికారులకు విజ్ఞప్తి.

కుత్బుల్లాపూర్: నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని సురారం గ్రామం వేమన రెడ్డి నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యపై బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.గత కొన్ని రోజులుగా కాలనీలో డ్రైనేజీ పొంగిపొర్లుతూ మురుగునీరు రహదారులపై నిలిచిపోతోందని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోందని, దోమల బెడద పెరిగి ప్రజలు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.



దీనిపై స్పందించిన కొండకల్ల శ్రీనివాస్ రెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. వేమన రెడ్డి నగర్ కాలనీలో డ్రైనేజీని తక్షణమే శుభ్రం చేసి, మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రజారోగ్యానికి ముప్పుగా మారకముందే అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జకీర్ నాయక్ సంస్థపై కేంద్రం కీలక నిర్ణయం- రాష్ట్రాలు, యూటీలకు ‘ఉపా’ అధికారాలు

న్యూ ఢిల్లీ :విదేశాల్లో తలదాచుకుంటున్న వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్‌కు చెందిన ఇస్లామిక్ రీసెర్చ్ ఫౌండేషన్ (ఐఆర్ఎఫ్)పై కేంద్ర హోంశాఖ ఉక్కుపాదం మోపింది. నిషేధిత సంస్థగా ప్రకటించిన ఐఆర్?ఎఫ్ నిధులు, ఆస్తులపై చర్యలు తీసుకునే పూర్తి అధికారాలను రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు బదిలీ చేస్తూ గెజిట్ నోటిఫికేషన్ జారీచేసింది. ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఈ ఆదేశాలు జారీ చేసినట్లు హోంశాఖ తెలిపింది.ఐఆర్ఎఫ్ కార్యకలాపాలపై మరింత సమర్థంగా నిఘా ఉంచడంతో పాటు, చట్టవిరుద్ధ కార్యకలాపాలకు ఉపయోగపడుతున్న ఆర్థిక వనరులను అడ్డుకోవడమే తాజా నిర్ణయం వెనుక ప్రధాన ఉద్దేశంగా కనిపిస్తోంది. యూఏపీఏ చట్టంలోని సెక్షన్ 42 ప్రకారం కేంద్ర ప్రభుత్వం ఈ అధికారాలను రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల పరిపాలనా యంత్రాంగానికి బదిలీ చేసింది. దీని ప్రకారం ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వ పరిధిలో ఉన్న సెక్షన్ 7, సెక్షన్ 8 కింద అధికారాలను ఇకపై రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్రపాలిత ప్రాంతాల అధికారులు కూడా వినియోగించుకోవచ్చు.



ఐఆర్ఎఫ్‌కు సంబంధించిన వ్యవహారాల్లో ఈ అధికారాలను ఉపయోగించుకోవాలని కేంద్రం స్పష్టం చేసింది.నిధుల బదిలీలపై నిఘాఉపాలోని సెక్షన్ 7 ప్రధానంగా చట్టవిరుద్ధ సంస్థల కార్యకలాపాలకు వినియోగిస్తున్నట్లు అనుమానిస్తున్న నిధులు, సెక్యూరిటీలు, ఇతర ఆర్థిక ఆస్తుల వినియోగాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వానికి అధికారాలు కల్పిస్తుంది. ఇలాంటి సంస్థలకు నిధులు అందకుండా చూడటం, ఇప్పటికే ఉన్న ఆర్థిక వనరుల బదిలీలను అడ్డుకోవడం ఈ సెక్షన్ పరిధిలోకి వస్తాయి. అంతేకాకుండా అనుమానాస్పద ఆర్థిక లావాదేవీలపై విచారణ జరిపేందుకు కూడా చట్టం అవకాశం కల్పిస్తుంది. ఐఆర్ఎఫ్‌కు సంబంధించిన ఆర్థిక కార్యకలాపాల్లో అనుమానాస్పద లావాదేవీలు గుర్తిస్తే, చట్టపరమైన నిబంధనలకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది.భవనాలు, కార్యాలయాలపైనా చర్యలుఇక యూఏపీఏలోని సెక్షన్ 8 చట్టవిరుద్ధ సంస్థల కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు అనుమానించే ప్రాంగణాలపై చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వానికి అధికారాలు కల్పిస్తుంది. ఇళ్లు, భవనాలు, కార్యాలయాలు తదితర ప్రదేశాలను ఈ నిబంధన కింద గుర్తించి నోటిఫై చేయవచ్చు. తాజా గెజిట్ నోటిఫికేషన్ నేపథ్యంలో ఐఆర్ఎఫ్ కార్యకలాపాలకు ఉపయోగిస్తున్నట్లు అనుమానించే ప్రాంగణాలపై రాష్ట్ర ప్రభుత్వాలు కూడా చర్యలు చేపట్టే అవకాశం ఉంటుంది. అక్కడ ఉన్న చరాస్తుల వినియోగంపైనా ఆంక్షలు విధించే అవకాశం ఉంటుంది. తద్వారా సంస్థ కార్యకలాపాలకు ఉపయోగపడుతున్నట్లు భావించే ఆస్తులు, వనరులపై స్థానిక స్థాయిలోనే పర్యవేక్షణ చేపట్టేందుకు మార్గం సుగమమైంది.ఐదేళ్ల పాటు నిషేధం పొడిగింప జకీర్ నాయక్‌కు చెందిన ఐఆర్ఎఫ్‌పై కేంద్ర ప్రభుత్వం గతంలోనూ కఠిన చర్యలు తీసుకుంది. తొలిసారిగా 2016 నవంబర్ 17న ఈ సంస్థను చట్టవిరుద్ధ సంఘంగా ప్రకటించింది. అయితే అంతకుముందే నవంబర్ 13న కేంద్ర హోంశాఖ మరో ఐదేళ్ల పాటు నిషేధాన్ని పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం తుది దశకు చేరుకుంది

న్యూ ఢిల్లీ :భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ డీల్ తుది దశకు చేరుకుందని వెల్లడించారు. ఒప్పందాన్ని పూర్తి చేయడానికి అవసరమైన ప్రక్రియ, మార్గదర్శకాలు రూపుదిద్దుకుంటున్నాయని తెలిపారు. భారతీయ వస్తువులపై 25 శాతం కొత్త సుంకాలను విధించాలని అమెరికా ప్రతిపాదించిన నేపథ్యంలో ‘ఇండియా డెట్ క్యాపిటల్ మార్కెట్ సమ్మిట్- 2026’ను ఉద్దేశించి వర్చువల్‌గా మాట్లాడుతూ గోయల్ ఈ వ్యాఖ్యలు చేశారు.భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ ఏడాది చివర్లో కుదిరే అవకాశం ఉందని పీయూశ్ గోయల్ స్పష్టం చేశారు. వచ్చే ఏడాది మార్చి లేదా ఏప్రిల్ నాటికి ఇది అమల్లోకి రావొచ్చని తెలిపారు. గత ఐదేళ్లలో భారత్ 38 అభివృద్ధి చెందిన దేశాలతో తొమ్మిది స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలను (ఎఫ్‌టీఏలను) ఖరారు చేసిందన్నారు. ఈ డీల్స్ ద్వారా 70 ట్రిలియన్ డాలర్ల ఉమ్మడి జీడీపీ కలిగిన ఆర్థిక వ్యవస్థలలో ప్రాధాన్యతా మార్కెట్ ప్రాప్యతను పొందిందని గుర్తు చేసుకున్నారు. చర్చల దశలో ఉన్న మరో 8-9 ఒప్పందాలతో ఇది 85 ట్రిలియన్ డాలర్లకు విస్తరించవచ్చని అభిప్రాయపడ్డారు. దేశీయ ఆర్థిక వ్యవస్థ గురించి సైతం గోయల్ స్పందించారు. సంఘర్షణలు, చమురు ధరల షాక్‌లు, సుంకాల సంబంధిత అంతరాయాలతో సహా ప్రపంచవ్యాప్త అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత్ తన వృద్ధి వేగాన్ని కొనసాగించిందని అన్నారు.



“భారత్- అమెరికా వాణిజ్య ఒప్పందం ముగింపు దశకు చేరుకుంది. డీల్‌ను ఖరారు చేయడంలో ఎప్పుడూ అడ్డంకిగా ఉన్న ప్రక్రియ, మార్గం ఇప్పుడు కొంత రూపుదిద్దుకుంటున్నాయి. భారత్-ఈయూ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ఈ ఏడాది చివర్లో కుదిరే అవకాశం ఉంది. వచ్చే ఏడాది మార్చి- ఏప్రిల్ నాటికి ఇది అమల్లోకి రావచ్చు. ప్రపంచవ్యాప్తంగా ఇన్ని అనిశ్చితులు ఉన్నప్పటికీ భారత వృద్ధి కథపై ప్రపంచానికి ఉన్న నమ్మకం ఒక్కటే స్థిరంగా నిలిచిందని నేను భావిస్తున్నాను. ఆ నమ్మకాన్ని మేము నిలబెట్టుకున్నాం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. సెప్టెంబర్ త్రైమాసికంలో కూడా ఆర్థిక వ్యవస్థ ఇదే మార్గంలో కొనసాగుతుందని ఆశిస్తున్నాం. స్థూల మూలధన నిర్మాణం సుమారు 12 శాతం పెరిగింది. బ్యాంకు రుణాలు సుమారు 19 శాతం చొప్పున వృద్ధి చెందుతున్నాయి. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెలల్లో ఎగుమతులు సుమారు 570 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. దీంతో మే నెలలో నిర్దేశించుకున్న 1 ట్రిలియన్ డాలర్ల వార్షిక ఎగుమతుల లక్ష్యాన్ని సాధించే దిశగా భారత్ పయనిస్తోంది. అక్టోబర్ ఎగుమతులు రికార్డు స్థాయిలో దాదాపు 90 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఈ పనితీరుకు ఎగుమతిదారులు, తయారీదారులు, సేవా ప్రదాతలు, వ్యవసాయ, మత్స్య ఎగుమతిదారులే కారణం. “‘చమురు ధరలు దేశ ఆర్థిక దృక్పథాన్ని మార్చలేవు’700 బిలియన్ డాలర్లకు పైగా విదేశీ మారకపు నిల్వలు, తక్కువ బాహ్య రుణాన్ని పీయూశ్ గోయల్ ప్రస్తావించారు. భారత్ విస్తృత ఆర్థిక పరిమాణం, బలమైన ఆర్థిక స్థితి అంతర్జాతీయ చమురు ధరల హెచ్చుతగ్గుల వల్ల కలిగే ప్రభావాన్ని తగ్గించాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ చమురు ధరలు దేశ దీర్ఘకాలిక ఆర్థిక దృక్పథాన్ని నిర్ణయించే అవకాశం లేదని అభిప్రాయపడ్డారు. సెమీకండక్టర్ తయారీ యూనిట్లు, విద్యుత్ గ్రిడ్‌లు, డేటా సెంటర్లు, ఓడరేవులలో పెట్టుబడుల వల్ల మూలధనానికి భారీ డిమాండ్ ఏర్పడుతుందని తెలిపారు. నిధుల సమీకరణలో ప్రైవేట్ మూలధనం మరింత ముఖ్యమైన వనరుగా మారుతుందన్నారు.

డీలిమిటేషన్ బిల్లు టీఎంసీ తిరుగుబాటు ఎంపీలు మద్దతిస్తారా

న్యూ ఢిల్లీ :డీ-లిమిటేషన్ బిల్లుపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేస్తున్న వేళ తృణమూల్ కాంగ్రెస్ తిరుగుబాటు ఎంపీల మద్దతు గురించి ఆసక్తికర చర్చ జరుగుతోంది. టీఎంసీ నుంచి విడిపోయిన 20 మంది తిరుగుబాటు ఎంపీలు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో తమకు నచ్చిన విధంగా ఓటు వేసేందుకు అవకాశం ఉందని లోక్‌సభ సచివాలయ వర్గాలు వెల్లడించాయి. వారిపై ప్రస్తుతం అనర్హత పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. అయినప్పటికీ స్పీకర్ అధికారికంగా అనర్హులుగా ప్రకటిం చేంత వరకు వారి ఓటు హక్కుకు ఎలాంటి ఆటంకం ఉండదని లోక్‌సభ వర్గాలు స్పష్టం చేసినట్లు సమాచారం నవంబర్ 30 నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ ప్రత్యేక సమా వేశాల్లో కేంద్ర డీలిమిటేషన్ బిల్లును తీసుకొచ్చే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో 20 మంది టీఎంసీ ఎంపీల ఓట్లు ప్రభుత్వానికి కీలకంగా మారనున్నాయి. టీఎంసీకి చెందిన 20 మంది ఎంపీలు ఈ ఏడాది జూన్‌లో పార్టీ నుంచి విడిపోయి, నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా



(ఎన్‌సీపీఐ)లో విలీనమవుతున్నట్లు ప్రకటించారు. వీరిపై టీఎంసీ లోక్‌సభ పక్ష నేత అభిషేక్ బెనర్జీ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేశారు. పార్టీ ఫిరాయింపుల నిరోధక చట్టం కింద వారిపై అనర్హత వేటు వేయాలని కోరారు ఆరు నెలలు గడుస్తున్నా ఈ పిటిషన్లపై స్పీకర్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదు. దీంతో అధికారిక రికార్డుల్లో వారింకా ఎంపీలుగానే కొనసాగుతున్నారు. స్పీకర్ అనర్హత వేటు వేస్తూ నిర్ణయం తీసుకునేంత వరకు ఆ 20 మంది ఎంపీలకు పార్లమెంట్‌లో పాల్గొనే హక్కుతో పాటు ఓటు హక్కు కూడా ఉంటుంది. 20 మంది ఎంపీలపై అనర్హత పిటిషన్లు దాఖలై ఆరు నెలలు గడిచినా స్పీకర్ ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ విమర్శించారు.

సుప్రీంకోర్టు కొలీజియంపై మాజీ సీజేఐ బి.ఆర్.గవాయ్ అసంతృప్తి.. రాష్ట్రపతికి లేఖ

ఢిల్లీ,నవంబర్ 27: సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సులపై మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కొలీజియం సిఫార్సుల్లో జోక్యం చేసుకోవాలని భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన విజ్ఞప్తి చేశారు. న్యాయమూర్తుల నియామకాలు, బదిలీల సిఫార్సుల్లో జోక్యం చేసుకోవాలని ఆమెను కోరారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ మూడు పేజీల లేఖ రాశారు. ప్రతిభ, వైవిధ్యాన్ని పక్కనపెట్టి ఒకే వర్గానికి పెద్దపీట వేస్తున్నారని ఆయన ఆరోపించారు.దేశ జనాభాలో 5 శాతం కంటే తక్కువ జనాభా ఉన్న వర్గానికి సుప్రీంకోర్టులో 40 శాతానికిపైగా ప్రాతినిధ్యం వహిస్తుందని సోదాహరణగా ఆ లేఖలో మాజీ సీజేఐ జస్టిస్ బి.ఆర్. గవాయ్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, మహిళలతో పాటు ఇతర అగ్రవర్ణాలకూ అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. శిక్షాత్మక బదిలీల (కు జడ్జీలకు ప్రముఖ హైకోర్టుల చీఫ్ జస్టిస్‌లుగా పదోన్నతులు కల్పిస్తున్నారని విమర్శించారు.



స్తంభం వద్ద దీపం వెలిగించాల్సిందే’

అమరావతితమిళనాడు తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న రాతి స్తంభం వద్ద కార్తీక దీపం వెలిగించకపోవడంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. తమ ఆదేశాలను ఎవరూ నీరుగార్చలేరని, రాజ్యాంగ అరాచకాన్ని సృష్టించేందుకు ఎవరు ప్రయత్నించినా వారిని దారిలోకి తెస్తామని హెచ్చరించింది. రేపు రాతి స్తంభం వద్ద దీపం వెలిగించాలని తేల్చిచెప్పింది. అలాగే కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు తమిళనాడు ప్రధాన కార్యదర్శి, డీజీపీ, మదురై కలెక్టర్, ఇతరులకు శుక్రవారం ధిక్కార నోటీసులు జారీ చేసింది. ఈ కేసుపై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం.పంచోలిలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.అటు మదురై పోలీస్ కమిషనర్‌ను సుప్రీం ధర్మాసనం తీవ్రంగా మందలించింది. ‘మీరు కారుస్తున్నవి నిజమైన కన్నీళ్లా లేక మొసలి కన్నీళ్లా అన్నది తేలుస్తా’ అని వ్యాఖ్యానించింది. దీపం వెలిగించే ప్రాంతానికి వెళ్లకుండా మధ్యాహ్నం 3 గంటల



సమయంలో పోలీసులు అడ్డుకున్నారని ఏఎస్ఐ తరఫున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. ఏఎస్ఐ అధికారుల ప్రవేశానికి సంబంధించి ఎలాంటి ఆదేశాలు అందలేదని ఆలయ ధర్మకర్తలు చెప్పినట్లు వివరించారు. ఈ విషయాన్ని జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ విపుల్ ఎం. పంచోలిలతో కూడిన ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.పోలీసుల తీరుపై ఏఎస్ఐ అభ్యంతరంస్థానిక పోలీసులు ఏఎస్ఐ బృందాన్ని అడ్డుకోవడం కోర్టు ధిక్కారమేనని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా పేర్కొన్నారు. ఇది పరిపాలనా అహంకారానికి నిదర్శనమని, ప్రభుత్వం మొదటి నుంచీ దీపం వెలిగించడాన్ని వ్యతిరేకిస్తోందని ఆరోపించారు. కోర్టు ఆదేశాలు అమలు కాలేదన్న విషయం స్పష్టంగా కనిపిస్తోందని మెహతా అన్నారు. ధిక్కారానికి పాల్పడినవారు దీపం వెలిగించడం ద్వారా తమ తప్పును సరిదిద్దుకోవాలని సూచించారు. పోలీసులు వ్యవహరించిన తీరును చూపించే వీడియోలు కూడా ఉన్నాయని, దీపం వెలిగించే ప్రాంతమంతా పోలీసులతో నిండిపోయిందని తెలిపారు. ఈ వ్యవహారాన్ని మరో సంస్థ పర్యవేక్షించేలా చూడాలని ధర్మాసనాన్ని కోరారు.

సంపాదకీయం

అకాలీదళ్‌తో దోస్తీ.. కమలం వికసించేనా?

● పంజాబ్‌లో పట్టు పెంచుకునేందుకు బీజేపీ వ్యూహం.. ఆరేళ్ల విరామం తర్వాత మళ్లీ జతకట్టిన పాత మిత్రులు.. ఓట్ల బదిలీ, రైతుల విశ్వాసమే కూటమికి అసలైన పరీక్ష!



దేశ రాజకీయాల్లో ఎన్నికల సమీకరణాలు ఎప్పటికప్పుడు మారుతున్నాయి. అధికారమే లక్ష్యంగా రాజకీయ పార్టీలు తమ వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఒకప్పుడు మిత్రులుగా ఉన్న పార్టీలు అవసరాన్ని బట్టి విడిపోవడం, తిరిగి కలవడం సాధారణ రాజకీయ పరిణామంగా మారింది. తాజాగా పంజాబ్ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ (బీజేపీ), శిరోమణి అకాలీదళ్ మళ్లీ చేతులు కలపడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు ఆరేళ్ల విరామం తర్వాత ఈ రెండు పార్టీలు తిరిగి కూటమిగా ఏర్పడటం 2027లో జరగనున్న పంజాబ్ అసెంబ్లీ ఎన్నికలపై ప్రభావం చూపనుంది. అయితే ఈ పొత్తుతో కమలం వికసిస్తుందా? అకాలీదళ్ పూర్వ వైభవాన్ని సాధిస్తుందా? అన్నది ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. **మూడు దశాబ్దాల అనుబంధం.. ఆరేళ్ల ఎడబాటు**బీజేపీ, అకాలీదళ్ మధ్య రాజకీయ అనుబంధం దశాబ్దాలుగా కొనసాగింది. 1990వ దశకం నుంచి ఈ రెండు పార్టీలు కలిసి పంజాబ్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషించాయి. గ్రామీణ ప్రాంతాల్లో అకాలీదళ్‌కు ఉన్న పట్టును, పట్టణ ప్రాంతాల్లో బీజేపీకి ఉన్న మద్దతును సమన్వయం చేసుకుంటూ ఎన్నికల్లో విజయాలు సాధించాయి. అయితే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలపై రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో 2020లో అకాలీదళ్ ఎన్డీఏ కూటమి నుంచి బయటకు వచ్చింది. దీంతో రెండు పార్టీల మధ్య దశాబ్దాల అనుబంధానికి విరామం ఏర్పడింది. అప్పటి నుంచి విడివిడిగా రాజకీయ ప్రయాణం సాగించిన ఈ పార్టీలు ఇప్పుడు తిరిగి ఒక్కటయ్యాయి.**అధికారమే లక్ష్యంగా కొత్త రాజకీయ వ్యూహం**2027 అసెంబ్లీ ఎన్నికల్లో పంజాబ్‌లో అధికారాన్ని దక్కించుకోవాలన్న లక్ష్యంతో బీజేపీ, అకాలీదళ్ పునరేకీకరణకు సిద్ధమయ్యాయి. కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో ఈ కూటమి ప్రకటన వెలువడింది. అకాలీదళ్ అధ్యక్షుడు సుఖ్‌బీర్ సింగ్ బాదల్‌తో కలిసి బీజేపీ నాయకత్వం కొత్త రాజకీయ ప్రయాణానికి శ్రీకారం చుట్టింది. కూటమిలో అకాలీదళ్ పెద్దన్న పాత్ర పోషిస్తుందని, ముఖ్యమంత్రి పదవి కూడా పెద్ద పార్టీకి దక్కుతుందని అమిత్ షా ప్రకటించడం గమనార్హం. దీనితో అకాలీదళ్ శ్రేణుల్లో కొంత ఉత్సాహం కనిపించే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్‌లో స్వతంత్రంగా బలపడేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీకి అకాలీదళ్ గ్రామీణ ఓటు బ్యాంకు ఉపయోగపడుతుందన్న అంచనాలున్నాయి.**రెండు పార్టీలకు పరస్పర అవసరం** గత ఎన్నికల ఫలితాలను పరిశీలిస్తే రెండు పార్టీల బలహీనతలు స్పష్టమవుతున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) ఘన విజయం సాధించి 92 స్థానాలను కైవసం చేసుకుంది. కాంగ్రెస్ 18 స్థానాలకు పరిమితమైంది. అకాలీదళ్ కేవలం మూడు స్థానాలతో సరిపెట్టుకోగా, బీజేపీ రెండు స్థానాలకే పరిమితమైంది. 2024 లోక్‌సభ ఎన్నికల్లోనూ అకాలీదళ్ ఒక స్థానంతో, బీజేపీ సున్నా స్థానాలతో వెనుకబడింది. ఈ పరిస్థితుల్లో విడివిడిగా పోటీ చేస్తే మరింత నష్టపోయే ప్రమాదం ఉందని రెండు పార్టీలు భావించినట్లు కనిపిస్తోంది. అందుకే పరస్పర బలాలను ఉపయోగించుకొని రాజకీయంగా పుంజుకోవాలని నిర్ణయించుకున్నాయి. అయితే కూటమి ఏర్పడినంత మాత్రాన ఓట్లు బదిలీ అవుతాయన్న హామీ లేదు.

రైతుల ఆగ్రహం.. బీజేపీకి ప్రధాన సవాలు

పంజాబ్ రాజకీయాల్లో రైతుల సమస్యలు అత్యంత కీలకమైనవి. వ్యవసాయమే ప్రధాన జీవనాధారంగా ఉన్న ఈ రాష్ట్రంలో రైతుల అభిప్రాయాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేస్తాయి. మూడు వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం బీజేపీపై కొంతమంది రైతుల్లో తీవ్ర అసంతృప్తిని కలిగించింది. ఆ సమయంలో రైతుల పక్షాన నిలుస్తూ అకాలీదళ్ ఎన్డీఏ నుంచి బయటకు వచ్చింది. ఇప్పుడు అదే పార్టీ మళ్లీ బీజేపీతో చేతులు కలపడం రైతుల్లో ఎలాంటి స్పందన కలిగిస్తుందన్నది కీలకం. గతంలో రైతుల ఉద్యమానికి మద్దతు తెలిపిన అకాలీదళ్ ఇప్పుడు బీజేపీతో కలిసి ప్రచారం చేస్తే ప్రజలు ఎలా స్వీకరిస్తారో చూడాలి. రైతుల విశ్వాసాన్ని తిరిగి పొందకుండా కూటమి విజయం సాధించడం అంత సులభం కాదు. **సీట్ల పంపకాలే తొలి పరీక్ష** కూటమి ప్రకటించడం ఒక ఎత్తయితే, సీట్ల పంపకం మరో ఎత్తు. గతంలో అకాలీదళ్ ఎక్కువ స్థానాల్లో పోటీ చేయగా, బీజేపీ పరిమిత స్థానాల్లో బరిలోకి దిగేది. ప్రస్తుతం రెండు పార్టీల రాజకీయ బలాబలాల్లో మార్పులు వచ్చాయి. బీజేపీ తన ఓటు శాతాన్ని పెంచుకోవడంతో ఎక్కువ స్థానాల్లో పోటీ చేయాలని ఆశించే అవకాశం ఉంది. మరోవైపు అకాలీదళ్ తన సంప్రదాయ ఆధిపత్యాన్ని వదులుకోవడానికి సిద్ధంగా ఉంటుందా అన్నది ప్రశ్న. ముఖ్యమంత్రి పదవి విషయంలో అకాలీదళ్‌కు ప్రాధాన్యత ఇస్తామని ప్రకటించినప్పటికీ, నియోజకవర్గాల కేటాయింపులో ఇరు పార్టీల మధ్య ఏకాభిప్రాయం కుదరడం అవసరం. సీట్ల పంపకంలో అసంతృప్తి ఏర్పడితే కూటమి ఐక్యతకు విఘాతం కలిగే ప్రమాదం ఉంది. **ఆప్, కాంగ్రెస్‌ను ఎదుర్కోవడం అంత సులభం కాదు**

పంజాబ్‌లో ప్రస్తుతం ఆమ్ ఆద్మీ పార్టీ అధికారంలో ఉండగా, కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా కొనసాగుతోంది. ఈ రెండు పార్టీలకు రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ పునాది ఉంది. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఆప్ తన పట్టును నిలబెట్టుకోవాలని ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ కూడా అధికారాన్ని తిరిగి దక్కించుకునేందుకు వ్యూహాలు రచిస్తోంది. ఈ పరిస్థితుల్లో బీజేపీ, అకాలీదళ్ కూటమి కొత్త రాజకీయ శక్తిగా ఎదగాలంటే కేవలం పొత్తు ప్రకటనలు సరిపోవు. ప్రజల సమస్యలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. నిరుద్యోగం, మాదకద్రవ్యాల వ్యాప్తి, రైతుల సమస్యలు, యువత భవిష్యత్తు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై విశ్వసనీయమైన కార్యాచరణను ప్రజల ముందుంచాలి. కేవలం ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడం ద్వారా ప్రజల మద్దతు పొందలేరు.

సిక్కు ఓటర్ల విశ్వాసం కీలకం

పంజాబ్ రాజకీయాల్లో సిక్కు సమాజం, మతపరమైన అంశాలు, ప్రాంతీయ ఆత్మగౌరవం కీలక పాత్ర పోషిస్తాయి. అకాలీదళ్‌కు సంప్రదాయంగా సిక్కు సమాజంలో ఒక రాజకీయ పునాది ఉంది. బీజేపీకి పట్టణ ప్రాంతాల్లో హిందూ ఓటర్ల మద్దతు ఉంది. గతంలో ఈ రెండు వర్గాల ఓట్లను సమన్వయం చేసుకోవడంలో కూటమి కొంతవరకు విజయవంతమైంది. అయితే ప్రస్తుత పరిస్థితులు గతానికి భిన్నంగా ఉన్నాయి. సిక్కు రాజకీయ ఖైదీల విడుదల, పంజాబ్ హక్కులు, రాష్ట్ర ప్రయోజనాలు వంటి అంశాలపై అకాలీదళ్ తన వైఖరిని స్పష్టం చేయాల్సి ఉంటుంది. మరోవైపు బీజేపీపై ఉన్న కొన్ని వర్గాల అసంతృప్తిని తొలగించుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం నాయకుల స్థాయిలో కుదిరిన ఒప్పందం క్షేత్రస్థాయిలో ప్రజల మద్దతుగా మారుతుందా అన్నదే అసలు ప్రశ్న.

మహిళలపై హింసకు అడ్డుకట్ట ఎప్పుడు?

ఆడపిల్లల భద్రతకు భరోసా ఏదీ? చట్టాలు కఠినతరం కావాలి.. నేరస్థులకు శిక్షలు వేగంగా పడాలి.. సమాజంలో మార్పు రావాలి!



మహిళలు, బాలికలపై రోజురోజుకూ పెరుగుతున్న హింసాత్మక ఘటనలు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. మహిళలకు సమాన హక్కులు కల్పించామని, ఆడపిల్లల అభ్యున్నతికి ఎన్నో పథకాలు అమలు చేస్తున్నామని పాలకులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో వారి భద్రత ప్రశ్నార్థకంగానే మిగులుతోంది. ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆడపిల్ల క్షేమంగా తిరిగి వస్తుందో లేదోనన్న ఆందోళన తల్లిదండ్రుల్లో నెలకొంటోంది. విద్యాసంస్థలు, పని ప్రదేశాలు, ప్రయాణ మార్గాలు, చివరకు ఇళ్లలోనూ మహిళలకు రక్షణ లేకపోవడం ఆందోళన కలిగించే పరిణామం. మహిళలపై దాడులు, అత్యాచారాలు, వేధింపులు, హత్యలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా వాటిని పూర్తిస్థాయిలో అరికట్టలేకపోవడం పాలనా వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపుతోంది.**మారుతున్న కాలం.. మారని పురుషాధిక్య భావజాలం**సమాజం ఆధునికత వైపు పరుగులు తీస్తున్నా మహిళల పట్ల కొందరి ఆలోచనా విధానంలో మాత్రం మార్పు రావడం లేదు. మహిళలను సమాన హక్కులు కలిగిన వ్యక్తులుగా చూడకుండా తమ ఆధీనంలో ఉండాల్సిన వారిగా భావించే పురుషాధిక్య ధోరణి అనేక సమస్యలకు మూలంగా మారుతోంది. మహిళల దుస్తులు, నడవడిక, వ్యక్తిగత స్వేచ్ఛపై వ్యాఖ్యలు చేస్తూ వేధింపులకు పాల్పడటం, ప్రేమ పేరుతో వెంటపడటం, తిరస్కరిస్తే దాడులకు దిగడం వంటి ఘటనలు మానవత్వానికే మచ్చగా నిలుస్తున్నాయి. మహిళల స్వేచ్ఛను నియంత్రించడం పరిష్కారం కాదు. మహిళలను గౌరవించే సంస్కృతిని పెంపొందించడమే అసలైన పరిష్కారం.**బాలికలపై దాడులు మరింత ఆందోళనకరం**మహిళలపై హింసతో పాటు చిన్నారులు, బాలికలపై లైంగిక దాడులు చోటుచేసుకోవడం అత్యంత విషాదకరం. అభం శుభం తెలియని చిన్నారులపై అఘాయిత్యాలకు పాల్పడుతున్న ఘటనలు సమాజంలోని విలువలు ఎంతగా దిగజారుతున్నాయో తెలియజేస్తున్నాయి. బాలికలకు కుటుంబ సభ్యులే తొలి రక్షణ కవచంగా ఉండాలి. పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనించాలి. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వయసుకు తగిన అవగాహన కల్పించాలి. ఏదైనా వేధింపులు ఎదురైతే భయపడకుండా తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు చెప్పే ధైర్యాన్ని కల్పించాలి. బాలికల భద్రత విషయంలో కుటుంబాలు, విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేయకూడదు. **చట్టాలున్నా.. అమలులోనే అసలు సమస్య** మహిళల రక్షణ కోసం దేశంలో అనేక చట్టాలు అమలులో ఉన్నాయి. అత్యాచారాలు, గృహహింస, వరకట్న వేధింపులు, లైంగిక వేధింపులు, బాలికలపై అఘాయిత్యాలను అరికట్టేందుకు ప్రత్యేక చట్టాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ నేరాల సంఖ్య తగ్గకపోవడానికి చట్టాల అమలులో ఉన్న లోపాలు, కేసుల విచారణలో జాప్యం, బాధితులకు సకాలంలో న్యాయం అందకపోవడం ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. నేరం చేసిన వ్యక్తి ఎంతటి పలుకుబడి కలిగినవాడైనా చట్టం ముందు సమానంగా నిలబెట్టాలి. రాజకీయ ఒత్తిళ్లు, ఆర్థిక ప్రభావాలకు తావులేకుండా దర్యాప్తు జరగాలి. బాధితులు పోలీస్ స్టేషన్లకు వెళ్లినప్పుడు వారితో గౌరవంగా వ్యవహరించాలి. ఫిర్యాదులను స్వీకరించడంలో నిర్లక్ష్యం చూపే అధికారులపై చర్యలు తీసుకోవాలి. **సత్వర న్యాయం.. నేరస్థుల్లో భయం** మహిళలపై నేరాలకు పాల్పడిన వారిపై కేసులు నమోదు చేయడంతోనే ప్రభుత్వ బాధ్యత పూర్తికాదు. నిష్పక్షపాత దర్యాప్తు జరిపి, సాక్ష్యాధారాలను పకడ్బందీగా సేకరించి, న్యాయస్థానాల్లో కేసులు త్వరగా పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలి. ఏళ్ల తరబడి కేసులు కొనసాగడం వల్ల బాధితులు మానసికంగా, ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సాక్షులను బెదిరించడం, బాధితులపై ఒత్తిడి తీసుకురావడం వంటి చర్యలను అరికట్టాలి. బాధితులకు ఉచిత న్యాయ సహాయం, వైద్య సేవలు, మానసిక కౌన్సెలింగ్, పునరావాస సదుపాయాలు కల్పించాలి. నేరస్థులకు శిక్ష పడుతుందనే నమ్మకం సమాజంలో ఏర్పడినప్పుడే నేర ప్రవృత్తికి అడ్డుకట్ట పడుతుంది. **మహిళల భద్రతకు ప్రభుత్వాల బాధ్యత** మహిళల రక్షణ విషయంలో ప్రభుత్వాలు ప్రకటనలకే పరిమితం కాకుండా కార్యాచరణకు ప్రాధాన్యత ఇవ్వాలి. పోలీస్ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి. ముఖ్యంగా మహిళలు, బాలికలు ఎక్కువగా సంచరించే ప్రాంతాల్లో నిరంతర నిఘా ఏర్పాటు చేయాలి. బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, విద్యాసంస్థలు, పని ప్రదేశాల్లో భద్రతా చర్యలు పెంచాలి. వీధి దీపాలు, సీసీ కెమెరాలు, అత్యవసర సహాయ వ్యవస్థలను అందుబాటులోకి తీసుకురావాలి. షీ టీమ్స్ వంటి ప్రత్యేక విభాగాలను మరింత సమర్థవంతంగా పనిచేసేలా చూడాలి. మహిళలు తమకు ఎదురైన వేధింపులపై నిర్భయంగా ఫిర్యాదు చేసే వాతావరణాన్ని కల్పించాలి. **విద్యతో పాటు సంస్కారానికి ప్రాధాన్యం** మహిళలపై హింసను కేవలం పోలీసు చర్యలతోనే పూర్తిగా నిర్మూలించలేం. ఇందుకు సమాజంలో ఆలోచనా విధానంలో మార్పు రావాలి. బాలురకు చిన్నతనం నుంచే మహిళలను గౌరవించడం, వారి అభిప్రాయాలను గుర్తించడం, సమానత్వాన్ని పాటించడం నేర్పించాలి. పాఠశాలలు, కళాశాలల్లో లింగ సమానత్వం, వ్యక్తిగత గౌరవం, మహిళల హక్కులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. సినిమాలు, సామాజిక మాధ్యమాలు, ఇతర ప్రచార మాధ్యమాల్లో మహిళలను కించపరిచే ధోరణులకు స్వస్తి చెప్పాలి. మహిళలపై వేధింపులను వినోదంగా భావించే మనస్తత్వాన్ని మార్చాలి. కుటుంబాల్లోనూ ఆడపిల్ల, మగపిల్ల అనే వివక్ష లేకుండా సమాన అవకాశాలు కల్పించాలి. **సామాజిక మాధ్యమాల వేధింపులపైనా నిఘా** సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చెందుతున్న కొద్దీ మహిళలపై వేధింపులు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయి. సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర వ్యాఖ్యలు చేయడం, మార్ఫింగ్ చిత్రాలను ప్రచారం చేయడం, వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, బెదిరింపులకు పాల్పడటం వంటి సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. ఇలాంటి నేరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. సైబర్ నేర విభాగాలను బలోపేతం చేసి బాధ్యులను త్వరగా గుర్తించి చర్యలు తీసుకోవాలి. బాధిత మహిళల వ్యక్తిగత వివరాలు, గోప్యతకు భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. సామాజిక మాధ్యమాల వినియోగంపై కూడా ప్రజల్లో అవగాహన పెంచాలి. **మహిళల స్వేచ్ఛకు భద్రతే పునాది** మహిళలు చదువుకోవడం, ఉద్యోగాలు చేయడం, వ్యాపారాలు నిర్వహించడం, రాజకీయాల్లో పాల్గొనడం, తమకు నచ్చిన రంగాల్లో ఎదగడం వారి హక్కు. అయితే భద్రత పేరుతో మహిళల స్వేచ్ఛపై ఆంక్షలు విధించడం సరైన విధానం కాదు. రాత్రి వేళ బయటకు వెళ్లవద్దని, ఒంటరిగా ప్రయాణించవద్దని మహిళలకే ఆంక్షలు విధించే బదులు వారిని వేధించే వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. సమాజంలో మహిళలు భయం లేకుండా జీవించే పరిస్థితులు కల్పించాలి. మహిళల భద్రత అనేది ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం కాదు. నిరంతరం కొనసాగాల్సిన సామాజిక బాధ్యత. మహిళలపై హింసను అరికట్టేందుకు ప్రభుత్వాలు, పోలీసు వ్యవస్థ, న్యాయవ్యవస్థ, విద్యాసంస్థలు, కుటుంబాలు, పౌర సమాజం సమష్టిగా పనిచేయాలి. ప్రతి మహిళకు గౌరవం, ప్రతి బాలికకు భద్రత, ప్రతి బాధితురాలికి న్యాయం అందినప్పుడే నిజమైన సమానత్వం సాధ్యమవుతుంది. మహిళలను గౌరవించే సమాజమే అభివృద్ధి చెందిన సమాజం. ఆడపిల్లల భద్రతపై మాటలు చెప్పడం కాదు.. చేతల్లో చూపించాలి. మహిళలపై హింసకు చరమగీతం పాడే దిశగా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి. అప్పుడే భయంలేని సమాజ నిర్మాణం సాధ్యమవుతుంది.

ఐదు అస్త్రాలతో బీజేపీ రాజకీయ వ్యూహం!

తెలంగాణలో అధికారమే లక్ష్యంగా కమలం పార్టీ అడుగులు.. అగ్రనేతల పర్యటనలు, సామాజిక సమీకరణాలు, ఇతర పార్టీల నేతలకు గాలం.. 2028 ఎన్నికలే గురి!



తెలంగాణ రాజకీయాల్లో భారతీయ జనతా పార్టీ తన రాజకీయ బలాన్ని పెంచుకునేందుకు కొత్త వ్యూహాలకు పదును పెడుతోంది. రాష్ట్రంలో అధికారంలోకి రావాలన్న లక్ష్యంతో కేంద్ర నాయకత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఇప్పటివరకు జాతీయ రాజకీయాలు, కేంద్ర ప్రభుత్వ విధానాలు, హిందుత్వ అంశాలపై ఎక్కువగా దృష్టి పెట్టిన బీజేపీ.. ఇప్పుడు తెలంగాణలో స్థానిక రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా అడుగులు వేస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని పార్టీ సంస్థాగత బలోపేతం నుంచి సామాజిక వర్గాల సమీకరణాల వరకు పలు అంశాలపై కసరత్తు చేస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్, ఇతర ముఖ్య నేతల పర్యటనలు ఈ వ్యూహంలో భాగంగానే కనిపిస్తున్నాయి. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లకు ప్రత్యామ్నాయంగా ఎదగాలన్నది బీజేపీ ప్రధాన లక్ష్యంగా ఉంది.**కేంద్ర నాయకత్వం ప్రత్యక్ష పర్యవేక్షణ**తెలంగాణలో పార్టీ పరిస్థితిని క్షేత్రస్థాయిలో అంచనా వేసేందుకు బీజేపీ అధిష్ఠానం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసుకుంటోంది. రాష్ట్ర నాయకత్వం అందించే సమాచారంతో పాటు ఇతర మార్గాల ద్వారా కూడా రాజకీయ పరిస్థితులను విశ్లేషిస్తున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలాబలాలు, నియోజకవర్గాల వారీగా ప్రజాభిప్రాయం, నాయకుల పనితీరు, సామాజిక వర్గాల మద్దతు వంటి అంశాలపై నివేదికలు సేకరిస్తోంది. రాష్ట్ర నాయకత్వంపైనే పూర్తిగా ఆధారపడకుండా కేంద్ర నాయకత్వం నేరుగా వ్యూహరచనలో భాగస్వామ్యం కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాల్లో ఎన్నికల వ్యూహాలు అమలు చేసిన అనుభవాన్ని తెలంగాణలోనూ ఉపయోగించుకోవాలని పార్టీ భావిస్తోంది. అయితే కేంద్ర నాయకత్వం ఎంతగా పర్యవేక్షించినా స్థానిక సమస్యలపై అవగాహన, ప్రజలతో సంబంధాలు, క్షేత్రస్థాయి నాయకత్వం కీలక పాత్ర పోషించనున్నాయి.**రెండో అస్త్రం.. ఇతర పార్టీల నేతలకు ఆహ్వానం** రాష్ట్రంలో బలమైన రాజకీయ శక్తిగా ఎదిగేందుకు ఇతర పార్టీల్లోని అసంతృప్తి నేతలను ఆకర్షించడంపై బీజేపీ దృష్టి సారిస్తోంది. ముఖ్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లలో రాజకీయంగా ప్రాధాన్యత దక్కడం లేదని భావిస్తున్న నాయకులను తమవైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రతి జిల్లాలో ప్రజాబలం, అనుచరగణం ఉన్న నాయకులను గుర్తించి పార్టీలోకి తీసుకోవడం ద్వారా సంస్థాగతంగా బలోపేతం కావాలని చూస్తోంది. వివిధ సామాజిక వర్గాలకు చెందిన నాయకులకు ప్రాధాన్యత కల్పిస్తామని సంకేతాలు ఇస్తోంది. అయితే ఇతర పార్టీల నుంచి వచ్చే నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల ఇప్పటికే పార్టీలో పనిచేస్తున్న నాయకుల్లో అసంతృప్తి పెరిగే ప్రమాదం ఉంది. కొత్తవారిని చేర్చుకోవడంతో పాటు పాత నాయకులను సమన్వయం చేసుకోవడం బీజేపీకి పెద్ద సవాలుగా మారనుంది. **మూడో అస్త్రం.. మూడు సామాజిక వర్గాలపై గురి** తెలంగాణలో సామాజిక సమీకరణాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసే కీలక అంశాలు. ఈ నేపథ్యంలో మున్నూరు కాపు, ముదిరాజ్, మాదిగ సామాజిక వర్గాలపై బీజేపీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ మూడు వర్గాలకు చెందిన ప్రజలను ఒకే రాజకీయ వేదికపైకి తీసుకురావడం ద్వారా పార్టీ ఓటు బ్యాంకును విస్తరించుకోవాలన్నది వ్యూహంగా కనిపిస్తోంది. రాష్ట్రంలో ఈ వర్గాలకు గణనీయమైన జనాభా ఉండటంతో పాటు రాజకీయంగా కూడా ప్రాధాన్యత ఉంది. ఆయా వర్గాలకు చెందిన నాయకులకు పార్టీ పదవులు, ఎన్నికల్లో అవకాశాలు కల్పించడం ద్వారా మద్దతు కూడగట్టుకోవాలని భావిస్తోంది. అయితే కేవలం జనాభా లెక్కల ఆధారంగా ఓట్లు సాధించడం సాధ్యం కాదు. ఆయా వర్గాల సామాజిక, ఆర్థిక సమస్యలు, రిజర్వేషన్లు, రాజకీయ ప్రాతినిధ్యం వంటి అంశాలపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. సామాజిక సమీకరణాలు కాగితాలపై కాకుండా క్షేత్రస్థాయిలో ఫలితాలనివ్వాలి. **నాలుగో అస్త్రం.. హిందుత్వ, జాతీయవాద రాజకీయాలు** బీజేపీకి సంప్రదాయంగా బలంగా ఉన్న హిందుత్వ, జాతీయవాద అంశాలను తెలంగాణలోనూ విస్తృతంగా ప్రచారం చేయాలని భావిస్తోంది. తెలంగాణ విమోచన దినోత్సవం, జాతీయ సమైక్యత, సాంస్కృతిక అంశాలు, దేవాలయాల అభివృద్ధి వంటి విషయాలను రాజకీయ చర్చల్లో ముందుకు తీసుకువస్తోంది. ఈ అంశాల ద్వారా పార్టీకి అనుకూలమైన ఓటర్లను మరింత సమీకరించుకోవాలని చూస్తోంది.

ట్రక్ పార్క్ స్థలంపై మాధవరం నిరసనలు రాజకీయ ఉనికిని కాపాడుకునేందుకే!

- పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గుర్తుకురాని ప్రజా సమస్యలు ఇప్పుడు ఎలా గుర్తుకొచ్చాయి?
- కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ ఘాటు విమర్శలు



బాలానగర్ నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :కూకట్‌పల్లి నియోజకవర్గంలోని మూసాపేట హుడా ట్రక్ పార్క్ స్థలాన్ని వేలం వేయవద్దంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు చేస్తున్న నిరసన కార్యక్రమాలు ప్రజా ప్రయోజనాల కోసం చేస్తున్న పోరాటం కాదని, నియోజకవర్గంలో రోజురోజుకూ తగ్గుతున్న తన రాజకీయ ప్రాబల్యాన్ని కాపాడుకునేందుకు చేస్తున్న ప్రయత్నమని కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మదన్ మోహన్ తీవ్రంగా విమర్శించారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలు, ప్రభుత్వ భూముల పరిరక్షణ, నిరుపేదల సంక్షేమం వంటి అంశాలపై స్పందించని ఎమ్మెల్యేకు ఇప్పుడు అకస్మాత్తుగా ప్రజా సమస్యలు గుర్తుకు రావడం విడ్డూరంగా ఉందన్నారు. ట్రక్ పార్క్ స్థలంలో ప్రజలకు ఉపయోగపడేలా క్రీడా ప్రాంగణం లేదా స్టేడియం నిర్మించాలనే ఆలోచన పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. అప్పుడు నిర్మాణాలు చేపట్టకుండా మిమ్మల్ని ఎవరు అడ్డుకున్నారని నిలదీశారు.

- ప్రభుత్వ భూముల పరిరక్షణపై బహిరంగ చర్చకు సిద్ధమా?

మాధవరం కృష్ణారావుకు నిజంగా ప్రభుత్వ భూముల పరిరక్షణపై చిత్తశుద్ధి ఉంటే 2014 నుంచి నేటి వరకు కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో అన్యాక్రాంతమైన ప్రభుత్వ భూములపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరే ధైర్యం ఉందా అని మదన్ మోహన్ సవాల్ విసిరారు. ఎక్కడెక్కడ ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురయ్యాయి? ఎవరి హయాంలో ఎవరికి ప్రయోజనం చేకూరింది? అనే అంశాలపై బహిరంగ చర్చకు రావాలని డిమాండ్ చేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అర్హులైన దళిత కుటుంబాలకు దళితబంధు పథకం అందించడంలో జరిగిన అన్యాయంపై ఎమ్మెల్యే ఎందుకు పోరాటం చేయలేదని ప్రశ్నించారు. దళిత కుటుంబాలకు న్యాయం చేయాలని అప్పట్లో ఎందుకు నిరసనలు చేపట్టలేదని నిలదీశారు. చుట్టుపక్కల నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వేల సంఖ్యలో రెండు పడక గదుల ఇళ్లను మంజూరు చేయించుకుంటే కూకట్‌పల్లి నియోజకవర్గానికి మాత్రం ఆశించిన స్థాయిలో ఇళ్లు ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. చిత్తారమ్మ బస్తీలో పరిమిత స్థాయిలో నిర్మాణాలు చేపట్టడం మినహా నిరుపేద కుటుంబాలకు పెద్ద సంఖ్యలో ఇళ్లు అందించడంలో జరిగిన వైఫల్యానికి సమాధానం చెప్పాలన్నారు.

గతంలో భూముల వేలాలు జరిగినప్పుడు ఎందుకు ప్రశ్నించలేదు?

ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటిసారిగా ప్రవేశపెట్టిన విధానం కాదని, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనూ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో విలువైన ప్రభుత్వ భూముల వేలాలు, కేటాయింపులు జరిగాయని గుర్తుచేశారు. అప్పట్లో ప్రభుత్వ భూముల పరిరక్షణ గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. నేడు అదే అంశాన్ని రాజకీయ ప్రచారానికి ఉపయోగించుకోవడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.

- ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని మదన్ మోహన్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజల్లో లభిస్తున్న ఆదరణతో బీఆర్ఎస్ రాజకీయంగా ఆత్మరక్షణలో పడిందని అన్నారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గంలోని వాస్తవ సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకుండా, ఒక్కో అంశాన్ని రాజకీయ వివాదంగా మార్చి తన ఉనికిని చాటుకోవడానికి ఎమ్మెల్యే ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల చేత ఎన్నుకోబడిన ఎమ్మెల్యేగా ఎన్నికల సమయంలోనే కాకుండా నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిన బాధ్యత ఆయనపై ఉందన్నారు.

- ప్రజలకు కావాల్సింది రాజకీయాలు కాదు.. అభివృద్ధి!

కూకట్‌పల్లి ప్రజలకు కావాల్సింది రోడ్లపై రాజకీయ నిరసనలు, పరస్పర విమర్శలు కాదని, మౌలిక సదుపాయాలు, అభివృద్ధి, సంక్షేమం, పారదర్శక పాలన అని మదన్ మోహన్ స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల పరిరక్షణపై నిజాయితీ ఉంటే గత పదేళ్లలో జరిగిన భూ కేటాయింపులు, ఆక్రమణలు, ప్రభుత్వ భూముల వినియోగంపై సమగ్ర విచారణకు సహకరించాలని సూచించారు. గత పాలనలో జరిగిన తప్పులను ప్రశ్నించకుండా నేడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని మాత్రమే లక్ష్యంగా చేసుకోవడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని విమర్శించారు. కూకట్‌పల్లి ప్రజలు రాజకీయ నాటకాలను కాకుండా నాయకుల పనితీరును నిశితంగా గమనిస్తున్నారని, పదేళ్ల పాలనలో ఏం చేశారు? ప్రస్తుతం ప్రజల కోసం ఏం చేస్తున్నారు?

అనే అంశాలపై ప్రజలే సరైన సమయంలో తీర్పు చెబుతారని అన్నారు. రాజకీయ అస్తిత్వం కోసం ప్రజా సమస్యలను వాడుకోవడం మానుకోవాలి. పదేళ్ల పాలనలో జరిగిన వైఫల్యాలకు సమాధానం చెప్పాలి మాధవరం కృష్ణారావు గారూ! అని మదన్ మోహన్ ఘాటుగా వ్యాఖ్యానించారు.

బాలానగర్‌లో తాగునీటి వృథా.. పట్టించుకోని జలమండలి అధికారులు!

- బాలానగర్ నైపర్ సమీపంలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న పైపులైన్ లీకేజీలు..
- రోడ్లపైకి చేరుతున్న వేల లీటర్ల వృదాగా స్వచ్ఛ తాగు నీరు



బాలానగర్ నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావంతో తాగునీటి కొరతతో ప్రజలు అల్లాడుతుంటే.. మరోవైపు వేల లీటర్ల స్వచ్ఛమైన తాగునీరు వృథాగా రోడ్లపై పారుతోంది. బాలానగర్‌లోని హైదరాబాద్ నైపర్ సమీపంలో గత కొన్ని సంవత్సరాలుగా ఇదే పరిస్థితి కొనసాగుతున్నప్పటికీ సంబంధిత జలమండలి అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు అవసరమైన తాగునీటిని అందించాల్సిన నీటి పైపులైన్ల నుంచి లీకేజీలు ఏర్పడి విలువైన నీరు వృథాగా ప్రవహిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. బాలానగర్ పారిశ్రామిక ప్రాంతంతో పాటు నివాస ప్రాంతాలు కూడా రోజురోజుకూ విస్తరిస్తున్నాయి. జనాభా పెరుగుదలకు అనుగుణంగా తాగునీటి అవసరాలు పెరుగుతున్నాయి. అయితే ఒకవైపు కొన్ని కాలనీల్లో సరిపడా తాగునీరు అందక ప్రజలు ఇబ్బందులు పడు తుంటే..మరోవైపు పైపులైన్ల లీకేజీల కారణంగా నీరు రోడ్లపైకి చేరి వృథా అవుతోంది. ముఖ్యంగా పాతబడిన నీటి పైపులు పగిలిపోవడం, వాటికి సకాలంలో మరమ్మతులు చేపట్టకపోవడం ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. లీకేజీలతో రహదారులు ధ్వంసం. పైపులైన్ల నుంచి నిరంతరం ప్రవహిస్తున్న నీరు రోడ్లపై నిలిచిపోవడంతో తారు రహదారులు దెబ్బతిని గుంతలుగా మారుతున్నాయి. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, ఇతర వాహనదారులు ప్రమాదాల బారిన పడే పరిస్థితి నెలకొంటోంది. ముఖ్యంగా రాత్రి వేళల్లో గుంతలు కనిపించక వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్లపై నిలిచిన నీరు దోమల వ్యాప్తికి కూడా కారణమయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైదరాబాద్ నైపర్ సమీపంలో తాగునీటి పైపులైన్ లీకేజీ సమస్య గత కొన్ని సంవత్సరాలుగా కొనసాగుతున్నా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో స్పందించడం లేదని స్థానికులు విమర్శిస్తు న్నారు. తాత్కాలిక మరమ్మతులతో సరిపెట్టకుండా సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతున్నారు. నీటి సరఫరా వ్యవస్థను ఎప్పటి కప్పుడు పరిశీలించి, పాతబడిన పైపులను గుర్తించి అవసరమైన చోట కొత్త పైపులైన్లు ఏర్పాటు చేయాలని సూచిస్తున్నారు. జలమండలి అధికారులు ఇప్పటికైనా స్పందించాలని సంబంధిత జలమండలి అధికారులు తక్షణమే స్పందించి హైదరాబాద్ నైపర్ సమీపం లోని నీటి లీకేజీలను అరికట్టాలని, దెబ్బతిన్న పైపులైన్లకు మరమ్మతులు చేపట్టి రహదారులను పునరుద్ధరించాలని బాలనగర్ ప్రజలు కోరుతున్నారు. అంతేకాకుండా బాలానగర్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో నీటి పైపు లైన్లను క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నీటి పొదుపుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. నీటి ప్రతి చుక్క విలువైనదే. భవిష్యత్తు తరాలకు తాగునీటి భద్రత కల్పించాలంటే నీటి వృథాను అరికట్టడం అత్యవసరం. ఇది కేవలం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదు. ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా. ఇప్పటికైనా జలమండలి అధికారులు నిర్లక్ష్యాన్ని వీడి తక్షణ చర్యలు చేపట్టి, బాలనగర్‌లో ఏళ్ల తరబడి కొనసాగుతున్న తాగునీటి లీకేజీ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

జర్మనీలో ఆర్థిక ఇబ్బందుల్లో విద్యార్థిని.. మళ్లే అండగా మంత్రి కోమటిరెడ్డి.. మొత్తం రూ.16 లక్షల సాయం!



ఉన్నత చదువుల కోసం జర్మనీ వెళ్లి.. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న తెలుగు విద్యార్థినికి మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా నిలిచారు. డాక్యుమెంటేషన్ సమస్యలు, బ్యాంకు అకౌంట్ బ్లాక్ కావడంతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. గతంలో కోమటిరెడ్డి ప్రతీక్ ఫౌండేషన్ ద్వారా రూ.10 లక్షలు అందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి.. తాజాగా మరో రూ.6 లక్షల సాయం చేశారు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న మంత్రికి పరిమళ వీడియో ద్వారా కృతజ్ఞతలు తెలిపింది.

విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మంత్రి కోమటిరెడ్డి భరోసా ఇచ్చారు.విదేశాల్లో ఉన్నత చదువులు చదవాలనే కలతో జర్మనీ వెళ్లిన ఓ తెలుగు విద్యార్థిని అనుకోని సమస్యలతో ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకుంది. యూనివర్సిటీ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియలో జాప్యం, బ్యాంకు అకౌంట్ బ్లాక్ కావడంతో రోజువారీ ఖర్చులకు కూడా ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ విషయం తెలుసుకున్న తెలంగాణ రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మరోసారి ఆమెకు అండగా నిలిచారు. గతంలో రూ.10 లక్షల ఆర్థిక సాయం అందించిన మంత్రి కోమటిరెడ్డి.. తాజాగా మరో రూ.6 లక్షలు ఇచ్చి ఆదుకున్నారు. కష్టకాలంలో ఇచ్చిన మాట నిలబెట్టుకోవడంపై విద్యార్థిని పరిమళ కృతజ్ఞతలు తెలిపింది.

డాక్యుమెంటేషన్ సమస్యలతో ఇబ్బందులుఉన్నత విద్యను అభ్యసించేందుకు పరిమళ జర్మనీకి వెళ్లింది. అయితే అక్కడికి చేరుకున్న తర్వాత కొన్ని డాక్యుమెంటేషన్ సమస్యలు ఎదురయ్యాయి. దీంతో యూనివర్సిటీలో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. మరోవైపు.. ఆమెకు కూడా బ్లాక్ అయింది.

వేలాది మంది కార్మికులు.. పదుల సంఖ్యలో వాహనాలు.. అయినా ఎక్కడి చెత్త అక్కడే!

- రంగధాముని చెరువు పరిసరాలు, శక్తినగర్, హబీబ్‌నగర్‌లో వ్యర్థాల గుట్టలు
- ఫతేనగర్ దీన్‌దయాళ్‌నగర్ నాలా వద్ద పేరుకుపోతున్న చెత్త పారిశుద్ధ్య నిర్వహణపై అధికారుల పర్యవేక్షణ కరువు..
- డివిజన్ పరిధిలో ప్రజారోగ్యంపై ఆందోళన

బాలానగర్ నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :పారిశుద్ధ్య నిర్వహణ కోసం వేలాది మంది పారిశుద్ధ్య కార్మికులు, పదుల సంఖ్యలో చెత్త సేకరణ వాహనాలు, నెలకు లక్షలాది రూపాయల ప్రజాధనం ఖర్చు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మారడం లేదు. ఎక్కడ చూసినా చెత్త కుప్పలు, పేరుకుపోయిన వ్యర్థాలు దర్శనమిస్తూ స్వచ్ఛత లక్ష్యానికే సవాల్ విసురుతున్నాయి. ప్రజలకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాల్సి న పారిశుద్ధ్య వ్యవస్థ ఉన్నప్పటికీ, వీధులు, రహదారులు, నాలాల పరిసరాలు చెత్తకుప్పలతో అపరిశుభ్రంగా మారుతుండటం విమర్శలకు తావిస్తోంది. చెత్తను రోడ్లపై వేయకుండా అరికట్టేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. ఇంటింటికీ రావాల్సిన చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రాకపోవడం, వారం నుంచి పది రోజుల వరకు ఇళ్లలోనే చెత్త పేరుకుపోతుండటంతో కొందరు విధిలేని పరిస్థితుల్లో రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలను పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- చెత్తకుప్పలతో దర్శనమిస్తున్న ప్రధాన ప్రాంతాలు..

కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలోని రంగధాముని చెరువు కోనేరు పరిసరాలు చెత్తాచెదారంతో నిండిపోయి దుర్భరంగా మారుతున్నాయి. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఉన్నప్పటికీ వ్యర్థాలు పేరుకుపోతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మూసాపేటలోని శక్తినగర్, హబీబ్‌నగర్ ప్రాంతాల్లోనూ ఎటుచూసినా చెత్తకుప్పలే కనిపిస్తున్నాయి. అదేవిధంగా ఫతేనగర్ దీన్‌దయాళ్‌నగర్ నాలా వద్ద భారీగా వ్యర్థాలు పేరుకుపోతుండటం నిత్యకృత్యంగా మారింది. నాలా పరిసరాల్లో చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వెదజల్లుతూ స్థానిక ప్రజలు, అటుగా రాకపోకలు సాగించే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- ప్రజారోగ్యానికి ముప్పుగా అపరిశుభ్రత..

చెత్తకుప్పల కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉండటంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. చెత్తను రోడ్లపై వేయకుండా అరికట్టేందుకు అధికారులు ఎన్ని చర్యలు చేపట్టినా, ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించినా ఆశించిన ఫలితాలు కనిపించడం లేదు. కొన్ని ప్రాంతాల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ రావాల్సిన చెత్త సేకరణ వాహనాలు క్రమం తప్పకుండా రాకపోవడం, వారం నుంచి పది రోజుల వరకు ఇళ్లలోనే చెత్త పేరుకుపోతుండటంతో కొందరు విధిలేని పరిస్థితుల్లో రోడ్ల పక్కన, ఖాళీ ప్రదేశాల్లో వ్యర్థాలను పడేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ప్రజారోగ్యానికి ముప్పుగా అపరిశుభ్రత చెత్తకుప్పల కారణంగా దోమలు, ఈగలు విపరీతంగా వృద్ధి చెందే ప్రమాదం ఉంది. ఫలితంగా పరిసర ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలే అవకాశముందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు అనారోగ్య సమస్యలకు గురయ్యే ప్రమాదం ఉండటంతో పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ఉన్నతాధికారులు స్పందించాలి..

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రజాధనం ఖర్చు చేస్తున్నా ఆశించిన స్థాయిలో ఫలితాలు కనిపించకపోవడంపై స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



కేవలం ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలకే పరిమితం కాకుండా ప్రతిరోజూ చెత్త సేకరణ జరిగేలా పర్యవేక్షణ చేపట్టాలని కోరుతున్నారు. స్వచ్ఛత వాహనాలు ప్రతి వీధికి క్రమం తప్పకుండా వచ్చేలా చర్యలు తీసుకోవడంతోపాటు, రోడ్లపై చెత్త వేస్తున్న వారిని గుర్తించి జరిమానాలు విధించాలని సూచిస్తున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నతాధికారులు, సంబంధిత పారిశుద్ధ్య విభాగం అధికారులు తక్షణమే స్పందించి రంగధాముని చెరువు, శక్తినగర్, హబీబ్‌నగర్, దీన్‌ద యాళ్ నగర్ నాలా పరిసరాల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి, నిరంతర పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

వారం రోజుల్లో కాంట్రా ఫ్లో బీఆర్‌టీఎస్ అమలుకు సన్నాహాలు!





- జేఎన్‌టీయూ--రాయదుర్గం మధ్య ప్రత్యేక బస్సు మార్గం
- సైబరాబాద్‌కు రెండేళ్లలో 510 అదనపు బస్సులు
- 450 ఏసీ బస్సులు.. 60 మినీ బస్సులతో ప్రజా రవాణాకు బలం
- ట్రాఫిక్ రద్దీ తగ్గింపు, మెట్రో అనుసంధానమే లక్ష్యం: సీపీ డాక్టర్ ఎం. రమేష్



సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :ఐటీ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీకి చెక్ పెట్టి, ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు సైబరాబాద్ పోలీసులు, తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) కీలక చర్యలకు సిద్ధమవుతున్నాయి. కాంట్రా ఫ్లో బస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (బీఆర్‌టీఎస్)ను వారం రోజుల్లో అమలు చేయాలని యోచిస్తున్నట్లు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ వెల్లడించారు. రాబోయే రెండేళ్లలో సైబరాబాద్‌కు అదనంగా 510 బస్సులను సమకూర్చేందుకు టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది.రాయదుర్గంలోని టీ-హబ్‌లో నవంబర్ 26 నుంచి 28 వరకు నిర్వహిస్తున్న 'సైబరాబాద్ మూవ్స్--2026' సదస్సు రెండో రోజు కార్యక్రమంలో శుక్రవారం సీపీ మాట్లాడారు. జేఎన్‌టీయూ నుంచి రాయదుర్గం వరకు కాంట్రా ఫ్లో బీఆర్‌టీఎస్ సేవలను ప్రవేశపెట్టేందుకు టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక సిద్ధం చేసిందని తెలిపారు. రద్దీ సమయాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను తగ్గించడంతో పాటు కేపీహెచ్‌బీ, హైటెక్ సిటీ, రాయదుర్గం మెట్రో స్టేషన్లకు ప్రయాణికుల అనుసంధానాన్ని మెరుగుపరచడం ఈ విధానం ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు.

● రెండేళ్లలో 510 అదనపు బస్సులు

సైబరాబాద్ పరిధిలో ప్రజా రవాణాను విస్తరించేందుకు రాబోయే రెండేళ్లలో 450 ఏసీ బస్సులు, 60 మినీ బస్సులు కలిపి మొత్తం 510 బస్సులను అదనంగా అందుబాటులోకి తీసుకురావాలని టీజీఎస్ఆర్టీసీ ప్రణాళిక రూపొందించింది. ఐటీ ఉద్యోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక ఆర్టీసీ బస్సుల నిర్వహణకు కూడా చర్యలు చేపట్టనున్నట్లు వెల్లడించింది.

● ప్రవర్తన మారితేనే రహదారి భద్రత

ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మౌలిక సదుపాయాల కల్పనతో పాటు ప్రజల ప్రయాణ అలవాట్లలో మార్పు రావాల్సిన అవసరం ఉందని సీపీ రమేష్ స్పష్టం చేశారు. బాధ్యతాయుతమైన ప్రయాణ విధానాలను ప్రోత్సహించడంలో మీడియా కీలక పాత్ర పోషించాలని సూచించారు. ప్రజా రవాణా వినియోగంపై సానుకూల కథనాలు ప్రజల్లో అవగాహన పెంచుతాయని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి. సృజన పేర్కొన్నారు.

● విద్యార్థులతో అధికారుల ముఖాముఖి

'పాఠశాలలకు సురక్షిత ప్రయాణం--విద్యార్థుల రవాణా' అంశంపై నిర్వహించిన చర్చలో అధికారులు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడారు. కార్‌పూలింగ్, సురక్షిత డ్రైవింగ్, వ్యక్తిగత వాహనాల వినియోగం తగ్గించి ప్రజా రవాణాను ఆశ్రయించడం వంటి సూచనలను విద్యార్థులు చేశారు. వారు ప్రస్తావించిన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుంటుందని అధికారులు హామీ ఇచ్చారు. ఈ చర్చలో డాక్టర్ సృజన, సీపీ రమేష్‌తో పాటు అదనపు డీసీపీ జి. హనుమంతరావు పాల్గొన్నారు.

● ప్రజా రవాణాకు మెరుగైన అనుసంధానం

బహుళ రవాణా వ్యవస్థల మధ్య సమన్వయం కోసం ఎంఎంటీఎస్ తన సమాచారాన్ని ఓపెన్ డేటా తెలంగాణతో పంచుకోనుందని ఈఎన్‌డీ, ఐటీ, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ కమిషనర్ రవి కిరణ్ తెలిపారు. ప్రజా రవాణా, ఉద్యోగ, విద్యా కేంద్రాలకు మెరుగైన అనుసంధానం కల్పించేందుకు 10 నుంచి 30 మీటర్ల వెడల్పు గల ద్వితీయ, తృతీయ శ్రేణి రహదారుల నిర్మాణంపై పదేళ్ల కార్యాచరణ అవసరమని డబ్ల్యూఆర్ఐ ఇండియా సీఈఓ మాధవ్ పై సూచించారు.ట్రాఫిక్, వాయు కాలుష్యం చిన్నారులు, ఇతర సున్నిత వర్గాల ఆరోగ్యంపై చూపుతున్న ప్రభావాన్ని వైద్య నిపుణులు వివరించారు.
పాఠశాలల వద్ద భద్రతా చర్యలు, సురక్షిత రహదారి రూపకల్పన, చివరి మైలు రవాణా సౌకర్యాలు, వాయు నాణ్యతపై దృష్టి పెట్టాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు,
జరిమానాలపై సామాజిక మాధ్యమాల్లో ప్రచారమవుతున్న తప్పుడు సమాచారాన్ని నమ్మవద్దని, ఏ సమాచారాన్నైనా నిర్ధారించుకున్న తర్వాతే ఇతరులకు పంపాలని సదస్సు పౌరులకు విజ్ఞప్తి చేసింది.

జిమ్ కోచ్‌కు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష



- మహిళపై లైంగిక దాడి, వేధింపుల కేసులో న్యాయస్థానం కీలక తీర్పు
- జిమ్‌లోనే కాకుండా బాధితురాలి ఇంట్లోనూ వేధింపులకు పాల్పడినట్లు అభియోగాలు
- రూ.8 వేల జరిమానా విధించిన ఎల్బీనగర్ కోర్టు

సైబరాబాద్ కమిషనరేట్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :మహిళపై లైంగిక దాడి, వేధింపులకు పాల్పడిన కేసులో జిమ్ శిక్షకుడికి న్యాయస్థానం 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధించింది. నిందితుడికి రూ.8 వేల జరిమానా కూడా విధిస్తూ రంగారెడ్డి జిల్లా ఎల్బీనగర్‌లోని 13వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయస్థానం తీర్పు వెలువరించింది.
పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో రాంకీ టవర్స్‌లో జిమ్ కోచ్‌గా పనిచేసిన మహ్మద్ మౌజమ్ అలీ (39)పై 2017 ఫిబ్రవరి 13న రాయదుర్గం పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు చేసింది. 2015 జనవరి నుంచి జిమ్‌లోని మహిళల మరుగుదొడ్డిలో తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధితురాలు ఆరోపించింది. అనంతరం తన ఫ్లాట్‌లోకి అక్రమంగా ప్రవేశించి పలుమార్లు లైంగిక వేధింపులకు గురిచేయడంతో పాటు బెదిరింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొంది.తనను, తన భర్తను సమాజంలో అప్రతిష్ఠపాలు చేస్తానని బెదిరిస్తూ బ్లాక్‌మెయిల్ చేశాడని, తన మొబైల్, సామాజిక మాధ్యమ ఖాతాలను హ్యాక్ చేసి, ఫొటోలు తీసుకున్నాడని బాధితురాలు ఆరోపించింది. వేధింపులు భరించలేక 2017 ఫిబ్రవరి 11న భర్తకు విషయం వెల్లడించి, ఫిబ్రవరి 13న పోలీసులను ఆశ్రయించింది.

●ఆధారాలు సేకరించి ఛార్జిషీట్ దాఖలు

ఫిర్యాదు ఆధారంగా రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సాక్షులను పరిశీలించి, సీసీటీవీ దృశ్యాలు, ఇతర ఆధారాలను సేకరించారు. నిందితుడిని 2017 ఫిబ్రవరి 15న అరెస్టు చేశారు. దర్యాప్తు పూర్తిచేసిన అనంతరం న్యాయస్థానంలో అభియోగపత్రం దాఖలు చేశారు.

●పూర్తిస్థాయి విచారణ అనంతరం శిక్ష

కేసుపై పూర్తిస్థాయి విచారణ జరిపిన ఎల్బీనగర్ 13వ అదనపు జిల్లా, సెషన్స్ న్యాయమూర్తి ఎం. వాణి నిందితుడిని దోషిగా నిర్ధారించి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.8 వేల జరిమానా విధించారు. ఈ కేసులో రాయదుర్గం పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ డి. దుర్గాప్రసాద్ దర్యాప్తు నిర్వహించగా, ప్రభుత్వ న్యాయవాది పి. మంజులాదేవి విచారణ సమయంలో సమర్థవంతంగా వాదనలు వినిపించారు. వీరి కృషితో నిందితుడికి శిక్ష పడినట్లు సైబరాబాద్ క్రైమ్స్ డీసీపీ వెల్లడించారు.

రూ.15 వేల లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఇద్దరు మున్సిపల్ అధికారులు!

- సదాశివపేట మున్సిపాలిటీలో రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన ఏఈ, అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్
- రూ.4.50 లక్షల కాంట్రాక్టు బిల్లు వ్యవహారంలో లంచం డిమాండ్
- ఏఈ తీసుకున్న సొమ్మును వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు అప్పగింత.. అతడి వద్ద నగదు స్వాధీనం

హైదరాబాద్ : క్రైమ్ బ్యూరో నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) :
ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతికి అడ్డుకట్ట వేయాల్సిన అధికారులే లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వలకు చిక్కారు. సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో రూ.15 వేల లంచం స్వీకరిస్తూ అసిస్టెంట్ ఇంజనీర్, అవుట్‌సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ శుక్రవారం రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు.ఏసీబీ విడుదల చేసిన పత్రికా ప్రకటన ప్రకారం.. సదాశివపేట మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న ఎ. రాజేష్ కుమార్ (ఏ1), అవుట్ సోర్సింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ ఎ. శివారెడ్డి (ఏ2) కలిసి లంచం డిమాండ్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. 2025 గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డిలోని ఉబా చెరువులో చేపట్టిన పూడికతీత పనులకు సంబంధించి రూ.4.50 లక్షల కాంట్రాక్టు బిల్లును ఇప్పటికే మంజూరు చేసి, ప్రాసెస్ చేసినందుకు ప్రతిఫలంగా రూ.15 వేల లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ తెలిపింది.



● ఏఈ నుంచి వర్క్ ఇన్‌స్పెక్టర్‌కు నగదు బదిలీ

నవంబర్ 27న మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో సదాశివపేట మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు దాడి చేశారు. ఫిర్యాదుదారుడి నుంచి ఏఈ రాజేష్ కుమార్ రూ.15 వేల లంచం తీసుకుని, ఆ నగదును భద్రపరచాలని వర్క్ ఇన్‌స్పెక్టర్ శివారెడ్డికి అప్పగించినట్లు ఏసీబీ వెల్లడించింది. అనంతరం శివారెడ్డి వద్ద నుంచి లంచం సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

● కోర్టుకు నిందితుల తరలింపు

ప్రజాసేవకులుగా విధులు నిర్వర్తించాల్సిన ఇద్దరు అధికారులు అనుచిత ప్రయోజనం పొందేందుకు విధులను నిజాయితీగా నిర్వహించలేదని ఏసీబీ పేర్కొంది. ఇద్దరినీ అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్పీఈ, ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానంలోని రెండో అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరచనున్నట్లు తెలిపింది. కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉంది.ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని అధికారులు సూచించారు. ఫిర్యాదుదారుల వివరాలను గోప్యంగా ఉంచుతామని స్పష్టం చేశారు.

లోకహితమే లక్ష్యం..జనహితమే మార్గం - జయశంకర్ భూపాలపల్లి జిల్లాకు దొరికిన ఇద్దరు రత్నాలు!

- ధర్మపాలనకు నిదర్శనం కలెక్టర్ రాహుల్ శర్మ..
- న్యాయరక్షణకు ప్రతిరూపం ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్!

భూపాలపల్లి జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) :
అధికారం అంటే ఆడంబరం కాదురా..అది ప్రజలకు సేవ చేసే సువర్ణావకాశం. పదవి అంటే పెత్తనం కాదు..పేదోడి కన్నీళ్లు తుడిచే బాధ్యత. ఈ సత్యాన్ని అక్షరాలా నిజం చేస్తూ భూపాలపల్లి జిల్లా ప్రజల గుండెల్లో గూడు కట్టుకున్నరు ఇద్దరు అధికారులు. ఒకరు ప్రజాపాలనా దురంధరుడు, సుపరిపాలనా సారథి-కలెక్టర్ రాహుల్ శర్మ..ఇంకొకరు న్యాయపరిరక్షణా చతురుడు, శాంతిభద్రతల పరిరక్షకుడు-ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గౌడ్

● సుపరిపాలనా సారథి - రాహుల్ శర్మ

ఈ సార్ వచ్చినంక జిల్లా కలెక్టరేట్ రూపురేఖలే మారిపోయినయ్. గతంలో ఫైళ్ల మూటలతో నిండిన దర్బార్ ఇప్పుడు ప్రజా దర్బార్ అయ్యింది. ఏసీ కూలర్ గదుల్ల కూసోకుండా, ఎండనక వాననక పల్లె పల్లె తిరుగుతూ రైతన్నల కష్టం, పేదోల్ల గోస స్వయంగా ఇంటున్నడు. అధికార్లకు పని చెప్పే దిశల నిజాయితీ ఉండాలె అని నిరూపిస్తుండు. సంక్షేమ పథకాలు అనేటియి కాగితాలకే పరిమితం కాకుండా, నిజమైన అర్హులకు అందాలని కంకణం కట్టుకున్నడు. విద్యా దానం, వైద్య సేవ, రైతు సంక్షేమం, ఇందిరమ్మ ఇండ్లు - ఏ పథకంలోనూ అవినీతికి ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు తీస్కుంటున్నడు. "సామాన్యుడికి న్యాయం జరగాల్సిందే" అనేది ఆయన సిద్ధాంతం. ఏ అర్జీ వచ్చినా తొక్కిపెట్టకుండా, దానికి పరిష్కారం దొరికే దాకా నిద్రపోని తత్వం.



● జనరక్షణా యోధుడు - సిరిశెట్టి సంకీర్త్

ఖాకీ అంటేనే భయపడే రోజులు పోయినయ్. ఇప్పుడు ఖాకీ అంటే భరోసా అనే భావన తెచ్చిండు మన ఎస్పీ సార్. నేరం చేసేటోడికి సింహస్వప్నం లెక్క, బాధితులకు మాత్రం తల్లిలెక్క ఆదుకుంటున్నడు. ఇదే ఆయనలోని మానవతా దృక్పథం. ఆడబిడ్డల జోలికి వస్తే ఊరుకునేది లేదని హెచ్చరిస్తూ, ప్రతి ఠాణాలో మహిళలకు ప్రత్యేక భరోసా కల్పించిండు. చిన్న పిల్లల రక్షణకు కూడా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసిండు. ఈ కాలం పిల్లలు సైబర్ ఉచ్చులో పడుతున్నరని, ప్రతి స్కూలు, కాలేజీకి పోయి "సైబర్ నేరాల పట్ల జాగ్రత్త సోదరా" అని చైతన్యం చేస్తుండు. చట్టంపై అవగాహన కల్పిస్తుండు. ఒకరు పరిపాలనా యంత్రాన్ని ధర్మబద్ధంగా నడుపుతుంటే, ఇంకొకరు రక్షణా వ్యవస్థను న్యాయబద్ధంగా నడుపుతున్నరు. ఇద్దరి మధ్య అద్భుత సమన్వయం. ఇద్దరూ కలిసి జిల్లాను ప్రగతి పథంలో నడిపిస్తున్నరు. అందుకే భూపాలపల్లి జిల్లా నలుమూలలా వినిపిస్తున్న నినాదం ఒక్కటే - "జనసేవ చేసేటోళ్లు దొరకడం కష్టం..కానీ మన జిల్లాకు ఇద్దరు దొరికిన్రు.. ఇద్దరూ..ఇద్దరే..!"



అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం మోపాల్సిన ఏసీపీ..

ఈ భవనం విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారు?

- సర్కిల్--57లో మిగతా నిర్మాణాలపై చర్యలు.. ఈ భవనానికి మాత్రం మినహాయింపా?
- బిల్డర్ పలుకుబడికి అధికారుల అండ ఉందా? లేక తెరవెనుక ఏదైనా ఒప్పందం జరిగిందా?
- ముడుపుల ఆరోపణలు నిజం కాకపోతే.. చర్యలు తీసుకుని నిరూపించాలి కదా?
- రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గారా? అధికార కుర్చీని కాపాడుకునేందుకే మౌనమా?
- కమిషనర్ ఆదేశాలకే దిక్కులేకపోతే.. ఇక సామాన్యుల ఫిర్యాదులకు విలువెక్కడ?
- అక్రమ నిర్మాణం కళ్లముందే సాగుతున్నా కనిపించడంలేదా? కనిపించినా పట్టించుకోవడంలేదా?
- ఫిర్యాదులు బుట్టదాఖలు.. నిర్మాణాలు యథేచ్ఛ.. టౌన్‌ప్లానింగ్ బాధ్యత ఎక్కడ?
- చట్టం అందరికీ ఒకటే కదా.. బడా బిల్డర్లకు ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా?
- ఏసీపీ సుమిత్రపై ఆరోపణల మబ్బులు.. విచారణకు ఉన్నతాధికారులు ఎందుకు సిద్ధపడటం లేదు?
- అక్రమాలపై చర్యలు తీసుకోకపోవడానికి కారణమేంటి? బిల్డర్ బలం ఎంత? అధికారుల బలహీనత ఎంత?
- నిర్మాణ అనుమతులపై తనిఖీ జరిగిందా? ఉల్లంఘనలు గుర్తిస్తే చర్యలు ఎందుకు లేవు?
- వసూళ్ల ఆరోపణలకు సమాధానం చర్యలతోనే చెప్పాలి.. మౌనంతో కాదు!
- ఒకే సర్కిల్‌లో రెండు రకాల న్యాయాలా? పలుకుబడి ఉన్నవారికి రక్షణ.. సామాన్యులకు నిబంధనలా?
- అక్రమ నిర్మాణదారులకు అభయం ఎవరిది? అధికారుల మౌనం వెనుక కారణమేంటి?







టౌన్ ప్లానింగ్ ఏసిపి సుమిత్ర

కుత్బుల్లాపూర్, నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : గాజులరామారం సర్కిల్--57 టౌన్‌ప్లానింగ్ విభాగంలో అక్రమ నిర్మాణాలపై చర్యల విషయంలో అధికారుల వ్యవహారశైలి అనేక అనుమానాలకు తావిస్తోంది. సర్కిల్ పరిధిలోని కొన్ని అక్రమ నిర్మాణాలపై అధికారులు చర్యలు తీసుకుంటున్నప్పటికీ, వివాదాస్పదంగా మారిన ఓ భవనంపై మాత్రం ఎలాంటి చర్యలు కనిపించకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయన్న ఫిర్యాదులు, స్థానికుల అభ్యంతరాలు ఉన్నప్పటికీ టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

● ఒక భవనంపై ఒక తీరు.. మరో భవనంపై మరో తీరా?

సర్కిల్--57 పరిధిలో అక్రమ నిర్మాణాలపై గతంలో కొన్ని సందర్భాల్లో చర్యలు చేపట్టిన టౌన్‌ప్లానింగ్ విభాగం, ఈ భవనం విషయంలో మాత్రం ఎందుకు వెనుకడుగు వేస్తోందన్నది అంతుచిక్కడం లేదు. నిర్మాణ అనుమతులు, క్షేత్రస్థాయి తనిఖీలు, ఉల్లంఘనల వివరాలను పరిశీలించి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఈ వ్యవహారంలో ఇప్పటివరకు ఏం చేశారు? నిర్మాణం నిబంధనలకు అనుగుణంగానే ఉంటే ఆ విషయాన్ని బహిరంగంగా వెల్లడించాలి. ఉల్లంఘనలు ఉంటే చర్యలు తీసుకోవాలి. ఈ రెండింటిలో ఏదీ చేయకుండా మౌనంగా ఉండటంతో అనుమానాలు మరింత పెరుగుతున్నాయి.

● రాజకీయ ఒత్తిళ్లా? ముడుపుల ఆరోపణలా?

ఈ భవనంపై చర్యలు తీసుకోకపోవడానికి రాజకీయ నాయకుల ఒత్తిళ్లు కారణమా? లేక అధికారులపై వినిపిస్తున్న ముడుపుల ఆరోపణల్లో వాస్తవం ఉందా? అంటూ స్థానికులు గుసగుసలాడుకుంటున్నారు. అయితే ఇవి నిర్ధారణ కాని ఆరోపణలు మాత్రమే. వీటిపై వాస్తవాలు వెలుగులోకి రావాల్సిన అవసరం ఉంది. ఏసీపీ సుమిత్రపై గతంలోనూ వసూళ్లకు సంబంధించిన ఆరోపణలు వినిపించిన నేపథ్యంలో, ఈ భవనం విషయంలో ఆమె వ్యవహారశైలిపై ఉన్నతాధికారులు ప్రత్యేకంగా దృష్టి సారించాలన్న డిమాండ్లు వ్యక్తమవుతున్నాయి.

● కమిషనర్ ఆదేశాలకు విలువ లేదా?

సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? లేక వాటిని పట్టించుకోకుండా అధికారులు తమదైన శైలిలో వ్యవహరిస్తున్నారా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశించినప్పుడు వాటిని అమలు చేయాల్సిన బాధ్యత క్షేత్రస్థాయి అధికారులదే. అలాంటప్పుడు ఈ భవనంపై చర్యలు ఎందుకు కనిపించడం లేదో ఏసీపీ సుమిత్ర సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

● చర్యలు తీసుకోకపోతే అనుమానాలకు మరింత బలం!

డబ్బులు తీసుకున్నారన్న ఆరోపణల్లో వాస్తవం లేదని అధికారులు భావిస్తే, భవనంపై పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించి నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయో లేదో స్పష్టం చేయాలి.
ఉల్లంఘనలు ఉంటే చట్టప్రకారం చర్య లు తీసుకోవాలి. రాజకీయ ఒత్తిళ్లు ఉన్నా, ఇతర ప్రభావాలు ఉన్నా చట్టం అమలులో రాజీ పడకూడదు. చర్యలు తీసుకోకుండా కాలయాపన చేస్తే అధికారుల తీరుపై ప్రజల్లో అనుమానాలు మరింత పెరిగే అవకాశం ఉంది.

● ఉన్నతాధికారులు తేల్చాల్సిన ప్రశ్నలివే!

సర్కిల్--57లో ఈ భవనానికి సంబంధించిన అనుమతులు ఏమిటి? క్షేత్రస్థాయి తనిఖీలు ఎప్పుడు నిర్వహించారు? ఫిర్యాదులు అందితే వాటిపై తీసుకున్న చర్యలేంటి? నిర్మాణంలో ఉల్లంఘనలు ఉన్నాయా? ఉంటే ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? ఏసీపీ సుమిత్రపై వస్తున్న ఆరోపణలపై విచారణకు ఆదేశిస్తారా?సైబరాబాద్ మున్సిపల్ కమిషనర్ ఈ వ్యవహారంపై తక్షణమే దృష్టి సారించి, స్వతంత్ర విచారణ జరిపించాలని స్థానికులు కోరుతున్నారు. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. నిరాధారమైతే వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలి. అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులే ప్రశ్నల వలయంలో చిక్కుకుంటే ప్రజలకు న్యాయం జరిగేది ఎలా? అన్నదే ఇప్పుడు సర్కిల్--57లో ప్రధాన చర్చగా మారింది.

గిరిజన మహిళల నైపుణ్యాలకు మార్కెట్ అనుసంధానం కల్పించి స్వయం ఉపాధిని ప్రోత్సహించాలి

- ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో

ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 26 (పీపుల్స్ న్యూస్) : శ్రీ సమ్మక్క సారలమ్మ మహిళా శక్తి సంఘాల సభ్యులతో పీఓ ముఖాముఖి.. వెదురు హస్తకళల తయారీ, ఉత్పత్తుల బ్రాండింగ్, మార్కెటింగ్‌పై సూచనలు
మేడారం: మేడారం ప్రాంతంలోని గిరిజన మహిళలకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ అందించి, వారు తయారు చేసే హస్తకళా ఉత్పత్తులకు ప్రత్యేక గుర్తింపు కల్పించడంతో పాటు, వాటిని మార్కెట్‌కు అనుసంధానం చేసి స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఐటీడీఏ ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఐటీడీఏ పీఓ లెనిన్ వత్సల్ టోప్పో తెలిపారు.
ఈ సందర్భంగా శ్రీ సమ్మక్క సారలమ్మ మహిళా శక్తి సంఘాల సభ్యులతో పీఓ ముఖాముఖిగా మాట్లాడి, వారు తయారు చేస్తున్న వెదురు హస్తకళలు, అలంకరణ వస్తువులు, ఇతర చేతివృత్తి ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలు ప్రతిరోజూ ఏ సమయానికి పనులు ప్రారంభిస్తున్నారు, ఎంత సమయం కేటాయిస్తున్నారు, ఎంత దూరం నుంచి శిక్షణ లేదా తయారీ కేంద్రానికి వస్తున్నారు, ఉత్పత్తుల తయారీలో ఎదురవుతున్న ఇబ్బందులు ఏమిటి తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. మహిళల అనుభవాలు, ఆసక్తి, నైపుణ్యాలను తెలుసుకుని మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా సూచనలు చేశారు.

● ప్రతి ఉత్పత్తిపై సమ్మక్క సారలమ్మ ప్రత్యేక గుర్తింపు



మహిళలు తయారు చేసే ప్రతి వెదురు హస్తకళా ఉత్పత్తిపై “శ్రీ సమ్మక్క సారలమ్మ దేవతలు -- మేడారం” అనే ప్రత్యేక గుర్తింపు ఉండేలా స్టిక్కర్లు, లోగోలు లేదా ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని పీఓ సూచించారు. దీనివల్ల మేడారంలో తయారైన ఉత్పత్తులను ఇతర ప్రాంతాల ఉత్పత్తుల నుంచి ప్రత్యేకంగా గుర్తించడంతో పాటు, మేడారం ప్రాంతానికి ప్రత్యేకమైన బ్రాండ్ గుర్తింపు ఏర్పడుతుందని తెలిపారు.
వెదురుతో తయారు చేసే అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, పెన్ స్టాండ్లు, ఫోటో ఫ్రేములు, ల్యాంప్ షేడ్లు, బుట్టలు, చిన్న అలంకరణ వస్తువులు, జ్ఞాపికలు, గిఫ్ట్ ఆర్టికల్స్ వంటి ఉత్పత్తులను మరింత ఆకర్షణీయంగా తయారు చేసేలా మహిళలకు ప్రోత్సాహం అందించాలని సూచించారు.ఒక నెలపాటు ప్రత్యేక శిక్షణ -- అనంతరం మేడారంలో విక్రయ కేంద్రంగిరిజన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వెదురు హస్తకళలు, ఇతర హ్యాండీక్రాఫ్ట్స్ తయారీలో ఒక నెలపాటు ప్రత్యేక శిక్షణ అందించేలా చర్యలు తీసుకోవాలని పీఓ సూచించారు. శిక్షణలో ఉత్పత్తుల తయారీతో పాటు నాణ్యత, డిజైన్, ఫినిషింగ్, ప్యాకేజింగ్, ఉత్పత్తుల ధర నిర్ణయం, మార్కెటింగ్ వంటి అంశాలపై కూడా అవగాహన కల్పించాలని తెలిపారు.



శిక్షణ పూర్తయిన అనంతరం మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించేందుకు ఐటీడీఏ ఆధ్వర్యంలో మేడారంలో ప్రత్యేక విక్రయ కేంద్రం ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టాలని సూచించారు. తద్వారా మేడారం సందర్శనకు వచ్చే భక్తులు, పర్యాటకులు స్థానిక గిరిజన మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను కొనుగోలు చేసే అవకాశం కలుగుతుందని, మహిళలకు నిరంతర ఆదాయ మార్గం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఈ ఉత్పత్తుల రూపకల్పనలో స్థానిక గిరిజన కళలు, సంస్కృతి, మేడారం ఆధ్యాత్మిక ప్రత్యేకతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఉత్పత్తికి ఆకర్షణీయమైన ప్యాకేజింగ్, ధర వివరాలు, తయారీదారుల సంఘం గుర్తింపు ఉండేలా చూడాలని తెలిపారు.
మహిళలకు నైపుణ్యం నుంచి స్వయం ఉపాధి వరకు ఐటీడీఏ అండ
గిరిజన మహిళలు కేవలం శిక్షణ పొందడమే కాకుండా, ఆ శిక్షణ ద్వారా ఆదాయం సంపాదించే స్థాయికి ఎదగాలని పీఓ ఆకాంక్షించారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం, మేడారం సందర్శకులకు చేరువ చేయడం, ఆన్‌లైన్ విక్రయ అవకాశాలను పరిశీలించడం వంటి చర్యల ద్వారా వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని సంబంధిత అధికారులకు సూచించారు.గిరిజన మహిళల్లో ఉన్న సంప్రదాయ నైపుణ్యాలను ఆధునిక డిజైన్లు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేస్తే మేడారం ప్రాంతానికి ప్రత్యేకమైన హస్తకళా బ్రాండ్ రూపుదిద్దుకుంటుందని తెలిపారు. మహిళల భాగస్వామ్యంతో స్థానికంగా తయారీ, విక్రయ వ్యవస్థను బలోపేతం చేసి, వారికి స్థిరమైన ఉపాధి కల్పించడమే లక్ష్యమని స్పష్టం చేశారు.

బతుకమ్మ చీరల పేరును తొలగించి ఇందిరమ్మ చీరలుగా మార్చడం తెలంగాణ సంస్కృతిపై కాంగ్రెస్‌కు ఉన్న వివక్షకు నిదర్శనం

- బీఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ జిల్లా నాయకులు భూక్య జంపన్న

ములుగు జిల్లా ప్రతినిధి నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : పేర్లు మార్చడం కాదు.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని గౌరవించడం నేర్చుకోండి!తెలంగాణ అనే పదాన్ని పలకడానికి కూడా ఇష్టపడని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, ఇప్పుడు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలపై తనకున్న చిన్నచూపును మరోసారి బయటపెట్టుకుంటున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగ సందర్భంగా బతుకమ్మ చీరల పథకాన్ని అమలు చేసింది.బతుకమ్మ అనేది కేవలం ఒక పండుగ కాదు.. తెలంగాణ ఆడబిడ్డల సంస్కృతి, సంప్రదాయం, ఆత్మగౌరవానికి ప్రతీక. అలాంటి బతుకమ్మ పేరుతో చీరలు పంపిణీ చేస్తే తెలంగాణ సంస్కృతికి గౌరవం ఇచ్చినట్లవుతుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు ఆ పేరును పక్కనపెట్టి ఇందిరమ్మ చీరలుగా పేరు మార్చడం వెనుక ఆంతర్యమేమిటి? ప్రభుత్వ పథకాలకు వ్యక్తుల పేర్లు పెట్టడం, విగ్రహాల



రాజకీయాలు చేయడం తప్ప ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి శ్రద్ధ లేదా? తెలంగాణ ఉద్యమ చరిత్రను, సంస్కృతిని, ప్రజల ఆత్మగౌరవాన్ని పక్కనపెట్టి ప్రతి పథకానికి వ్యక్తుల పేర్లు తగిలించడం తెలంగాణ సమాజాన్ని అవమానించడమే.
ప్రజలకు కావాల్సింది పేర్ల మార్పులు కాదు.. ఆరు గ్యారెంటీల అమలు, మహిళలకు ఇచ్చిన హామీల నెరవేర్పు, యువతకు ఉపాధి, రైతులకు భరోసా. బతుకమ్మ చీరల పథకం పేరును మార్చినంత మాత్రాన తెలంగాణ ప్రజల మనసుల్లో ఉన్న బతుకమ్మ పండుగ ప్రాధాన్యతను చెరిపేయలేరు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారికి మా సూటి ప్రశ్న.. తెలంగాణ సంస్కృతిని గౌరవించలేని పాలన ఎందుకు? పథకాల పేర్లు మార్చడం మీద ఉన్న శ్రద్ధ ప్రజల సమస్యలు పరిష్కరించడంపై ఎందుకు లేదు?తెలంగాణ అస్తిత్వాన్ని, సంస్కృతిని, ఆత్మగౌరవాన్ని కాపాడుకోవడం కోసం బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ ప్రజల పక్షాన నిలబడుతుంది.
తెలంగాణ ప్రజల మనోభావాలను గౌరవించి, బతుకమ్మ చీరల పథకం పేరును పునరుద్ధరించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు... షేమ్...షేమ్.!



- ట్రక్ పార్క్ భూముల వేలంపై హైకోర్టు తీర్పుతో ఎమ్మెల్యే ఆందోళనలు ప్రజల్లో నవ్వులపాలు.....

బాలానగర్ నవంబర్ 27 (పీపుల్స్ న్యూస్) : కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలాన్ని అడ్డుకోవాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు గత కొద్ది రోజులుగా చేపట్టిన ధర్నాలు, నిరసన కార్యక్రమాలు, హైకోర్టులో దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) కోర్టు కొట్టివేసిందని కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఏ-బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి విమర్శించారు.యుగంధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ భూముల వేలానికి హెచ్ఎండీఏకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మెల్యే చేపట్టిన ఆందోళనలు ప్రజల్లో నవ్వులపాలయ్యాయని ఆయన వ్యాఖ్యానించారు.కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజల్లో అప్రతిష్టపాలు చేయాలనే దురుద్దేశంతోనే ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఈ ఆందోళనలు చేపట్టారని యుగంధర్ రెడ్డిఆరోపించారు.ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకిస్తూ హడావుడి చేసిన ఎమ్మెల్యే, కోర్టు తీర్పుతో ప్రజల ముందు ఇబ్బందికర పరిస్థితిని ఎదుర్కొంటున్నారని విమర్శించారు. ‘చెడపకురా.. చెడేవు’ అన్న చందంగా ప్రభుత్వాన్ని విమర్శించాలనే ప్రయత్నంలో స్వయంగా ఎమ్మెల్యేనే విమర్శలకు గురయ్యారని ఘాటుగా వ్యాఖ్యానించారు.ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ భూముల వేలం ప్రక్రియ చేపడుతోందని మాదిరెడ్డి యుగంధర్ రెడ్డిపేర్కొన్నారు. ప్రభుత్వ విధానాలను రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డుకోవడం సరికాదని ఆయన అన్నారు.

మళ్లీ ముంబై ఇండియన్స్ కెప్టెన్‌గా రోహిత్ శర్మ

మూడేళ్ల తర్వాత తిరిగి నాయకత్వ బాధ్యతలు.. హార్దిక్ పాండ్యా నిష్క్రమణతో రోహిత్‌కు పగ్గాలు.. ఐదు టైటిళ్లు అందించిన సారథిపై యాజమాన్యం నమ్మకం



ముంబై ఇండియన్స్ అభిమానులకు శుభవార్త. భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మ మరోసారి ఐపీఎల్‌లో ముంబై ఇండియన్స్ జట్టు పగ్గాలు చేపట్టనున్నాడు. మూడు సంవత్సరాల విరామం తర్వాత తిరిగి కెప్టెన్సీ బాధ్యతలు అందుకోవడం క్రికెట్ అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. 2027 ఐపీఎల్ సీజన్‌కు రోహిత్‌ను కెప్టెన్‌గా నియమిస్తూ ముంబై ఇండియన్స్ యాజమాన్యం శుక్రవారం అధికారికంగా ప్రకటించింది. ఐపీఎల్‌లో అత్యంత విజయవంతమైన కెప్టెన్లలో ఒకరిగా గుర్తింపు పొందిన రోహిత్‌కు మరోసారి నాయకత్వ బాధ్యతలు అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. **హార్దిక్ నిష్క్రమణతో మారిన సమీకరణాలు** 2024 ఐపీఎల్ సీజన్‌కు ముందు రోహిత్ శర్మను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాకు బాధ్యతలు అప్పగించిన విషయం తెలిసిందే. అయితే హార్దిక్ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయింది. మూడు సీజన్లలో కేవలం ఒక్కసారి మాత్రమే ప్లేఆఫ్స్‌కు చేరింది. 2026 సీజన్‌లోనూ జట్టు పేలవ ప్రదర్శనతో తొమ్మిదో స్థానానికి పరిమితమైంది. ఈ నేపథ్యంలో హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేయగా, పంజాబ్ నుంచి అర్ష్‌దీప్ సింగ్ ముంబై జట్టులోకి వచ్చాడు. దీంతో ఖాళీ అయిన కెప్టెన్సీ బాధ్యతలను తిరిగి రోహిత్‌కు అప్పగించాలని యాజమాన్యం నిర్ణయించింది. **ఐదు టైటిళ్లతో అరుదైన రికార్డు** రోహిత్ శర్మ నాయకత్వంలో ముంబై ఇండియన్స్ ఐదుసార్లు ఐపీఎల్ విజేతగా నిలిచింది. 2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాల్లో జట్టుకు టైటిళ్లు అందించాడు. 2013లో మధ్యలో కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టి తొలి ప్రయత్నంలోనే ముంబైకి టైటిల్ అందించడం అతడి నాయకత్వ ప్రతిభకు నిదర్శనం. 11 సీజన్ల పాటు జట్టును నడిపించిన రోహిత్ తన వ్యూహాలు, ఆటగాళ్లతో సమన్వయం, ఒత్తిడిలో ప్రశాంతంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యంతో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐదు టైటిళ్లతో ఎంఎస్ ధోనీతో కలిసి అత్యధిక ఐపీఎల్ టైటిళ్లు సాధించిన కెప్టెన్ల జాబితాలో కొనసాగుతున్నాడు. **అభిమానుల్లో కొత్త ఉత్సాహం** రోహిత్ తిరిగి కెప్టెన్ కావడంతో ముంబై ఇండియన్స్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గతంలో అతడి నాయకత్వంలో జట్టు సాధించిన విజయాలను అభిమానులు గుర్తుచేసుకుంటున్నారు. ముంబై జట్టు యాజమాన్యం కూడా రోహిత్ అనుభవం, నాయకత్వ లక్షణాలు, యువ ఆటగాళ్లను ప్రోత్సహించే విధానంపై విశ్వాసం వ్యక్తం చేసింది. జట్టు 20వ ఐపీఎల్ సీజన్‌లోకి అడుగుపెడుతున్న తరుణంలో రోహిత్‌కు మళ్లీ బాధ్యతలు అప్పగించడం ప్రత్యేకతను సంతరించుకుంది. **మళ్లీ పూర్వ వైభవం సాధిస్తుందా?** గత ఆరు సీజన్లుగా ఐపీఎల్ టైటిల్‌కు దూరంగా ఉన్న ముంబై ఇండియన్స్‌కు రోహిత్ పునరాగమనం కొత్త ఆశలు కలిగిస్తోంది. జట్టులో జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ వంటి ప్రతిభావంతులైన ఆటగాళ్లు ఉండటంతో సమతూకమైన జట్టును నిర్మించుకునే అవకాశం ఉంది. అయితే కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టడం ఒక ఎత్తయితే, జట్టును మరోసారి విజేతగా నిలపడం మరో ఎత్తు. ఆటగాళ్లందరినీ సమన్వయం చేసుకుంటూ సరైన వ్యూహాలతో ముందుకు సాగాల్సి ఉంటుంది. రోహిత్ అనుభవం ముంబైకి ఎంతవరకు ఉపయోగపడుతుంది? మరోసారి ఐపీఎల్ ట్రోఫీని అందించి అభిమానుల ఆశలను నెరవేరుస్తాడా? అన్నది 2027 సీజన్‌లో తేలనుంది.

టీ20 క్రికెట్‌లో చరిత్ర సృష్టించిన జయదేవ్ ఉనద్కట్!

● 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి ప్రపంచ రికార్డు.. 26 బంతుల్లో 40 పరుగులు.. చేతన్ సకారియాతో కలిసి పదో వికెట్‌కు కీలక భాగస్వామ్యం



భారత క్రికెట్‌లో తన బౌలింగ్‌తో గుర్తింపు తెచ్చుకున్న సౌరాష్ట్ర కెప్టెన్ జయదేవ్ ఉనద్కట్ బ్యాటింగ్‌లోనూ అద్భుతం చేశాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 ట్రోఫీలో తమిళనాడుతో జరిగిన మ్యాచ్‌లో అరుదైన ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. సాధారణంగా 11వ స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చే బౌలర్లు తక్కువ పరుగులకే పరిమితమవుతుంటారు. కానీ ఉనద్కట్ మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై ఎదురుదాడికి దిగుతూ 26 బంతుల్లో 40 పరుగులు సాధించాడు. దీంతో పురుషుల టీ20 క్రికెట్ చరిత్రలో 11వ స్థానంలో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక వ్యక్తిగత స్కోరు చేసిన ఆటగాడిగా రికార్డు సృష్టించాడు. **ఆరు సంవత్సరాల రికార్డు బద్దలు** ఇప్పటివరకు ఈ రికార్డు ఇంగ్లండ్ ఆటగాడు డానీ బ్రిగ్స్ పేరిట ఉండేది. 2020లో బిగ్‌బాష్ లీగ్‌లో అడిలైడ్ స్ట్రైకర్స్ తరఫున ఆడిన బ్రిగ్స్ హోబర్ట్ హరికేన్స్‌పై 18 బంతుల్లో అజేయంగా 35 పరుగులు చేశాడు. తాజాగా ఉనద్కట్ 40 పరుగులతో ఆ రికార్డును అధిగమించాడు. తన ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకోవడమే కాకుండా టీ20 చరిత్రలో తన పేరును చిరస్థాయిగా నిలుపుకున్నాడు. **చేతన్ సకారియాతో అద్భుత భాగస్వామ్యం** ఈ మ్యాచ్‌లో సౌరాష్ట్ర జట్టు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. 193 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో 92 పరుగులకే తొమ్మిది వికెట్లు కోల్పోయింది. ఈ సమయంలో క్రీజులోకి వచ్చిన ఉనద్కట్, చేతన్ సకారియాతో కలిసి అద్భుతంగా పోరాడారు. చివరి వికెట్‌కు 49 బంతుల్లో 62 పరుగులు జోడించారు. టీ20 క్రికెట్‌లో పదో వికెట్‌కు నమోదైన అత్యధిక భాగస్వామ్యాల్లో ఇది సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచింది. అయితే వీరిద్దరి పోరాటం జట్టుకు విజయాన్ని అందించలేకపోయింది. **38 పరుగులతో తమిళనాడు విజయం** తొలుత బ్యాటింగ్ చేసిన తమిళనాడు నిర్ణీత ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 192 పరుగులు చేసింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన సౌరాష్ట్ర 16.4 ఓవర్లలో 154 పరుగులకే ఆలౌటైంది. దీంతో తమిళనాడు 38 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఉనద్కట్ వ్యక్తిగత రికార్డు సాధించినప్పటికీ సౌరాష్ట్రకు ఓటమి తప్పలేదు. ఈ పరాజయంతో సౌరాష్ట్ర సూపర్ లీగ్ దశకు అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. **రికార్డుల పుస్తకంలో ఉనద్కట్ పేరు** 35 ఏళ్ల జయదేవ్ ఉనద్కట్ భారత జట్టు తరఫున టెస్టులు, వన్డేలు, టీ20లు ఆడాడు. ఐపీఎల్‌లోనూ పలు జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. ప్రధానంగా ఎడమచేతి మీడియం పేసర్‌గా గుర్తింపు పొందిన అతడు కీలక సమయంలో బ్యాట్‌తోనూ సత్తా చాటడం విశేషం. ఈ ప్రదర్శనతో దేశవాళీ క్రికెట్‌లో తన సత్తా మరోసారి నిరూపించుకున్నాడు. ఓటమి ఎదురైనా వ్యక్తిగతంగా సాధించిన ప్రపంచ రికార్డు మాత్రం ఉనద్కట్ కెరీర్‌లో ప్రత్యేక ఘనతగా నిలిచిపోనుంది.

ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటివ్వాలి!

● 2027 వన్డే ప్రపంచకప్‌కు ఎంపిక చేయాలంటూ శ్రీకాంత్ డిమాండ్.. 15 ఏళ్ల యువ సంచలనంపై ప్రశంసల వర్షం.. సెలెక్టర్లు ఇప్పటికైనా గుర్తించాలంటూ సూచన



భారత క్రికెట్‌లో యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ పేరు మరోసారి మార్మోగుతోంది. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రపంచ క్రికెట్ దృష్టిని ఆకర్షిస్తున్న ఈ 15 ఏళ్ల కుర్రాడిని వచ్చే ఏడాది జరగనున్న వన్డే ప్రపంచకప్ జట్టులోకి తీసుకోవాలని భారత మాజీ క్రికెటర్, మాజీ చీఫ్ సెలెక్టర్ కృష్ణమాచారి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. వైభవ్‌లో మూడు ఫార్మాట్లలోనూ రాణించే సామర్థ్యం ఉందని, అతడి ప్రతిభను గుర్తించి జాతీయ జట్టులో మరిన్ని అవకాశాలు కల్పించాలని సూచించారు. కేవలం భవిష్యత్తు ఆటగాడిగా చూడకుండా ఇప్పటి నుంచే పెద్ద వేదికలపై ఆడించేలా చర్యలు తీసుకోవాలని సెలెక్టర్లకు విజ్ఞప్తి చేశారు. **53 బంతుల్లో 204 పరుగులు.. సంచలన ఇన్నింగ్స్** ఇటీవల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ టోర్నీలో యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో వైభవ్ సూర్యవంశీ అసాధారణ బ్యాటింగ్‌తో చెలరేగాడు. కేవలం 53 బంతుల్లోనే 204 పరుగులు సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. ఈ ఇన్నింగ్స్‌లో 28 సిక్సర్లు, ఏడు ఫోర్లు బాదాడు. కేవలం 28 బంతుల్లోనే శతకం పూర్తి చేయగా, 52 బంతుల్లో ద్విశతకాన్ని అందుకున్నాడు. లిస్ట్-ఏ క్రికెట్‌లో అత్యంత వేగంగా శతకం, ద్విశతకం సాధించిన ఆటగాడిగా పలు రికార్డులను తన ఖాతాలో వేసుకున్నాడు. అతడి విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఇండియా-ఏ జట్టు ఏడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. **మూడు ఫార్మాట్లలోనూ ఆడించాలి** వైభవ్ బ్యాటింగ్‌పై ముగ్ధుడైన శ్రీకాంత్ తన యూట్యూబ్ ఛానల్‌లో మాట్లాడుతూ అతడిని అన్ని ఫార్మాట్లకు సరిపోయే ఆటగాడిగా అభివర్ణించారు. టెస్టు క్రికెట్‌లో వెంటనే ఆడించడానికి జట్టు యాజమాన్యం సిద్ధంగా లేకపోయినా కనీసం 15 మంది సభ్యుల జట్టులో చోటు కల్పించాలని సూచించారు. త్వరలో శ్రీలంకతో జరగనున్న వన్డే సిరీస్‌లోనూ అవకాశం ఇవ్వాలని కోరారు. యువ ఆటగాడిని తీర్చిదిద్దాలంటే పెద్ద టోర్నీల్లో ఆడించే ధైర్యం చేయాలని, 2027 ప్రపంచకప్ జట్టులో అతడికి స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. భవిష్యత్తులో వైభవ్ ఒంటిచేత్తో భారత్‌కు విజయాలు అందించే స్థాయికి ఎదుగుతాడని విశ్వాసం వ్యక్తం చేశారు. **సచిన్, కోహ్లీలతో పోలిక** వైభవ్ బ్యాటింగ్‌లో కేవలం బంతిని బలంగా బాదే శక్తి మాత్రమే లేదని, అద్భుతమైన టైమింగ్, ఆత్మవిశ్వాసం కూడా ఉన్నాయని శ్రీకాంత్ ప్రశంసించారు. మైదానంలో ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా ఆడే విధానం అతడిలోని ప్రత్యేక ప్రతిభను తెలియజేస్తోందన్నారు. క్రికెట్ దేవుడిగా పేరొందిన సచిన్ టెండూల్కర్, కింగ్ విరాట్ కోహ్లీల తర్వాత వైభవ్ మరో గొప్ప ఆటగాడిగా ఎదిగే అవకాశం ఉందంటూ ప్రశంసించారు. అతడి ప్రతిభను గుర్తించకుండా ఇంకా అనుభవం కావాలంటూ అవకాశాలను పరిమితం చేయడం సరైన పద్ధతి కాదని అభిప్రాయపడ్డారు. **ప్రతిభకు తగిన అవకాశాలు దక్కేనా?** వైభవ్ ఇప్పటికే తన అసాధారణ ఆటతీరుతో దేశవాళీ క్రికెట్‌లో ప్రత్యేక గుర్తింపు సంపాదించాడు. ఐపీఎల్‌లోనూ తన సత్తా చాటుతూ భవిష్యత్తుపై భారీ అంచనాలు పెంచాడు. అయితే అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణించాలంటే తగిన అవకాశాలతో పాటు అనుభవం కూడా అవసరం. అతడిపై అధిక అంచనాలు, ఒత్తిడి పెంచకుండా సరైన మార్గదర్శకత్వం ఇవ్వడం జట్టు యాజమాన్యం బాధ్యత. మరోవైపు ప్రతిభావంతులైన యువ ఆటగాళ్లను గుర్తించి ప్రోత్సహించడం సెలెక్టర్ల కర్తవ్యం. శ్రీకాంత్ చేసిన సూచనలను బీసీసీఐ, జట్టు యాజమాన్యం ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటాయో చూడాలి. 2027 ప్రపంచకప్‌లో వైభవ్‌కు చోటు దక్కుతుందా? భారత జెర్సీతో అంతర్జాతీయ వేదికపై మరోసారి తన బ్యాట్‌తో సంచలనాలు సృష్టిస్తాడా? అన్నది ఆసక్తికరంగా మారింది.

బౌలింగ్ యాక్షన్ మార్చిన బుమ్రా.. ఎందుకో తెలుసా?

న్యూజిలాండ్‌తో రెండో టెస్టులో కొత్త ప్రయోగం.. ఒక చేతిలో బంతితో రన్‌అప్.. ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్!



భారత స్టార్ పేసర్ జస్ప్రీత్ బుమ్రా తన బౌలింగ్‌లో చేసిన చిన్న మార్పు ఇప్పుడు క్రికెట్ ప్రపంచంలో చర్చనీయాంశంగా మారింది. న్యూజిలాండ్‌తో క్రైస్ట్‌చర్చ్ వేదికగా జరుగుతున్న రెండో టెస్టు తొలి రోజు బుమ్రా విభిన్నమైన రన్‌అప్‌తో బౌలింగ్‌కు రావడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా రెండు చేతులతో బంతిని పట్టుకొని, తనదైన ప్రత్యేక శైలిలో పరుగెత్తుకుంటూ వచ్చి బౌలింగ్ చేసే బుమ్రా.. ఈసారి ఒక చేతిలో బంతిని పట్టుకొని మరో చేతిని వేరుగా ఉంచి క్రీజు వైపు పరుగెత్తాడు. దీంతో అతడి బౌలింగ్ శైలిలో మార్పు ఎందుకు వచ్చిందన్న చర్చ మొదలైంది. **ఒక చేతిలో బంతితో కొత్త ప్రయోగం** బుమ్రా బౌలింగ్ యాక్షన్ ప్రపంచ క్రికెట్‌లోనే ప్రత్యేకమైనది. అతడి రన్‌అప్, బంతిని విడుదల చేసే విధానం బ్యాటర్లకు సవాలుగా నిలుస్తుంటాయి. అయితే రెండో టెస్టులో అతడు అనుసరించిన కొత్త విధానం అందరి దృష్టిని ఆకర్షించింది. ముఖ్యంగా పరుగెత్తే సమయంలో రెండు చేతులను కలిపి ఉంచకుండా ఒక చేతిలోనే బంతిని పట్టుకొని బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. అతడి అడుగుల కదలికల్లోనూ స్వల్ప మార్పు కనిపించింది. బంతిని విడుదల చేసే సమయంలో మాత్రం సాధారణ బౌలింగ్ యాక్షన్‌లో పెద్దగా మార్పు కనిపించలేదు. ఈ దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. **ముందుగానే సాధన చేశాడన్న ఆకాష్ దీప్** బుమ్రా కొత్త బౌలింగ్ విధానంపై భారత జట్టు సహచరుడు ఆకాష్ దీప్ ఆసక్తికర విషయాన్ని వెల్లడించాడు. మ్యాచ్ అనంతరం మీడియా సమావేశంలో ఈ మార్పుపై ప్రశ్నించగా.. బుమ్రా ప్రాక్టీస్ మ్యాచ్‌కు ముందే ఇలాంటి బౌలింగ్‌ను సాధన చేశాడని తెలిపాడు. అతడి మనసులో ఏదో ప్రత్యేకమైన ప్రణాళిక ఉండి ఉంటుందని, అందుకే ఈ విధంగా ప్రయత్నిస్తున్నాడని పేర్కొన్నాడు. బుమ్రా ఏం చేసినా ఒక ఆలోచనతోనే చేస్తాడని అతడిపై నమ్మకం వ్యక్తం చేశాడు. దీంతో ఈ మార్పు అకస్మాత్తుగా తీసుకున్న నిర్ణయం కాదని స్పష్టమవుతోంది. అయితే దాని వెనుక ఉన్న అసలు వ్యూహాన్ని బుమ్రా వెల్లడించలేదు. **వికెట్లు దక్కకపోయినా పరుగుల నియంత్రణ** రెండో టెస్టు తొలి రోజు బుమ్రా 19 ఓవర్లు బౌలింగ్ చేసి 37 పరుగులు మాత్రమే ఇచ్చాడు. నాలుగు ఓవర్లు మెయిడిన్లు వేశాడు. అయితే ఒక్క వికెట్ కూడా సాధించలేకపోయాడు.

సహచర ఆటగాడిపైనే హర్షిత్ రాణా ఆగ్రహం!

షాబాజ్ అహ్మద్‌పై అసభ్య పదజాలం.. వైరల్‌గా మారిన వీడియో.. యువ పేసర్ తీరుపై అభిమానుల విమర్శలు



భారత యువ పేసర్ హర్షిత్ రాణా మరోసారి వివాదంలో చిక్కుకున్నాడు. ఆసియా కప్ రైజింగ్ స్టార్స్ సెమీఫైనల్‌లో శ్రీలంక-ఏతో జరిగిన మ్యాచ్ సందర్భంగా సహచర ఆటగాడు షాబాజ్ అహ్మద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసిన ఘటన చర్చనీయాంశంగా మారింది. షాబాజ్‌ను ఉద్దేశించి హర్షిత్ అసభ్య పదజాలం ఉపయోగించినట్లు కనిపిస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో అభిమానులు విమర్శలు గుప్పిస్తున్నారు. **బంతి ఆపినా తగ్గని ఆగ్రహం** మ్యాచ్‌లో హర్షిత్ రాణా బౌలింగ్ చేస్తున్న సమయంలో శ్రీలంక బ్యాటర్ కొట్టిన బంతిని ఫీల్డింగ్ చేస్తున్న షాబాజ్ అహ్మద్ బౌండరీ వద్ద అడ్డుకున్నాడు. అయితే బంతిని తిరిగి విసరడంలో కొంత ఆలస్యం కావడంతో బ్యాటర్లు రెండు పరుగులు తీశారు. దీంతో అసహనానికి గురైన హర్షిత్.. షాబాజ్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఈ క్రమంలో అసభ్య పదజాలం ఉపయోగించినట్లు వీడియోలో వినిపించడంతో వివాదం మొదలైంది. **షాబాజ్ ప్రదర్శనపై ప్రశంసలు** అదే మ్యాచ్‌లో షాబాజ్ అహ్మద్ బ్యాటింగ్‌లో అద్భుతంగా రాణించాడు. 48 బంతుల్లో అజేయంగా 54 పరుగులు సాధించాడు. ఇందులో నాలుగు సిక్సర్లు ఉన్నాయి. బౌలింగ్‌లోనూ ఒక వికెట్ పడగొట్టాడు. జట్టు కోసం రెండు విభాగాల్లోనూ కష్టపడిన ఆటగాడిపై హర్షిత్ ఇలా వ్యవహరించడం సరికాదని అభిమానులు అభిప్రాయపడుతున్నారు. **భారత్-ఏకు ఘోర పరాజయం** తొలుత బ్యాటింగ్ చేసిన భారత్-ఏ జట్టు 50 ఓవర్లలో ఎనిమిది వికెట్ల నష్టానికి 317 పరుగులు చేసింది. లక్ష్య ఛేదనలో శ్రీలంక-ఏ జట్టు అద్భుతంగా ఆడింది. లసిత్ క్రూస్‌పుల్లె 116, సినెత్ జయవర్ధనే 105 పరుగులతో శతకాలు సాధించారు. దీంతో శ్రీలంక-ఏ జట్టు కేవలం 41.3 ఓవర్లలోనే రెండు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని చేరుకుంది. ఎనిమిది వికెట్ల తేడాతో విజయం సాధించి ఫైనల్‌కు దూసుకెళ్లింది. హర్షిత్ రాణా ఏడు ఓవర్లలో 61 పరుగులు ఇచ్చి ఒక వికెట్ మాత్రమే తీశాడు. **దూకుడుతో పాటు క్రమశిక్షణ అవసరం** క్రికెట్‌లో దూకుడు ఆటగాళ్లకు అవసరమే. ముఖ్యంగా ఫాస్ట్ బౌలర్లు ప్రత్యర్థిపై ఒత్తిడి పెంచేందుకు దూకుడుగా వ్యవహరిస్తుంటారు.

స్టార్‌డమ్ పక్కనపెట్టిన జగపతిబాబు.. వర్కర్లతో కలిసి భోజనం



సినిమాల్లో క్రూరమైన విలన్‌గా భయపెట్టే నటుడు జగపతిబాబు నిజ జీవితంలో మాత్రం ఎంతో ఆత్మీయంగా మెలుగుతాడు. వెండితెరపై ఎంతటి గంభీరమైన పాత్రలు పోషించినా బయట చాలా సరదాగా ఉంటాడు. చిత్ర పరిశ్రమలో అగ్ర నటుడిగా ఎంతో గుర్తింపు ఉన్నప్పటికీ ఎలాంటి స్టార్ డమ్ ప్రదర్శించడు. ప్రతి ఒక్కరితో సమానంగా కలిసిపోతూ తన ప్రత్యేకతను చాటుకుంటారు.
తాజాగా ఆయన పంచుకున్న ఒక దృశ్యం సోషల్ మీడియాలో అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. తన వద్ద పనిచేసే వర్కర్లతో కలిసి ఆయన స్వయంగా భోజనం చేశాడు. పనివారి కోసం బయటి నుంచి ప్రత్యేకంగా రుచికరమైన ఆహారాన్ని తెప్పించాడు. అదే సమయంలో వారు తమ ఇళ్ల నుంచి తెచ్చుకున్న సాధారణ భోజనాన్ని తానే స్వయంగా ఎంతో ఇష్టంగా తిన్నాడు.
పనివారితో కలిసి సరదాగా మాట్లాడుతూ గడిపిన ఈ క్షణాలను ఆయన 'ఎక్స్' వేదికగా అభిమానులతో పంచుకున్నాడు. హోదా, అంతస్తుల తేడాలు చూపించకుండా మనుషులకు విలువనిచ్చే ఆయన తీరును చూసి నెటిజన్లు ఆశ్చర్యపోతున్నారు. సామాన్యులతో ఇంత సులువుగా కలిసిపోయే వ్యక్తిత్వం నిజంగా అరుదని ప్రశంసిస్తున్నారు. నటుడిగా ఎంత ఎదిగినా ఒదిగి ఉండే ఆయన నిరాడంబరతకు ఫిదా అవుతున్నారు. ప్రస్తుతం ఈ వీడియో ఇంటర్నెట్‌లో తెగ చక్కర్లు కొడుతూ విస్తృతంగా ట్రెండ్ అవుతోంది.

'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ రిలీజ్

అమాయకపు కోర్టు స్టెనోగా నితిన్..

టాలీవుడ్ యువ కథానాయకుడు నితిన్ నటించిన సరికొత్త వింటేజ్ రొమాంటిక్ కామెడీ డ్రామా 'అలియాస్ రుక్మిణీ' థియేట్రికల్ ట్రైలర్ గురువారం విడుదలైంది. నేచురల్ స్టార్ నాని సమర్పణలో, 'యునానిమస్ ప్రొడక్షన్స్' పతాకంపై దీప్తి గంటా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహించారు. 2000 దశకం నాటి వింటేజ్ నేపథ్యంలో నడిచే ఈ కథలో నితిన్ లుక్, పాత్ర స్వభావం సరికొత్తగా ఆకట్టుకుంటున్నాయి.
ట్రైలర్ ప్రకారం.. నితిన్ ఇందులో 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగ్రాఫర్ పాత్రలో నటిస్తున్నారు. కళ్లద్దాలు పెట్టుకుని, పైకి ఎంతో అమాయకంగా, పద్ధతిగా కనిపించే ఈ యువకుడి వెనుక ఒక పెద్ద రహస్యం దాగి ఉంటుంది. ఇంట్లో వాళ్లు "కోరికలే గుర్రాలైతేనా.. ఇవి చదువుతున్నాడా?" అని కంగారు పడుతుంటే.. "చదవట్లేదు.. రాస్తున్నాడు!" అంటూ రివీల్ అయ్యే సీక్రెట్ నవ్వులు పూయిస్తోంది. తన అసలు గుర్తింపు దాచి, ఒక అమ్మాయి కలం పేరుతో ఆ పుస్తకాలు రాస్తున్నట్లు కథనం ద్వారా స్పష్టమవుతోంది. ట్రైలర్ ముగింపులో కథానాయిక ఆఫియా సయ్యద్.. "ఇప్పుడు మిమ్మల్ని ఏమని పిలవాలి? కృష్ణ అనా లేకపోతే రుక్మిణీ అనా?" అని అడిగే డైలాగ్ టైటిల్ వెనుక ఉన్న ట్విస్ట్‌పై మరింత ఆసక్తిని పెంచుతోంది.
ట్రైలర్‌లో చూపించిన పెళ్లిచూపుల సన్నివేశాలు చాలా సహజంగా, నేటి యువతను ఆకట్టుకునేలా ఉన్నాయి. వరుసగా ముగ్గురు తిరస్కరించిన తర్వాత నాలుగో పెళ్లిచూపులకు వెళ్లిన హీరో.. "నన్ను కలవడానికి మీరు ఎంతమందిని రిజెక్ట్ చేశారో తెలుసుకుందామని అడిగాను" అని చెప్పే సంభాషణలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం డిసెంబరు 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. జోమోన్ టి.జాన్ కెమెరా పనితనం, విజయ్ బుల్గానిన్ అందించిన నేపథ్య సంగీతం సినిమా వింటేజ్ ఫీల్‌ను మరింత పెంచాయి. తన కెరీర్‌లోనే ఇది ఉత్తమ చిత్రంగా నిలుస్తుందని నితిన్ ఇప్పటికే ధీమా వ్యక్తం చేశాడు.



తొలి చూపులోనే ఫిదా -ఆఫీయా సయ్యద్



టాలీవుడ్ లో నేచురల్ స్టార్ నాని కొత్త కథలను ఎంకరేజ్ చేయడంలో ఎప్పుడూ ముందుంటారు. ఆయన సమర్పణలో నితిన్ హీరోగా వస్తున్న 'అలియాస్ రుక్మిణీ' ట్రైలర్ ఇప్పుడందరినీ ఆకట్టుకుంటోంది. అయితే ఈ ట్రైలర్‌లో నితిన్ సరసన కనిపించిన అమ్మాయి ఎవరనే చర్చ మొదలైంది. తొలిచూపులోనే తన సహజమైన నటనతో ఫిదా చేస్తున్న ఆ బ్యూటీ మరెవరో కాదు, ఆఫీయా సయ్యద్. ఆమె బ్యాక్ గ్రౌండ్ తెలిస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఆ విశేషాలు చూద్దాం..
ఆఫీయా సయ్యద్ సాధారణ కుటుంబం నుంచి వచ్చిన అమ్మాయి కాదు. బాలీవుడ్‌లో ఎన్నో బ్లాక్‌బస్టర్ చిత్రాలను నిర్మించిన ప్రముఖ నిర్మాత సాజిద్ నడియాద్వాలా మేనకోడలు ఆమె. అంత పెద్ద సినీ నేపథ్యం ఉన్నా, తనకంటూ సొంత గుర్తింపు తెచ్చుకోవాలనే ఆలోచనతో అడుగులు వేస్తోంది. ఇక అక్టోబర్ 2న విడుదలైన 'ప్రేమ్ కీతను' అనే హిందీ సినిమాతో బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి, ఇప్పుడు డిసెంబర్ 4న 'అలియాస్ రుక్మిణీ'తో తెలుగు ప్రేక్షకులను పలకరించబోతోంది. మురళీకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో నితిన్ 'కృష్ణ' అనే ఫ్యామిలీ కోర్టు స్టెనోగా కనిపిస్తాడు. పైకి ఎంతో అమాయకంగా కనిపించే అతను, రహస్యంగా ఒక అమ్మాయి పేరుతో రొమాంటిక్ పుస్తకాలు రాస్తుంటాడు. ఆ కథలో 'రుక్మిణీ' అనే పేరుకు, ఆఫీయా పాత్రకు ఉన్న లింక్ ట్రైలర్‌లో భలే ఫ్రెష్‌గా అనిపించింది. ఇక పెళ్లిచూపుల సీన్లలో నితిన్, ఆఫీయా మధ్య వచ్చే సంభాషణలు యూత్‌కు ఇట్టే కనెక్ట్ అయ్యేలా ఉన్నాయి

రాజకీయాలపై మక్కల్ సెల్వన్ మనసులో మాట!

మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి స్టార్ డమ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. కోట్లాది మంది అభిమానులున్న బిగ్ స్టార్. హీరో అయినా? విలన్ అయినా? ఇంకెలాంటి పాత్ర అయినా? అందులో అభినయించాలంటే సేతుపతి ఉండాల్సిందే అంటారు. అతడి ట్యాలెంట్ చూసి ఫ్యూచర్ సూపర్ స్టార్ రజనీకాంత్ లా ఎదుగుతాడని కెరీర్ ఆరంభంలోనే మాట్లాడుకున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా రాజకీయాలపై సేతుపతి మనసులో మాటను బయటపెట్టారు. చాలామంది నటులు సినిమాల్లో రాణించిన తర్వాత పాలిటిక్స్ వైపు అడుగులు వేస్తుంటారు. కానీ విజయ్ సేతుపతి ఆలోచన మాత్రం అందుకు భిన్నంగా ఉండటం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. తనకు ప్రస్తుతానికి రాజకీయాల్లోకి వచ్చే ఆలోచన లేదని సినిమాలే మొదటి ప్రాధాన్యత అని తేల్చి చెప్పారు. ఇతరుల కోసం కాకుండా మనస్ఫూర్తిగా ఏదైనా చేయాలనే తపన ఉంటేనే రాజకీయాల్లోకి రావాలని అభిప్రాయపడ్డారు. పేరు కోసమో? అధికారం కోసమో? పాలిటిక్స్‌లోకి వెళ్లే మనస్తత్వం తనది కాదని స్పష్టం చేశారు. సమాజంలోని సమస్యలపై స్పందించడం వేరు. రాజకీయాల్లో క్రియాశీలకంగా ఉండటం వేరు అని సేతుపతి అన్నారు. సాధారణ పౌరుడిగా తనకు నచ్చిన విషయాలపై మాట్లాడే హక్కు ఎప్పుడూ ఉంటుందన్నారు. సినిమా రంగంలో ఇంకా చేయడానికి చాలా ఉందని కొత్త కథలు, కొత్త పాత్రలతో ప్రేక్షకులను అలరించడమే లక్ష్యమని చెప్పుకొచ్చారు. తమిళనాడులో సినీ తారల రాజకీయ ఎంట్రీ ఎప్పుడూ హాట్ టాపిక్‌గానే ఉంటుంది. ఈ క్రమంలో విజయ్ సేతుపతి కూడా భవిష్యత్తులో పార్టీ పెడతారా లేక ఏదైనా పార్టీకి మద్దతు ఇస్తారా అనే ఊహాగానాలు గతంలో చాలాసార్లు వచ్చాయి. వాటన్నింటికీ సేతుపతి మాటలతో చెక్ పెట్టారు. తాను ఎవరికీ పోటీ కాదని.. తన దారి తనదేనని చెప్పకనే చెప్పారు.



షార్ట్‌ఫిలింతో సత్తా చాటి..

ఆస్కార్ బరిలో తెలుగమ్మాయిలు



ఆస్కార్ పురస్కారాలకు ఇప్పటకే భారత్ నుంచి 'గోంధల్', 'అంగ్' ఉత్తమ చిత్రాల అంతర్జాతీయ చిత్రం విభాగంలో పరిశీలనకు ఎంపికైన సంగతి తెలిసిందే. అయిత మరో ఘు చిత్రం కూడా ఆస్కార్ అకాడమీ పరిశీలనకు అర్హత సాధించింది కన్నడ-తెలుగు షార్ట్ ఫిలిమ్ 'పంకజ'.. దర్శకురాలు అనూయ స్వామితో పాటు ప్రధాన పాత్రలో నటించిన హర్షిణి బోయళ్ల కూడా తెలుగు వారే కావడం విశేషం. ఈ ఇద్దరు బెంగళూరులో పుట్టి పెరిగారు. భాషలునేర్చుకోండి బెంగళూరులోని ఓ మురికి వాడలో నివసించే కుటుంబాల నేపథ్యంలో 'పంకజ'ను తెరకెక్కించారు. పంకజ అనే మహిళ.. కనిపించకుండా పోయిన తన భర్తను కుమార్తెతో కలిసి వెతికే క్రమంలో ఎదురైన అనుభవాలనే ఈ చిత్ర కథాంశం. ఈ షార్ట్ ఫిలిమ్. ప్రతిష్ఠాత్మక సన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్ సహా 40కిపైగా అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో ప్రదర్శితమైంది. రెయిన్‌డ్యాన్స్ ఫిలిం ఫెస్టివల్‌లో విజేతగా నిలవడం ద్వారా ఆస్కార్ పరిశీలనకు అర్హత సాధించింది.



'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో సంచలన పోస్ట్ చేసిన ఆర్‌జీవీ

సంచలన దర్శకుడు రామ్ గోపాల్ వర్మ 'ఏఐ ట్రూత్ బాంబ్' పేరుతో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఏఐని ఉపయోగించే వ్యక్తులు, దానిని ఉపయోగించని వారిని భర్తీ చేస్తారని (రీప్లేస్ చేస్తారని) ఆయన స్పష్టం చేశారు. ఏఐ కారణంగా ఉద్యోగాలు పోతున్నాయన్న ఆందోళనపై తనదైన శైలిలో సుదీర్ఘ విశ్లేషణను సోషల్ మీడియాలో పంచుకున్నారు.
ఉద్యోగ రంగంలో ఏఐ ప్రభావంపై తన ఆలోచనలను పంచుకుంటూ.. "చాలా మంది ఉద్యోగులు ఏఐ తమ ఉద్యోగాలను దొంగిలిస్తోందని గట్టిగా అరుస్తున్నారు, కానీ నిజానికి వారే తమను తాము 'దొంగిలించుకుంటున్నారు'" అని వర్మ వ్యాఖ్యానించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోడ్ రాయడానికి, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఐడియాల కోసం, అనలిస్ట్ డేటా విశ్లేషణకు చాట్‌జీపీటీ, క్లాడ్, మిడ్‌జర్నీ వంటి ఏఐ టూల్స్‌ను రహస్యంగా వాడుతున్నారని ఆయన వివరించారు. తాము కష్టపడి చేసినట్టుగా ఆ పనిని పైఅధికారుల ముందు ప్రెజెంట్ చేస్తున్నారని పేర్కొన్నారు. "ప్రతి ఒక్కరూ దీన్ని రహస్యంగా చేస్తున్నారు, కానీ ఎవరూ ఒప్పుకోవడం లేదు. అయితే, కంపెనీలకు ఈ విషయం గణాంకాల రూపంలో తెలిసిపోతుంది" అని వర్మ అన్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com